ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-9-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 221 పేజీలు: 10+4 వెల: 6.50

బ్రిక్స్ సదస్సుకు ముందు మోడీ, పుతిన్ భేటీ

యుఎన్ కొత్త మ్యాప్‌లో మళ్లీ తేడాలు!

5లో



## ప్రధాని పర్యటన వేళ.. ముంబైలో కలకలం

2లో

పిఎంఒ అధికారి పేరుతో నకిలీ గుర్తింపు కార్డు గుర్తింపు

మరో నకిలీ బాడీగార్డు.. అనుమానితులిద్దరూ అరెస్టు



## రాహుల్ గాంధీ ఉన్న ఎయిరిండియా విమానానికి ల్యాండింగ్ ట్రబుల్

వైసిపికి బిగ్ షాక్

## సైకిలెక్కిన మజ్జి శ్రీను

టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సిఎం చంద్రబాబు

వైసిపికి రాజీనామా చేసిన విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి

పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా... అధ్యక్షుడు జగన్‌కు లేఖ

కుమార్తె సిరి సహస్ర, అనుచరులతో కలిసి టిడిపిలో చేరిన శ్రీనివాసరావు

మేనమామ బొత్స సత్యనారాయణతో విభేదాలే కారణమా?



మంగళవారం సిఎం చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిన మజ్జి శ్రీనివాసరావు ఆయన కుమార్తె సిరి సహస్ర

**విజయవాడ, విజయనగరం, మంగళగిరి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉత్తరాంధ్ర రాజకీయాల్లో, ముఖ్యంగా వైసిపిలో ప్రకంపనలు రేగాయి. ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లాలో బలమైన నేతగా ఉన్న మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు పసుపు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చిన్న శ్రీనుతో పాటు ఆయన కుమార్తె సిరి సహస్ర, అనుచరులు కూడా టిడిపిలో చేరారు. >>2



మంగళగిరి టిడిపి కార్యాలయంలో మంగళవారం లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ రెండోరోజుకు హాజరైన పార్టీ నేతలు

## జనంలోనే ఉండాలి.. పట్టు సాధించాలి!

చేసిన, చేస్తున్న అభివృద్ధి- సంక్షేమం గురించి చెప్పండి

పబ్లిక్ గ్రీవెన్సులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉండండి

గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టండి

జెన్ జీ ఆలోచనలు పరిగణనలోకి తీసుకోండి

ఆ దిశగా మన నిర్ణయాలు ఉండాలి

టిడిపి లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో పార్టీ శ్రేణులకు అధినేత చంద్రబాబు దిశానిర్దేశం

**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టిడిపి జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీఎమ్మెల్యేలు, నేతలకు పిలుపునిచ్చారు. చేసిన అభివృద్ధి - సంక్షేమం గురించి ప్రజలకు చెప్పుకోవాలని సిఎం చంద్రబాబు టిడిపి శ్రేణులకు నిర్దేశించారు. కూటమి ప్రభుత్వంపై ఆయాఅంశాల్లో వైసిపి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పేర్కొన్నారు. అభివృద్ధి- సంక్షేమంలో సోషల్ మీడియా సహా వివిధ మార్గాల్లో అందరినీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎన్టీఆర్ భవన్‌లో టిడిపి లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈకాన్‌క్లేవ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, పొలిట్‌బ్యూరో సభ్యులు, జోనల్ ఇన్‌ఛార్జులు హాజరయ్యారు. సిఎం చంద్రబాబు మాట్లాడుతూ వివిధవర్గాలకు మేలు చేసేలా అమలు చేస్తోన్న ప్రభుత్వ కార్యక్రమాలను ప్రమోట్ చేయాలని ఆదేశించారు. పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించేలా చర్యలు చేపట్టా >>2

## టిడిపి 3.0 వెర్షన్

● కలిసికట్టుగా రాష్ట్రాన్ని, పార్టీని నడిపిద్దాం ● పార్టీ, పర్సనల్, ప్రభుత్వం.. మూడు 'ప్లి' లను అందరూ పాటించాలి ● కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలి ● డిఎస్సీకి, ఎపిపిఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ ● టిడిపి లీడర్ షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్



**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** "ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు అందరం కలిసి చర్చిద్దాం. పార్టీ ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ తూచా తప్పకుండా పాటించాలి. నేను ఏనాడూ లక్ష్మణరేఖ దాటలేదు. ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత పార్టీ లైన్‌కు అందరూ కట్టుబడి ఉండాలి. ఇగోలు, అహంకారం వద్దు, సింప్లిసిటీ పాటించాలి. నో ఇగో, ఓన్లీ సర్వీస్. ప్రజలకు సేవ చేద్దాం. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే అన్న ఎన్టీఆర్ నినాదం నేటికీ వర్తిస్తుంది" అని టిడిపి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పిలుపునిచ్చారు. కార్యకర్తల పోరాటం, త్యాగాల వల్లే అధికారంలోకి వచ్చామని, ఎన్నికల్లో గెలవాలంటే బలహీనతల్ని గుర్తించి అధిగమించాలని లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్ షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో మంత్రి మాట్లాడుతూ 'మనందరం నాయకులుగా ఇక్కడ కూర్చొన్నామంటే అందుకు కారణం కార్యకర్తల త్యాగం. తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, మంజులవంటి కార్యకర్తలపై ఆనాడు దాడులకు పాల్పడ్డారు. కొంతమందిని హతమార్చారు. వారి పోరాటంవల్లే మనంఅధికారంలోకివచ్చాం. దీనిని అందరూ గుర్తుపెట్టుకోవాలి. ఇది రొటీన్ కాంక్లేవ్ కాదు. నాయకులకు శిక్షణఇచ్చేందుకే ఈ కాంక్లేవ్ పెట్టాం. కార్యకర్తలకు, ప్రజలకు ఎలా దగ్గరకావాలి, పార్టీ బలోపేతం కోసం ఏం చేయాలనే అంశాలపై చర్చించేందుకు ప్రతిమూడు నెలలకోసారి కాంక్లేవ్ నిర్వహిస్తాం' అని పేర్కొన్నారు.

**ఎన్నికల్లో గెలవాలంటే బలహీనతల్ని గుర్తించి అధిగమించాలి:** "2019లో మంగళగిరిలో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆనాడు అనేక >>2

## 'సోషల్'గా మూవ్‌కండి!

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు విస్తృతంగా జనంలోకి తీసుకుని వెళ్లాలి

ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండటం వల్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది

పార్టీ నేతలు సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించాలి

టిడిపి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ పిలుపు

3లో



క్లస్టర్ల వారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటు

పార్వతీపురం మన్యంలో నిర్మాణ పనులు ప్రారంభం

ఎంపి ల్యాడ్స్‌తో ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్‌కు మరమ్మత్తులు

డి.సిఎం దిశానిర్దేశంతో పిటికొప్పాక ఆరోగ్య కేంద్రం పనులు పునఃప్రారంభం

హస్తకళాకారుల సర్వతోముఖాభివృద్ధి దిశగా చర్యలు వేగవంతం

## హస్తకళాకారులకు చేయూత!

**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** మన సంప్రదాయ హస్తకళల వారసత్వ పరిరక్షణ, హస్తకళాకారులకు చేయూత ఇచ్చేందుకు చేపట్టిన కార్యక్రమాలను వేగవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. హస్తకళాకారుల సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన మార్కెటింగ్ వసతుల కల్పనద్వారా మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యరక్షణ తదితర అంశాలను అత్యంత ప్రాధాన్యతా క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ముఖ్యంగా క్లస్టర్లవారీగా నిర్మించతలపెట్టిన కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటు వివరాలు అధికారులనుంచి పొందారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవ ప్రారంభోత్సవం కార్యక్రమంలో విభిన్న హస్తకళలను వారసత్వంగా ముందుకు తీసుకువెళ్తున్న కళాకారులతో మమేకమయ్యారు. స్వయంగా వారితోమాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించి, స్వీయ పర్యవేక్షణలో ముందుకుతీసుకువెళ్తున్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళలఅభివృద్ధి సంస్థతోపాటు జిల్లా యంత్రాంగంతో నిరంతరం సమీక్షిస్తూ హస్తకళాకారులకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్నారు.

**విబి జి రామ్ జి నిధులతో సవర కళాకారులకు సిద్ధమవుతున్న కామన్ ఫెసిలిటీ సెంటర్:** క్లస్టర్ల వారీగా హస్తకళాకారులకు శిక్షణ, వారు రూపొందించిన కళాఖండాలను భద్రపరుచుకోవడం, ప్రదర్శనకు ఉంచడం, మార్కెటింగ్ తదితర కార్యకలాపాల నిమిత్తం కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేయాలని హస్తకళా మహోత్సవంలో పలువురు కళాకారులు అడగగా, ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి హామీఇచ్చారు. తక్షణం అందుకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఇప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు, లేపాక్షి అధికారులకు స్థల సేకరణ, నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలని స్పష్టం >>2

## పట్టణాల అభివృద్ధి

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

రోడ్లు, పార్కులు, సెంట్రల్ లైటింగ్ పనులు

రూ. 4,720 కోట్ల అంచనాతో టెండర్లు

హైబ్రిడ్, యాన్యుటి పద్ధతిలో అభివృద్ధి పనులు

ప్రజా ఆరోగ్య శాఖ ఇంజనీరింగ్ చీఫ్ ఉత్తర్వులు

**రాజంపేట, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, స్థానిక సంస్థలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. హైబ్రిడ్, యాన్యుటి పద్ధతిలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రజా ఆరోగ్య శాఖ ఇంజనీరింగ్ చీఫ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని 5 మున్సిపల్ పట్టణ అభివృద్ధి శాఖ సర్కిళ్ల పరిధిలో పనులను ప్యాకేజీలుగా విభజించి చేపట్టేందుకు టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. రూ.4720 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులను చేపట్టనున్నారు. పట్టణాల్లో రోడ్లు, పార్కులు, సెంట్రల్ లైటింగ్ ఇతర అభివృద్ధి పనులు చేపడతారు. అనంతపురం రీజియన్ పరిధిలో రూ.1100 కోట్లతో చేపట్టేందుకు పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించారు. నెల్లూరు రీజియన్ పరిధిలో రూ.974 కోట్లతో మూడు ప్యాకేజీలతో టెండర్లు పిలిచారు. గుంటూరు రీజియన్ పరిధిలో రూ.977 కోట్లతో మూడు ప్యాకేజీలుగా పనులు విభజించారు. రాజమండ్రి రీజియన్‌లో రూ.1017 కోట్లతో నాలుగు ప్యాకేజీలుగా పనులు చేపడతారు. విశాఖపట్నం రీజియన్‌లో ఒకే ప్యాకేజీలో రూ.252 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతారు. ఈ టెండర్లలో పాల్గొనేందుకు తుది గడువు ఈనెల 22గా నిర్ణయించారు. హైబ్రిడ్ యాన్యుటి పద్ధతిలో జరుగుతున్న ఈ అభివృద్ధి పనులకు గుత్తేదారుల నుంచి ఏ మేరకు స్పందన ఉంటుందో వేచి చూడాల్సి ఉంది.



## 32కే ఉల్లి

రైతు బజార్లు, మొబైల్ కౌంటర్ల ద్వారా విక్రయాలు

చౌకడిపోల్లో రాయితీపై కందిపప్పు, పామాయిల్

రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** "బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంచేలా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నది. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కిలో ఉల్లి పాయలను రూ.32లకే అందించేందుకు సిద్ధమవుతున్నాం. రాష్ట్రవ్యాప్తంగాఉన్న 115 రైతు బజార్లు, అలాగే మొబైల్ కౌంటర్ల ద్వారా ప్రజలందరికీ ఉల్లి రాయితీ ధరకే అందిస్తాం" అని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. కేంద్ర పౌర సరఫరాల శాఖ, నేషనల్ కో ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్.సి.సి.ఎఫ్.) అధికారులతో జరిగిన వరుస భేటీల్లో రాష్ట్రానికి రాయితీ ధరల్లో ఉల్లిని, కందిపప్పు, పామాయిల్‌ను అందించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. రెండ్రోజుల ఢిల్లీ పర్యటన అనంతరం మంగళవారం నాదెండ్ల మనోహర్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. "ఎల్‌నినో పరిస్థితుల పేరుచెప్పి, ఇతరత్ర కారణా >>2

## చిరంజీవి కుమార్తె సుస్మితకు కీలక పదవి

కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితురాలిగా నియామకం



**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ కేంద్ర మంత్రి చిరంజీవి కుమార్తె, సినీ నిర్మాత కొణిదెల సుస్మితకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు లభించాయి. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డులో ఆమెను ప్రత్యేక ఆహ్వానితురాలిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి కన్నబాబు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంతో సుస్మిత ఇకపై దుర్గమ్మ ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామి కానున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు కల్పిస్తున్న వసతులు, ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులు, దసరా నవరాత్రులు వంటి ప్రత్యేక ఉత్సవాల నిర్వహణపై ఆమె ట్రస్ట్ బోర్డుకు తగిన సలహాలు, సూచనలు అందిస్తారు. సుస్మిత కొణిదెల 'గోల్డ్ బాక్స్ >>2

## 13రోజులకే పాస్‌పోర్ట్

ప్రపంచ రికార్డు, 13 రోజులకే అగస్థ్య ప్రిన్సి పాపకు పాస్ పోర్ట్

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** 'అతి పిన్న వయసులో పాస్ పోర్ట్ పొందిన చిన్నారి'గా వజ్రపు అగస్థ్య ప్రిన్సీ ప్రపంచ రికార్డు సాధించింది. శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురానికి చెందిన వజ్రపు అగస్థ్య ప్రిన్సీ కేవలం 13 రోజుల వయసులోనే పాస్ పోర్టు పొందడంద్వారా ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది.గతంలో 19 రోజుల వయసున్న చిన్నారి పేరిట ఉన్న రికార్డును అధిగమించి, కేవలం 13 రోజాల వయసులోనే పాస్ పోర్టు పొందిన చిన్నారిగా అగస్థ్య ప్రిన్సీ సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఈ ఘనతను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రపంచ రికార్డుగా గుర్తించింది. తండ్రి వజ్రపు ఆశిష్ లండన్‌లో బిజినెస్ చేస్తున్నారు. భార్య మాధురికూడా లండన్‌లో ఉంటున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త వజ్రపు వెంకటేష్ అనూష దంపతుల మనుమరాలు. అగస్త్య అమ్మమ్మ గారింట్లో రాజమండ్రిలో జన్మించింది. ఈ యేడాది మే 30న జన్మించగా జూన్ 12న పాస్ పోర్ట్ పొందింది.



వడోదరలో మంగళవారం వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ

# ప్రధాని పర్యటన వేళ.. ముంబైలో కలకలం

**ముంబై, సెప్టెంబరు 8:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరుకానున్న ముంబైలోని బాంద్రాకుర్లా కాంప్లెక్స్‌లో ఉన్న నీతా ముఖేశ్ అంబానీ కల్చరల్ సెంటర్ నుంచి ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ముందురోజు అర్ధరాత్రి భద్రతా ప్రోటోకాల్ డ్రిల్ సందర్భంగా చోటుచేసుకున్నట్లు ముంబై పోలీసులు మంగళవారం తెలిపారు.అదుపులోకి తీసుకున్న వారిలో 24 ఏళ్ల యువకుడు తాను ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఓ) అధికారినని చెప్పుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అతడి వద్ద నుంచి నకిలీ పీఎంఓ గుర్తింపు కార్డును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం అతడిని రోహన్ పారేఖ్‌గా గుర్తించారు.అతడితో పాటు ఓ బాడీగార్డ్ కూడా ఉన్నాడని, అతడి వద్ద నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. నకిలీ గుర్తింపు కార్డుతో పాటు తుపాకీతో వేదిక వద్దకు ఎందుకు వచ్చారు వారి ఉద్దేశం ఏమిటనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇద్దరి మొబైల్ ఫోన్లు, గుర్తింపు పత్రాలు, ఇతర వస్తువులను పరిశీలిస్తున్నారు.ఈ ఘటన తీవ్రత దృష్ట్యా దర్యాప్తును ముంబై క్రైమ్ బ్రాంచ్ చేపట్టింది. ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ అయిన తర్వాత తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అదుపులో ఉన్న ఇద్దరినీ మంగళవారం కిల్లా కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం సాయంత్రం 5.45 గంటల సమయంలో ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026 ఏడో ఎడిషన్‌ను ప్రారంభించనున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద, ప్రభావవంతమైన వార్షిక ఫిన్‌టెక్ సదస్సుల్లో ఒకటైన జీఎఫ్ఎఫ్ 2026 నాలుగు రోజుల పాటు జరగనుంది.

# ఉద్యోగాలడిగితే కేసులు పెడతారా?

## -వైసిపి అధినేత వైఎస్ జగన్

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** మెగా పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ కాకినాడలో శాంతియుతంగా నిరసన తెలిపిన నిరుద్యోగ యువతపై చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం పోలీసు కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానట్లు వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రకటించారు.ఆయన "ఎక్స్" వేదికగా చేసిన పోస్టులో ప్రభుత్వంపై ప్రశ్నలు,విమర్శలు గుప్పించారు..శ్యామ్, టి.రాజా, ఎం.గంగ సూరిబాబు, రాజేష్‌తో పాటు 20 మంది పోలీసు ఉద్యోగార్థులు చేసిన నేరమేమిటి?'బాబూ.. జాబులేవి? అని ప్రశ్నించడమేనా నేరం? ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని అడగడం కూడా తప్పా? ప్రజలు తాము ఎన్నుకున్న ప్రభుత్వాన్ని శాంతియుతంగా ప్రశ్నించడం కూడా ఆంధ్రప్రదేశ్‌లో నేరంగా మారిందా?.ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 20 లక్షల మంది నిరుద్యోగులకు ఈ లెక్కన ఏడాదికి రూ.7,200 కోట్లు, మూడేళ్లకు రూ.21,600 కోట్లు చెల్లించాలి. కానీ ఇటు ఉద్యోగాలు ఇవ్వకుండా, అటు నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను మోసం చేసిన ఈ వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు తమ హక్కుల కోసం ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతోంది.మెగా డీఎస్సీలో రోజుకొక మోసం బయటపడుతుంటే సమాధానం చెప్పలేక చంద్రబాబు, నారా లోకేష్ ఇద్దరూ అణచివేత, నిర్బంధం, బెదిరింపులకు దిగుతు న్నారు. అడ్డదారుల్లో ఉద్యోగాలు పొందిన వారిని కాపాడుతూ.. పారదర్శకంగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరుతున్న అర్హులైన నిరుద్యోగులను నేరస్తులుగా చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం యువత పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానానికి, అప్రజాస్వామిక వైఖరికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది?. వెన్నుపోటు పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ నియామకాల్లో అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు, నిబంధనలకు విరుద్ధమైన నియామకాలు పరిపాటిగా మారాయి. అవినీతి, రాజకీయ పైరవీలతో ఉద్యోగాలను పంచుకోవడంపైనే వెన్నుపోటు పార్టీ దృష్టి తప్ప.. రాష్ట్ర యువత ఆశలు, ఆకాంక్షలను వారు ఏనాడూ గౌరవించలేదు. ప్రతిభకు పట్టం కట్టి, అర్హులకు నిష్పక్షపాతంగా ఉద్యోగాలు కల్పించాలన్న చిత్తశుద్ధి ఈ వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వానికి లేదు.నిరుద్యోగ యువతపై నమోదు చేసిన కేసులన్నింటినీ తక్షణమే, బేషరతుగా ఉపసంహరించాలి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా మెగా పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి. రాష్ట్రంలోని ప్రతి నిరుద్యోగ యువతకు వైయస్సార్‌సీపీ అండగా నిలుస్తుంది. వారికి న్యాయం జరిగే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంది.

# పట్టు సాధించాలి!

>> లని మార్గనిర్దేశం చేశారు. లిక్కర్ స్కాం,వివేకాహత్య,ఎపిపిఎస్సీ అక్రమాలపై గొడ్డలిపార్టీ ఎందుకు మాట్లాడదని సిఎం చంద్రబాబు ప్రశ్నించారు. డిఎస్సీపై కుట్రపూరితంగా గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. కుప్పంలో టీచర్లను బెదిరించే స్థాయికి గొడ్డలి పార్టీకి చెందిన మీడియా దారుణాలకు ఒడిగట్టిందని విమర్శించారు. ఈస్థాయిలో దుష్ప్రచారానికి బరితెగించేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని స్పష్టంచేశారు. మై టిడిపి యాప్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. రాబోయేకాలంలో సోషల్ మీడియా చాలా కీలకపాత్ర పోషించబోతోందని తెలిపారు.

**చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి శాసనసభ నియోజకవర్గానికి రూ.కోటి**

నియోజకవర్గాల్లో చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న సానుకూలతను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లుగా మార్చేందుకు పార్టీశ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా నేతలు పని చేయాలని స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో 2024 కంటే మెరుగైన ఫలితాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

**జెన్ జీ ఆలోచనలు పరిగణనలోకి తీసుకుని, నిర్ణయాలు తీసుకోవాలి**

"జెన్ జీ ఆలోచనలు పరిగణనలోకి తీసుకుని, నిర్ణయాలు తీసుకోవాలి. రియల్‌టైమ్ నిర్ణయాలతో దూసుకుపోయే జెన్‌జీ ఉంది. ఉచిత ఇసుక, ఇతర రాష్ట్రాలకు వెళ్లే అడ్డుకోవాలి. యేటా రూ.వెయ్యి కోట్ల ఆదాయం వదులుకుని ఉచిత ఇసుక ఇస్తున్నాం. వైఎస్సార్సీపీ పాలనలో జేబ్రాండ్ వల్ల 30 వేలమంది ప్రాణాలు కోల్పోయారు. మద్యాన్ని ఎమ్మార్పీ కంటే అదనంగా విక్రయించేందుకు వీల్లేదు. గొడ్డలి పార్టీ దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షి ంచవద్దు. టీచర్లను బెదిరించే స్థాయికి గొడ్డలి పార్టీ మీడియా దారుణాలకు ఒడిగట్టింది. ఇలా బరితెగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదన్నీ సిఎం చంద్రబాబు అన్నారు.

**ఓటు వేసే అలవాటు లేని వారిని కూడా మార్చుకుందాం.**

"విమర్శలను సానుకూలంగా మార్చుకుని ప్రజల మద్దతు కూడగట్టాలి. రాష్ట్ర స్థూల అభివృద్ధితో నియోజకవర్గస్థాయి అభివృద్ధి కావాలి. చేస్తున్న అభివృద్ధితో ఓటు బ్యాంకు పెంచుకుందాం. విజయవాడ సెంట్రల్, పాలకొల్లు, మండపేట ముందు ఉన్నాయి. చిలకలూరిపేట, నెల్లూరు, తణుకు ముందు ఉన్నాయి. మన వద్దకు గూగుల్ వస్తే ఇతర రాష్ట్రాలు అసూయపడ్డాయి. మన రాష్ట్రంలో కొందరు కుట్రలు చేస్తూ అడ్డుకునే యత్నం చేశారు. డేటా సెంటర్లకు కావాల్సిన 5 టిఎంసిలు అసలు సమస్యే కాదు. పోలవరం ఎడమ కాలువ ద్వారా రోజుకు 2 టిఎంసిలు తీసుకెళ్లే అవకాశం. డేటా సెంటర్ల ద్వారా భారీగా ఉద్యోగాలు, లక్షల మందికి ఉపాధి. 15-20 రంగాల్లో జిఎస్‌డిపిని పెంచేలా నియోజకవర్గాల్లో అభివృద్ధి చేపట్టాలి. ఎల్ నినో ప్రభావం ఉన్నా గోదావరి నుంచి వెయ్యి టిఎంసిలు సముద్రంలోకి వెళ్లింది. కనీసం 300 టిఎంసిలు వాడుకున్నా పరిస్థితులు మార్చేయవచ్చు. మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు తయారు చేసుకోవాలి. ఆలోచనమారితే ప్రతిప్రాంతాన్నీ అభివృద్ధి చేసుకోవచ్చు" అని సిఎం అన్నారు.

**స్థానికసంస్థల ఎన్నికల్లో విజయభేరి మోగించుదాం**

స్థానికసంస్థల ఎన్నికల్లో విజయభేరి మోగించి, ఆ తర్వాత వచ్చే సాధారణ ఎన్నికలకు బలమైన పునాది వేసుకోవాలని సిఎం చంద్రబాబునాయుడు నేతలకు సూచించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో పోటీకి సమర్థులైన మహిళా నాయకుల్ని గుర్తించాలన్నారు. సుస్థిర అభివృద్ధి, ప్రజాసేవలు, పొలిటికల్ కమ్యునికేషన్, సుపరిపాలన వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది. అలాగే ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించడంతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత గురించి కూడా చర్చించారు. నాయకత్వ సామర్థ్యం పెంపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు, కూటమి పార్టీల మధ్య సమన్వయం అవసరం అని సూచిస్తూ, సమష్టి కార్యాచరణపై సిఎం చంద్రబాబు నేతలకు స్పష్టమైన సూచనలు అందించారు. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో 25 ప్రాధాన్యాంశాలను గుర్తించి, వాటిఆధారంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని సిఎం సూచించారు. 'అలా పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు, గౌరవం లభిస్తాయని నిత్యం ప్రజల్లో ఉంటూ, కేడర్‌తో సమన్వయం చేసుకుంటూ పనిచేయాల్లి' అని సిఎం సూచించారు. 2029 ఎన్నికల్లో విజయంపైనే తన ధ్యాస, ఆలోచన ఉన్నాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

**డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నాం..**

ప్రజలనుంచి వస్తున్న ఫిర్యాదుల్లో అధికభాగం భూ వివాదాలే ఉంటున్నాయని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నాం. గడచిన మూడేళ్లుగా రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచలేదు. రూఫ్ టాప్ సోలార్‌పై అంతా దృష్టి పెట్టాలి. ల్యాండ్ రికార్డులు అన్నీ 2027 మార్చినాటికి ప్రక్షాళన పూర్తి అయితే భూ వివాదాలు ముగిసిపోతాయి. నెలలో కనీసం నాలుగు సార్లు పేదల సేవలో కార్యక్రమంతో ప్రజల్ని కలుస్తున్నాం. పదేళ్ల తర్వాత ఎలాంటి పరిస్థితులు, సవాళ్లు ఉంటాయనే విషయాన్ని అలోచించాలి. హెల్త్, ఎడ్యుకేషన్, లివబిలిటీ లాంటి అంశాలు జీవన ప్రమాణాలు పెంచడానికి అవసరం. గత సమావేశంలో నియోజకవర్గాల్లో పరిష్కరించాల్సిన అంశాలను ఎమ్మెల్యేలులేవనెత్తారు. వీటిపై సమీక్షించి 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్లవిలువైన 616పనుల్ని మంజూరుచేశాం' అని సిఎం పేర్కొన్నారు.

**పబ్లిక్ గ్రీవెన్సులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి..**

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సర్వీసులను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నామని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. "పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా భద్రతా ఫీచర్లతో ఇస్తున్నాం. ఆయా నియోజకవర్గాల్లో దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా తీసుకుని పరిష్కరించండి. తద్వారా మీకూ బ్రాండ్ వస్తుంది. సమస్య కూడా పరిష్కారం అవుతుంది. నివాసం ఉంటూ అభ్యంతరాల్లేని చోట ఇళ్ల పట్టాలు అందించి క్రమబద్ధీకరణ చేస్తాం. ఓ రాజకీయ నాయకుడు ఎన్నిసార్లు వీలైతే అన్నిసార్లు ప్రజలకు దగ్గరవ్వాలి. కనీసం వాయిస్ మెసేజ్ ద్వారా ఆయినా ప్రజలకు చేరువ కావాలి. ప్రజల సమస్యలపై మానవత్వంతో స్పందిస్తే వారిలో సానూకూల దృక్పథం వచ్చే అవకాశం ఉంది. ఆర్టీజీఎస్ ద్వారా పబ్లిక్ గ్రీవెన్సులను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చూడాలి. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ వీటి పరిష్కారం కోసం పనిచేయాల్లి' అని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు.


ఉప్పొంగిన పున్‌పున్ నది, జలమయమైన పాట్నా లోతట్టు ప్రాంతం

# హస్తకళాకారులకు చేయూత!

>> చేశారు. సవర గిరిజన చిత్రకారుల కోసం పార్వతీపురం మన్యం జిల్లా, సీతంపేట మండలంలో కామన్ ఫెసిలిటీ కోసం స్థల సేకరణ పూర్తి చేయడంతో పాటు విబి జి రామ్ జి నిధులతో నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. దీంతో పాటు అన్నమయ్య జిల్లా మదనపల్లి బంజారా బ్యాగ్ కళాకారులు, అనంతపురం జిల్లా కురుగుంట్ల అరటినారు కళాకారులు, పెడన పెన్ కలంకారీ కళాకారుల కోసం ఏర్పాటు చేయనున్న కమ్యూనిటీ సెంటర్ స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశారు. నిర్మాణ అనుమతులు, ఇతర ప్రక్రియలు పూర్తి చేసి త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్టు అధికారులు వివరించారు.

**ఎంపి ల్యాడ్స్ నిధులతో ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్ మరమ్మత్తులు:**

నెల్లూరు జిల్లాకు చెందిన ఉదయగిరి సంప్రదాయ చెక్క పాత్రల తయారీ కళాకారుల కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సెంటర్‌ను అభివృద్ధి చేయాలన్న కళాకారుల విజ్ఞప్తి మేరకు అక్కడ మరమ్మత్తులు చేపట్టారు. పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేష్ ఎంపి ల్యాడ్స్ నుంచి రూ.12 లక్షలు నిధులు కేటాయించారు. ఆ నిధులతో ఈ పనులు చేపట్టానున్నారు. వీటితో ప్రహరీ గోడ నిర్మాణం, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్ తదితర సదుపాయాలకు సంబంధించిన అభివృద్ధి పనులు ముందుకు తీసుకువెళ్లనున్నారు. అనకాపల్లి జిల్లా, ఎలమంచిలి మండలం, ఏటికొప్పాక కళాకారుల కోసం ఎంతో కాలంగా పనులు నిలిచిపోయిన స్థితిలో ఉన్న ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని స్థానిక కళాకారుల వినతి మేరకు పునఃప్రారంభించేందుకు పవన్ కల్యాణ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఆరోగ్య కేంద్రం త్వరలో హస్తకళాకారులకు అందుబాటులోకి రానుంది. కళకు రూపం ఇచ్చిన కళాకారులకు వారి శ్రమకు తగిన గుర్తింపు దక్కాలన్న ఉద్దేశంతో ప్రతి హస్తకళా ఉత్పత్తిపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, అందులో దానికి రూపం ఇచ్చిన కళాకారుడి వివరాలు, పడిన శ్రమ తదితర వివరాలు పొందుపరిచే ఏర్పాటు చేశారు. ఎన్ని ప్రాంతాల్లో ఈ క్యూఆర్ కోడ్ ఏర్పాటు ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. సాంకేతికత సాయంతో నేటి తరం వినియోగదారులకు మన వారసత్వ సంప్రదాయ హస్తకళలను చేరువ చేయడంతోపాటు గ్లోబల్ మార్కెట్లకు అనుసంధానించేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ అమలులో వేగం పెంచాలని సూచనలు చేశారు. క్యూఆర్ కోడ్ ఏర్పాటును అమలు చేస్తున్న అధికారులను అభినందించారు.

కళాకారుల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను తీసుకున్న పవన్ కల్యాణ్ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్లవారీగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. ఆరు ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి, అత్యాధునిక సాంకేతికతతో 1,708 మందికి పరీక్షలు నిర్వహించారు. సుమారు 93 మందికి శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తున్నారు. 1,253 మందికి పైగా ఉచిత కళ్లద్దాలు అందించే ఏర్పాటు చేశారు. హస్తకళాకారులు పస్తులు ఉండకూడదు, వారి పనికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# సైకిలెక్కిన మజ్జి శ్రీను

>> స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఈ పరిణామం వైసిపికి గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరడానికి ముందు చిన్న శ్రీను వైసిపికి రాజీనామా చేశారు. విజయనగరం జిల్లా వైఎస్ఆర్‌సిపి అధ్యక్ష పదవితో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ అధినేత జగన్‌కు లేఖ పంపారు. ప్రస్తుతం చిన్న శ్రీను విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఉన్న సంగతి తెలిసిందే. భీమిలి నియోజకవర్గం వైసిపి ఇన్‌చార్జిగా మజ్జి శ్రీనివాసరావు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉత్తరాంధ్రలో పార్టీ కీలక బాధ్యతల్లో చురుగ్గా పనిచేశారు. బొత్స కుటుంబం నుంచి కీలక నేతగా ఉన్న చిన్న శ్రీను పార్టీ వీడటం వైసిపికి, ప్రత్యేకించి బొత్స సత్యనారాయణకు రాజకీయంగా పెద్ద దెబ్బ అని విశ్లేషకులు భావిస్తున్నారు. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న చిన్న శ్రీను, తన మేనమామ బొత్స సత్యనారాయణతో ఉన్న అంతర్గత విభేదాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే, తన రాజీనామాకు వ్యక్తిగత కారణాలేనని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. స్థానిక ఎన్నికల నేపథ్యంలో, విజయనగరం జిల్లాపై పట్టు నిలుపుకోవాలని భావిస్తున్న వైసిపికి చిన్న శ్రీను నిష్క్రమణ ఇబ్బందికర పరిణామం. మరోవైపు, ఆయన చేరికతో జిల్లాలో తెలుగుదేశం పార్టీ మరింత బలపడినట్లయింది. ఈ పరిణామం రానున్న రోజుల్లో జిల్లా రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# 32కే ఉల్లి

>> లతో బహిరంగ మార్కెట్లో ధరలు పెరిగిన మాట వాస్తవమే. ఇలాంటి సమయాల్లో ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచేలా పనిచేస్తున్నాం. ముఖ్యంగా నిత్యావసర ధరలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడాం. కేంద్ర ధరల స్థిరీకరణ నిధులు (పి.ఎస్.ఎఫ్)లతో రాయితీపై కిలో ఉల్లిపాయలు రూ.32లకే వచ్చే వారం నుంచి రాష్ట్ర ప్రజలకు అందించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. మొబైల్ కౌంటర్లద్వారా ఉల్లిపాయలను తక్కువ ధరలకే రాష్ట్రంలో విక్రయిస్తాం. ఉల్లిపాయలతో పాటు కందిపప్పును రాయితీపై 1.20 లక్షల మెట్రిక్ టన్నులు, పామాయిల్ 86,400 కిలో లీటర్ల పామాయిల్‌ను రాయితీ ధరలకే రాష్ట్రంలోని 1.46 లక్షల కుటుంబాలకు చౌకధరల డిపోల ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తాం. బహిరంగ మార్కెట్ ధరల కంటే 30శాతం తక్కువ ధరలకే నాణ్యమైన నిత్యావసర సరకులు అందుకోవడం సామాన్యులకు ఊరటనిస్తుంది. కిలో కందిపప్పు ప్రతి కార్డుదారుడికి అందిస్తాం' అని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు పాల్గొన్నారు.

# సుస్మితకు కీలక పదవి

>> ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగా రాణిస్తున్నారు. ఇటీవల తన తండ్రి చిరంజీవితో నిర్మించిన 'మన శంకర వర ప్రసాద్' చిత్రంతో ఆమె మంచి విజయాన్ని అందుకున్నారు. ఆసక్తికరంగా సుస్మిత తల్లి కొణిదెల సురేఖ తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీ ్మనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు సుస్మితకు కూడా ఎపిలోని ప్రముఖ ఆలయ బోర్డులో స్థానం లభించింది.

# రాహుల్ గాంధీ ఉన్న ఎయిరిండియా విమానానికి ల్యాండింగ్ ట్రబుల్

**లక్నో, సెప్టెంబరు 8:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా విమానం లక్నో విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు కొద్దిసేపటి ముందు గోఅరౌండ్ చేసింది. మంగళవారం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెపుతున్నారు. అయితే రెండో ప్రయత్నంలో విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఎఐ1717 విమానం ఢిల్లీ నుంచి లక్నోకు బయలుదేరింది. లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేందుకు పైలట్ తొలుత ప్రయత్నించారు. అయితే విమానం రన్‌వేకు సమీపానికి వచ్చిన తర్వాత ఆ ల్యాండింగ్ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. దీంతో విమానం మళ్లీ సురక్షితమైన ఎత్తుకు చేరుకునేలా పైలట్ చర్యలు చేపట్టారు. అనంతరం మరోసారి ల్యాండింగ్ కోసం విమానాన్ని తీసుకువచ్చి రెండో ప్రయత్నంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ విమానంలో రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్నారు.

మధ్యాహ్నం ఢిల్లీ నుంచి బయలుదేరిన విమానం ఎఐ1717 విమానం మంగళవారం మధ్యాహ్నం సుమారు 2:20 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరింది. సుమారు 3:30 గంటలకు లక్నో చేరుకోవాల్సి ఉంది. ల్యాండింగ్‌కు ముందు గోఅరౌండ్ చేసినప్పటికీ రెండో ప్రయత్నంలో విమానం ఎలాంటి ఇబ్బంది లేకుండా లక్నో విమానాశ్రయంలో దిగింది. విమానం ల్యాండింగ్ ప్రక్రియలో ఉన్నప్పుడు పైలట్ ఆ ప్రయత్నాన్ని నిలిపివేసి మళ్లీ సురక్షితమైన ఎత్తుకు విమానాన్ని తీసుకెళ్లి, ఆ తర్వాత మరోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించడాన్ని 'గోఅరౌండ్' అంటారు. ఇది విమానయాన రంగంలో సాధారణంగా అనుసరించే భద్రతా విధానమే. రన్‌వే పరిస్థితులు, వాతావరణం, విమానాల రాకపోకలు లేదా ల్యాండింగ్‌కు అనువైన పరిస్థితులు లేకపోవడం వంటి పలు కారణాలతో పైలట్లు గోఅరౌండ్ చేయవచ్చు. ఈ ఘటనలోనూ తొలి ల్యాండింగ్ ప్రయత్నాన్ని విరమించుకున్న తర్వాత విమానం తిరిగి మరోసారి ల్యాండింగ్‌కు వచ్చి సురక్షితంగా ల్యాండ్ అయింది.

# టిడిపి 3.0 వెర్షన్

>> మంది విమర్శించారు. 2024 ఎన్నికల్లో 91వేల మెజార్టీతో గెలుపొందాను. నాయకులకు వారి బలహీనతలేంటో చెప్పగలగాలి. నాయకులు పుట్టరు, నాయకులు తయారవుతారు. నేను నాయకుడిగా ఎదిగానంటే ఆ క్రెడిట్ చంద్రబాబు గారిది కాదు.. సైకోది. రాష్ట్రస్థాయిలో మిమ్మల్ని నాయకులుగా గుర్తించే ఈ సమావేశానికి ఆహ్వానించాం. మన బలహీనతల్ని గుర్తించి, అధిగమించడానికే ఈ కాంక్లేవ్. ఎన్నికల్లో తిరిగి గెలవాలంటే మన బలహీనతల్ని గుర్తించి అధిగమించాలి. ఇందుకు ఎంతో మంది నాయకులు మనకు మోడల్స్‌గా ఉన్నారు. గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రామానాయుడు, అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు వంటి నాయకులు మనకు మోడల్స్‌గా ఉన్నారు. ఒక్కొక్కరిదీ ఒక్కో స్టైల్. వారి నుంచి మనం నేర్చుకోవాలి. దేశంలో కూడా మనకు మోడల్స్ ఉన్నారు. సిఆర్ పాటిల్ మనకు ఆదర్శం' అని లోకేష్ వివరించారు.

**పార్టీ, పర్సనల్, ప్రభుత్వం.. మూడు 'పి'లను సీరియస్‌గా తీసుకోవాలి:**

"మూడు 'పి'లను నేను ప్రతిపాదిస్తున్నాను. వీటిని అందరూ పాటించాలి. పార్టీ, పర్సనల్, ప్రభుత్వం. వీటిని సీరియస్‌గా తీసుకోవాలి. పర్సనల్‌గా ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి. బాధ్యతగా ఉండాలి. నాయకులుగా మనం ముందు వినగలగాలి. దీనిని నేను ప్రధాని మోడీ నుంచి నేర్చుకున్నాను. ఒక ప్రధానిగా ఉండి ఆయన నా నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. మీరు కూడా ఫీడ్ బ్యాక్ తీసుకుని మనల్ని మనం మార్చుకోవాలి. మానవత్వం, అణకువతో ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలి. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. ప్రజలు సింప్లిసిటీ కోరుకుంటున్నారు. గ్రామాలకు వెళ్లినప్పుడు అందరినీ కలవాలి. మనమే వంద మందిని వెంటేసుకుని వెళ్లకూడదు. వ్యక్తిగత క్రమశిక్షణ చాలా అవసరం. ప్రజలు మన ఇళ్లలో జరిగే విషయాలను కూడా గమనిస్తారు. నీతులు మనం చెప్పడమే కాదు.. పాటించాల్లి' అని లోకేష్ సూచించారు.

**కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలి:**

"రెండో పి.. పార్టీ. కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాల్సిన బాధ్యత మనపై ఉంది. మన సైన్యం సరిగా ఉంటేనే యుద్ధంలో గెలుస్తాం. పార్టీకి దూరంగా ఉన్నవారిని, అలకబూనిన వారిని గుర్తించి దగ్గరికి తీసుకోవాలి. ఎన్నికల్లో ప్రభావితం చేయగలిగిన వారిని గుర్తించాలి. కార్యకర్తలకు చేయగలిగే పనులు చేయాలి. నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య అయినా సీరియస్‌గా తీసుకోవాలి. గూగుల్ కోసం తెలంగాణ, మహారాష్ట్రలు పోటీపడుతున్నాయి. అదే గూగుల్ మన వైజాగ్‌కు వస్తే దుష్ప్రచారం చేస్తున్నారు. అందరం కలిసికట్టుగా తిప్పికొట్టాల్లి' అని పిలుపునిచ్చారు.

**డిఎస్సీకి, ఎపిపిఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్:**

"డిఎస్సీ విషయంలో మనం ఏ తప్పూ చేయలేదు. జగన్ ఏనాడు బాబాయి హత్య, ఎపిపిఎస్సీ, దస్తగిరి, లిక్కర్ స్కామ్ గురించి మాట్లాడలేదు. డిఎస్సీ గురించి మాట్లాడుతున్నారు. మనకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే డిఎస్సీపై అందరం మాట్లాడుతున్నాం. 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. డిఎస్సీకి, ఎపిపిఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి. వైసిపి హయాంలో ఇచ్చింది సున్నా. ఐదేళ్లలో మనం 30వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. డిఎస్సీ విషయంలో సుప్రీంకోర్టు కూడా కొట్టేసింది. వైసిపి అబద్దాలు చెప్పినంత ఈజీగా మనం నిజాలు చెప్పలేకపోతున్నాం. వాస్తవాలు ప్రజలకు వివరించాలి. వైసిపి దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి. కాకినాడలో పోలీస్ రిక్రూట్‌మెంట్ గురించి ఆందోళన జరిగింది. వైసిపి హయాంలో ఇచ్చింది సున్నా. మనం 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. ఈ యేడాది 3వేలు భర్తీ చేస్తున్నాం. ఈ ఐదేళ్లలో 10వేల పోస్టులు భర్తీ చేస్తాం. అయినా మనల్ని ఛాలెంజ్ చేస్తున్నారు. వీటన్నింటినీ తిప్పికొట్టాలి. 2024 టీమ్ అద్భుతంగా పనిచేసిందని చంద్రబాబు మెచ్చుకునే విధంగా మన పనితీరు ఉండాలి. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలి. నెలకోసారి జిల్లా ప్రజాప్రతినిధులు కలిసి కూర్చొని మాట్లాడుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే కలిసికట్టుగా చేయాలి. మన మధ్య ఐక్యత అవసరం. ఏవైనా సమస్యలు ఉంటే అధిష్టానం దృష్టికి తీసుకురావాల్లి' అని పార్టీ శ్రేణులకు లోకేష్ దిశానిర్దేశం చేశారు.

**ప్రభుత్వ కొనసాగింపు అనేది చాలా ముఖ్యం:**

"మూడో పి.. ప్రభుత్వం. నేతలు పోస్ట్ ఆఫీస్ లా మారకూడదు. లీడర్ లా వ్యవహరించాలి. నేతలు తమ నియోజకవర్గాల్లోని పాఠశాలలు, ఆసుపత్రులు, వసతిగృహాలకు వెళ్లి తనిఖీ చేయాలి. చేసిన పనులు చెప్పుకోవాలి. డిఆర్సీ సమావేశాన్ని ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినియోగించుకోవాలి. ఈ మూడు 'పి'లను అందరూ పాటించాలి. హ్యూమన్ కనెక్షన్, ఎమోషన్ అనేది చాలా కీలకం. ప్రజలతో ప్రత్యక్ష అనుబంధం ఏర్పరచుకోవాలి. ప్రభుత్వ కొనసాగింపు అనేది చాలా అవసరం. మళ్లీ గెలవాలంటే మూడు 'పి'లను పాటించాల్లి' అని నేతలకు లోకేష్ సూచించారు.

## చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు రేపటితో మూడేళ్లు

"పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుని అరెస్ట్ చేసి రేపటితో మూడేళ్లు. చంద్రబాబుని అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేసి రోడ్డు మార్గంలో కోర్టుకు తీసుకెళ్లారు. 53 రోజుల పాటు అక్రమంగా జైల్లో బంధించారు. చంద్రబాబుకి కోర్టు, ఇడి క్లీన్ చిట్ ఇచ్చింది. రేపు 'నిజం గెలిచింద్లి' పేరుతో పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ లెవల్‌లో 53 దీపాలు వెలిగిద్దాం. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను బ్లాక్ డే గా పాటిద్దాం. చంద్రబాబు ఏ తప్పూ చేయలేదు కాబట్టే క్లీన్ చిట్ వచ్చింది. హిట్ అండ్ రన్ చేసి చిన్నోడు, సొంత బాబాయిని లేపేస్తే పిల్లోడని జగన్ అన్నారు. సొంత పిఎ పట్టుబడితే ఎదురుదాడి చేస్తున్నారు. 'నిజం గెలిచింద్లి' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతున్నాను. నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యానంటే అందుకు కారణం మీ అందరి సహకారం వల్లే. కలిసికట్టుగా రాష్ట్రాన్ని, పార్టీని నడిపిద్దాం' అని ఈ సందర్భంగా నేతలకు మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

09-09-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి. త్రయోదశి మ.12.33. న. ఆశ్లేష మ.3.16
వ.రా.2.42 - తె.4.13
దు.ఉ.11.39 - మ.12.28
రాహు. మ.12.00-మ.1.30
శుభ స. ఉ.5.00-6.00

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామి సహాయంతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.వస్తు లాభాలు పొందుతారు.

**వృషభం :** కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం.ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా వుంటుంది. వ్యాపారాలలో స్వల్పలాభాలు.

**మిథునం :** నూతన పెట్టుబడులకు తగిన సమయం. సంతాన సమస్యల నుండి బయటపడతారు.

**కర్కాటకం :** ఉద్యోగ, వివాహ యత్నాలకు అనుకూలమైన సమయం, కాంట్రాక్టులు దక్కుతాయి. వస్తు సేకరణ.

**సింహం :**ఉద్యోగాలలో ఏర్పడిన చిక్కులు కొంత వరకు తీరుతాయి. పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు.ఆహ్వానాలు.

**కన్య :**అదనపు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. జీవితభాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. వాహనసౌఖ్యం.

**తుల :** భూవివాదలు తీరి ప్రశాంతత పొందుతారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృశ్చికం :** ముఖ్య వ్యవహారాల్లో అవాంతరాలు ఎదురైనా సన్నిహితుల సహాయం అందుతుంది. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు.

**ధనుస్సు :** ప్రముఖులనుండి ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తివృద్ధి చెందుతుంది.ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా వుండును.

**మకరం :** వృత్తి, వ్యాపారాలలో తొందరపాటు వద్దు. అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ధనలాభం.

**కుంభం :** చిన్ననాటి మిత్రులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా వుండును. సోదరుల కలయిక.

**మీనం :** పనులు సాఫీగా పూర్తి చేస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. అనుకోని అవకాశాలు లాభిస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

9-9pg3exHMNWJQEBPGOL:9-9pg3exHMNWJQEBPGOL.qxd 9/8/2026 11:35 PM Page 1



# నేడు కోనసీమ జిల్లాలో సిఎం పర్యటన

- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ
- రైతులతో ముఖాముఖి, గ్రామసభలో పాల్గొననున్న చంద్రబాబు



**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజల మధ్యే పాలన సాగిస్తూ ప్రతి నెలా వివిధ ప్రజా కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూ హక్కులకు భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా పి. గన్నవరం నియోజకవర్గంలో జరిగే గ్రామసభలో పాల్గొని పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. పర్యటనలో భాగంగా రైతులతో ముఖాముఖి నిర్వహించడంతో పాటు, గ్రామసభలో పాల్గొని భూ హక్కుల పరిరక్షణ, రెవెన్యూ సంస్కరణలపై ప్రజలకు వివరించనున్నారు. అనంతరం బుదుంగపేటలో నిర్వహించే కేడర్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

**గ్రౌండ్ రెంట్ భూముల సమస్యకు పరిష్కారం:** ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కోనసీమ జిల్లాలో దశాబ్దాలుగా కొనసాగుతున్న గ్రౌండ్ రెంట్ స్థలాల సమస్య పరిష్కారానికి కీలక అడుగు పడనుంది. అమలాపురం, అంబాజీపేట, ముమ్మిడివరం, రామచంద్రాపురం ప్రాంతాల్లోని కొన్ని నివాస గ్రౌండ్ రెంట్ స్థలాలు పాత రెవెన్యూ వర్గీకరణ కారణంగా రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22తి(1)(ౖ) కింద నిషేధిత ఆస్తుల జాబితాలో కొనసా గుతున్నాయి. వాస్తవానికి ఈ స్థలాలు దీర్ఘకాలంగా నివాసాలుగా ఉన్నాయి. అనేక చోట్ల శాశ్వత నిర్మాణాలు ఉన్నాయి. 1984 నుంచే గ్రౌండ్ రెంట్ వ్యవస్థ నిలిచిపోయినప్పటికీ, పాత రెవెన్యూ రికార్డుల్లోని వర్గీకరణ కారణంగా ఆయా కుటుంబాలు ఆస్తిలావాదేవీలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

**1,416 కుటుంబాలకు లబ్ధి... 56.37 ఎకరాలకు విముక్తి:** క్షేత్రస్థాయి విచారణలు, పాత రెవెన్యూ రికార్డులు, సర్వే వివరాలు, గత రిజిస్ట్రేషన్ లావాదేవీలను పరిశీలించిన అనంతరం, నివాస గ్రౌండ్ రెంట్ స్థలాలను గ్రామకంఠం భూములతో సమానంగా పరిగణించి 22తి నిషేధిత జాబితా నుంచి ప్రత్యేక కేటగిరీగా తొలగించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఈ నిర్ణయం అమలైతే 1,416 మంది నివాసితులకు ప్రయోజనం కల్గుతుంది. 56.37 ఎకరాల భూమికి ఆంక్షల నుంచి విముక్తి లభిస్తుంది. 1,281 సర్వే నంబర్లకు సంబంధించి సమస్య పరిష్కారం లభించడంతో అంబాజీపేట, అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురం ప్రాంతాల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. మాచవరం గ్రామంలోని జయంతినగర్‌కు ప్రత్యేక చారిత్రక నేపథ్యం ఉండగా, అక్కడ గుర్తించిన 32 మంది అర్హులైన నివాసితులకు కూడా ఈ చర్య ద్వారా ప్రయోజనం కలగనుంది.

# 'సోషల్'గా మూవ్‌కండి!

- ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు విస్తృతంగా జనంలోకి తీసుకుని వెళ్ళాలి
- ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండటం వల్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది
- పార్టీ నేతలు సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించాలి
- టిడిపి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ పిలుపు



**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని టిడిపి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ అన్నారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో రెండో రోజు లీడర్ షిప్ కాన్‌క్లేవ్‌లో పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్ అంశంపై మాట్లాడుతూ ఎంతమంది నాయకులు సోషల్ మీడియాను యాక్టివ్‌గా వినియోగిస్తున్నారని అడిగిన మంత్రి లోకేష్ అన్నారు. నేతలు సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించాలన్నారు. సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు అన్నారు. దీనిపై సీరియస్‌గా ఉండాలి అన్నారు. ఎఎంసి, కార్పోరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేసిన పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారన్నారు. ప్రతి అంశాన్ని ఓపెన్‌గా మాట్లాడాలి అన్నారు. ప్రధాని మోడీ కూడా సోషల్ మీడియా ద్వారా సెల్ఫీ వీడియోలతో తన సందేశాన్ని తెలియజేస్తున్నారు. నేను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టులకు శంకుస్థాపన, డీఎస్సీపై దుష్ప్రచారంపై సెల్ఫీ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాను అన్నారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలి అన్నారు.

**ప్రతిపక్షం పని ఎప్పుడూ బురదజల్లడమే**

ప్రతిపక్షం దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదిక ద్వారా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి. పార్టీ ఆదేశాలు, కార్యక్రమాలపై సోషల్ మీడియా టీమ్స్ ఎప్పటికప్పుడు స్పందించాలి. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నాం అన్నారు. మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని అన్నారు. ఫలానా సమయంలో ఎమ్మెల్యేని కలవచ్చు.. ఆయన అందుబాటులో ఉంటారు అనే విశ్వాసం ప్రజల్లో ఏర్పడితే చాలా వరకు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయని చెప్పారు. ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండటంవల్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని, చిన్నచిన్న సమస్యల కోసం ప్రజలు అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గు తుందని అన్నారు. ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు. టిడిపికి గ్రామస్థాయి నుంచి బలమైన కార్యకర్తల బలం ఉందని, ఆ బలాన్ని ప్రజాసేవకు ఉపయోగించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. పార్టీ నాయకత్వం, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని మరింత పెంచుకోవాలని అన్నారు. పదవులు ప్రజలకు సేవ చేయడానికి వచ్చిన అవకాశాలే తప్ప.. అధికారాన్ని చెలా యించడానికి కాదనే విషయాన్ని ప్రతి ప్రజా ప్రతినిధి గుర్తుంచుకోవాలి అని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, కార్యకర్తలను గౌరవించడం, ప్రజల సమస్యలను పరిష్కరించ డమే నాయకత్వానికి అసలైన కొలమానమని పేర్కొన్నారు. దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ గ్రామస్థాయి నుంచి అత్యంత బలమైన క్యాడర్, కార్యకర్తలు, నాయకత్వ వ్యవస్థ కలిగిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. ప్రతి సమస్యను పరిష్కరించగలగడం సాధ్యం కాకపోయినా, కనీసం ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అండగా నిలవాలని అన్నారు. ప్రజలకు ఏమీ చేయలేక పోయినా ఫర్వాలేదు.. కానీ వారిని ఇబ్బంది పెట్టడం, వేధించడం మాత్రం చేయకూడదని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే నాయకులకు రాజకీయంగా భవిష్యత్తు ఉండదని మంత్రి హెచ్చరించారు. ప్రజలే రాజకీయ నాయకులకు అధికారం ఇస్తారని, అదే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతే ఎలాంటి పదవిలో ఉన్నా తిరిగి గెలవడం కష్టమవుతుందని అన్నారు.



టిడిపి లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో నారా లోకేష్

# మండపాల్లో విద్యుత్ భద్రతే ప్రధానం

- 26 వరకు గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా: ఎపిసిపిడిసిఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి

**గుంటూరు, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసే గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని ఎపిసిపిడిసిఎల్ సిఎండి పి. పుల్లారెడ్డి సూచించారు. భక్తితో పూజిద్దాం. భద్రతతో పండుగ జరుపుకుందాం అని పిలుపునిచ్చారు. మండపాల్లో విద్యుత్ అలంకరణలు, తాత్కాలిక విద్యుత్ వినియోగం విషయంలో నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గణేష్ మండపాలను విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు తగినంత దూరంలో ఏర్పాటు ఏర్పాటు చేయాలన్నారు. మండపాల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అలంకరణలకు నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లు మాత్రమే వినియోగించాలన్నారు. మండపాలకు అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని స్పష్టం చేశారు. విద్యుత్ వైరింగ్, ఇతర పనులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే చేయించుకోవాలని కోరారు. అధిక లోడ్ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన సామర్థ్యం కలిగిన వైరింగ్, రక్షణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాల సమయంలో విద్యుత్ పరికరాలు, వైర్లు తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడిసిన విద్యుత్ పరికరాలను చేతితో తాకరాదని హెచ్చరించారు. విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని కోరారు. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేసే సమయంలో భక్తులు, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అత్యవసర వాహనాల సేవలకు ఆటంకం కలగకుండా మండపాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ వరకు గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా అందించనున్నట్లు సిఎండి పి.పుల్లారెడ్డి తెలిపారు. 500 వాట్స్‌కు రూ.1,000, 1,000 వాట్లకు రూ.2,250 చొప్పున తాత్కాలిక విద్యుత్ సరఫరా రుసుము ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు రుసుము రూ.100గా నిర్ణయించినట్లు తెలిపారు. గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయాలు, ఎపిసిపిడిసిఎల్ వెబ్‌సైట్, మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సిఎండి తెలిపారు. మండపాల నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టవిరుద్ధంగా విద్యుత్‌ను వినియోగించ రాదని సిఎండి హెచ్చరించారు. అనధికారిక కనెక్షన్లు తీసుకోవడం లేదా అక్రమంగా విద్యుత్ వినియోగించడం గుర్తిస్తే నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## ప్రజలకు- ప్రభుత్వానికి మధ్య వారధిలా

# 'ఇంటింటికీ తెలుగుదేశం'

**ఎన్టీఆర్ భవన్ (మంగళగిరి), సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం2026' కార్యక్రమం 44వ రోజూ విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు 1.07 కోట్ల ఇళ్లను టిడిపి నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. మరో 1.15 లక్షల ఇళ్లను టిడిపి శ్రేణులు సందర్శించారు. ప్రతి కుటుంబాన్ని నేరుగా కలుసుకుంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు వివరిస్తున్నారు. అదే సమయంలో ప్రజల నుంచి వస్తున్న స్పందనను తెలుసుకోవడంతో పాటు, వారి సమస్యలు, స్థానిక అవసరాలు, అభిప్రాయాలను నేరుగా సేకరిస్తున్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా 'ఇంటింటికీ తెలుగుదేశం2026' కార్యక్రమం ప్రజలకు- ప్రభుత్వానికి మధ్య బలమైన వారధిగా నిలుస్తోంది. ప్రతి గడపకు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు చేరుకోవాలనే లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ఇంటింటి పర్యటనలను కొనసాగిస్తున్నారు.

## తెలంగాణ అసెంబ్లీలో గుండెపోటుతో అధికారి మృతి

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** శాసనసభ ప్రాంగణంలో ఇవాళ చోటుచేసుకున్న ఓ అత్యంత విషాదకర ఘటన అసెంబ్లీ వర్గాలను, అధికారులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ దగ్గర పర్సనల్ సెక్రటరీ (పిఎస్)గా విధులు నిర్వహిస్తున్న రాజు శాసనసభ ఆవరణలోనే అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. అసెంబ్లీ ప్రాంగణంలో రాజు ఉన్నట్టుండి స్పృహ తప్పి పడిపోవడాన్ని గమనించిన మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే స్పందించారు. అప్పటికప్పుడు రాజుకు కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సిపి ఆర్) చేస్తూ ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ రాజు ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో, వెంటనే మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో హుటాహుటిన ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పల్స్ పడిపోవడంతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యు లు ధ్రువీకరించారు.



# సిఎంను కలిసేందుకే వచ్చాం!

## అమరావతిలో వివేకా హత్య కేసు అప్రూవర్ దస్తగిరి దంపతులు

**విజయవాడ, పులివెందుల, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరి, ఆయన భార్య షేక్ షబానా మంగళవారం అమరావతి వచ్చారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించి వినతిపత్రం అందించేందుకు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిఎంను కోరనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో తమను బెదిరించిన అధికారులే ప్రస్తుతం కూడా ఇబ్బందులకు గురిచేస్తున్నారని దస్తగిరి ఆరోపించారు. వివేకా హత్య కేసుకు సంబంధించిన వాస్తవాలు, మనీలాండరింగ్‌కు సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. దర్యాప్తు సంస్థలకు వైఎస్ జగన్, భారతి సహకరించాలని కోరారు. తాను ప్రముఖ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వద్ద వకాలత్ తీసుకున్నానంటూ వస్తున్న ఆరోపణలను దస్తగిరి ఖండించారు. అది నిరూపిస్తే జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ చేశారు. అదే విషయాన్ని నిరూపించలేకపోతే వైఎస్ జగన్ రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని ప్రశ్నించారు. రాష్ట్రం గురించి మాట్లాడే ముందు వివేకానందరెడ్డి కుమార్తె సునీతకు న్యాయం జరిగేలా చూడాలని జగన్‌ను ఉద్దేశించి దస్తగిరి వ్యాఖ్యానించారు. తనతో కూడా నీతులు చెప్పించుకునే స్థాయికి జగన్ దిగజారారని విమర్శించారు. వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి రావడానికి దర్యాప్తు సంస్థలకు పూర్తి సహకారం అందిస్తున్నా అని తెలిపారు.

**పులివెందులకు వెళ్లాలంటే భయంగా ఉంది:** దస్తగిరి భార్య షేక్ షబానా మాట్లాడుతూ తమ గోడును ముఖ్యమంత్రికి చెప్పుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. పులివెందులకు వెళ్లాలంటే భయంగా ఉందని, తమకు ప్రాణభయం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తమను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మీరు రక్తంతో యుద్ధం చేస్తే.. రక్తాభిషేకం చేసైనా యుద్ధం గెలుస్తా!

- నామినేషన్లు వేసేందుకు బెదిరిస్తే... చంపేందుకైనా, చచ్చేందుకైనా సిద్ధమైన వారినే ఎన్నికల్లో నిలబెడతాం
- వైఎస్సార్సీ శ్రేణులు సింహాలు ... కుప్పంలో అన్నిచోట్ల అభ్యర్థుల్ని నిలబెడతాం
- పార్టీ శ్రేణుల సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ భరత్

**కుప్పం, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** కుప్పంలో తెదేపా శ్రేణులు ఎన్నికల్లో రక్తంతో యుద్ధం చేయాలని చూస్తున్నారని, తాను రక్తాభిషేకం చేసైనా యుద్ధం గెలుస్తానని ఎమ్మెల్సీ, కుప్పం వైఎస్సార్సీ ఇన్‌చార్జ్ కెఆర్‌జె భరత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం కుప్పంలోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వహించిన నియోజకవర్గస్థాయి పార్టీ శ్రేణుల విస్తృత సమావేశంలో ఆయన ప్రసంగం సంచలనంగా మారింది. కుప్పంలో నామినేషన్లు వేయనీయకుండా తెదేపా శ్రేణులు బెదిరించి భయపెడితే తాము చంపేందుకైనా, చచ్చేందుకైనా సిద్ధంగా ఉన్న పార్టీ శ్రేణులను పోటీలో నిలుపుతామని పేర్కొన్నారు. కుప్పంలో తెదేపా శ్రేణులు ఎన్నికలంటే భయపడుతున్నారని, అందుకే ఏకగ్రీవాలు చేస్తామని పేర్కొంటున్నారన్నారు. ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైఎస్సార్సీకి పనిచేసే నాయకులు, కార్యకర్తలు సింహాలు అని పేర్కొన్నారు. సింహం వేషం వేసుకుని వైఎస్సార్సీ పాలనలో తెదేపా నేతలు రోడ్లపై ఎవరు వచ్చారని ప్రశ్నించారు. తాము రోడ్లపై వస్తున్నామని తమపై కేసులు పెడితే ప్రజల్లో తమ పట్ల సానుభూతి పెరుగుతుందే తప్ప తగ్గదని పేర్కొన్నారు. కుప్పంలో సోమవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశానికి హాజరవుతారని సోషియల్ మీడియాలో పెట్టిన మెసేజ్ తెదేపా శ్రేణులను భయపెట్టిందన్నారు. నిజంగా పెద్దిరెడ్డి వస్తే ఎలా ఉంటుందో అని వ్యాఖ్యానించారు. తాము ప్రజాస్వామ్యానికి గౌరవం ఇస్తామన్నారు. కుప్పంలో అన్ని చోట్ల అభ్యర్థులను పోటీలో నిలబెడతామని తద్వారా సగం గెలుపు సాధించినట్లేనని పేర్కొన్నారు. కాలం కలిసివస్తే ఎవరైనా రాజు కావచ్చని, ప్రస్తుతం తెదేపాకు టైం కలిసి వచ్చిందన్నారు. కుప్పంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అడ్డుకుంటామని చెప్పడంతో పాటు తాము కార్యకర్తల సమావేశం కోసం కళ్యాణ మండపాలను బుక్ చేస్తే వారిని సైతం కుప్పంలో తెదేపా శ్రేణులు బెదిరించారని ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ అధికార పార్టీకి దమ్ముంటే ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని తెదేపా శ్రేణులకు పెద్దిరెడ్డిని అడ్డుకునే శక్తి ఉందా అని ప్రశ్నించారు. తాము చేతులకు గాజులు తొడుక్కోలేదని వ్యాఖ్యానించారు. కుప్పంలో ఇసుక, మైనింగ్ మాఫియా చెలరేగుతోందని ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కుప్పంలో అన్ని చోట్ల స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెడతామన్నారు. ఈ సమావేశంలో పరిశీలకుడు మొగసాల కృష్ణమూర్తి, మండల, మున్సిపల్ కన్వీనర్లు హెచ్ఎం మురుగేష్, హాఫీజ్, బాబురెడ్డి, రామకృష్ణ,మాజీ రెస్కో ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి,పలువురు కౌన్సిలర్లు, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ భరత్‌పై పోలీసులకు ఫిర్యాదు:** కుప్పంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా స్థానిక ఎన్నికలను ప్రభావితం చేసేలా తన అనుచరులను ప్రజలు, కూటమి ప్రభుత్వ ంపై రెచ్చగొట్టేలా ప్రసంగించిన ఎమ్మెల్సీ భరత్‌పై తగు చర్యలు తీసుకోవాలని కుప్పం, రాళ్లబూదుగూరు, రామకుప్పం పోలీస్‌స్టేషన్‌లలో తెదేపా శ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంపడానికైనా, చావడానికైనా సిద్ధంగా ఉండాలని అవసరమైతే రక్తాభిషేకం చేస్తామంటూ సభ్య సమాజం భయపడేలా ప్రసంగించారని తమ అనుచరులను హత్యారాజకీయాలకు ఉసిగొల్పుతున్నారని ఫిర్యాదులో





కుప్పంలో వైఎస్సార్సీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

# ఆర్ఆర్‌బిని విశాఖలోనే ఏర్పాటుచెయ్యాలి



**విశాఖపట్నం, సెప్టెంబరు 8 ప్రభాత వార్త:** విశాఖపట్నం కేంద్రంగానే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డుని ఏర్పాటు చెయ్యాలని కోరుతూ మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర రైల్వేశాఖ మంత్రి ఆశ్వని వైష్ణవ్‌లకు లేఖలు రాసారని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. మంగళవారం విశాఖపట్నం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రాసిన లేఖలను ఆయన మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ రైల్వే జోన్ ఉందో అక్కడే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బి)లు ఏర్పాటు చేసారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం రైల్వే జోన్ విశాఖపట్నంలో ఉంటే ఆర్ఆర్‌బిని అమరావతిలో ఏర్పాటు చెయ్యమని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం బాధ కలిగించిందని అన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతా రామరాజు జిల్లాల్లోని యువత రైల్వేలోని గ్రూప్ సి, గ్రూప్ డి ఉద్యోగాలకు నిత్యం శిక్షణ తీసుకుంటూ రైల్వే రిక్రూట్మెంట్ పరీక్షలకి హాజరువుతున్నారని ఉత్తరాంధ్ర వెనుకుబాటు తనాన్ని అర్థం చేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భీశెట్టి కోరారు. ఇప్పటికే లోక్ సత్తా నుండి ముఖ్యమంత్రికి లేఖ రాస్తూ రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, బీజేపీ సీనియర్ నేత, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌లకు వినతిపత్రం అందచేశామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్‌లను కూడా కలిసి వినతి పత్రం అందచేస్తామని అన్నారు.

ఉత్తరాంధ్రలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు మాజీ మంత్రి కొణతాల రాసినట్టుగానే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ఉత్తరాంధ్ర నిరుద్యోగ యువత తరపున లేఖలు రాసి వత్తిడి తేవాలని బాబ్జి కోరారు. ఈ సమావేశంలో లోక్ సత్తా నగర అధ్యక్షుడు ఎమ్ఎస్ఎన్ మూర్తి, ఉత్తర నియోజకవర్గం అధ్యక్షుడు గొట్టాపు సుదీర్, రొంగలి యెర్నయుడు, వేగి శ్రీనివాస్ రావు, ఫ్యాప్ ఆరాధ్య వెల్ఫేర్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ నర్రా సుగుణేశ్వరి, ప్రముఖ న్యాయవాది నర్రా లోకనాధరావు, తదితరులు పాల్గొన్నారు.



# రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడిన విఆర్‌ఒ

**కె కోటపాడు, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** భూమి మ్యుటేషన్ కోసం లంచం డిమాండ్ చేసిన విఆర్‌ఒ ఎసిబి అధికారుల వలలో చిక్కారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎసిబి అడిషనల్ ఎస్పీ హర్షిత, డి.ఎస్.పి రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వారాడ పంచాయతీ సిరికివానిపాలెం గ్రామానికి చెందిన బండారు నాయుడు అనే వ్యక్తి తన చిన్నాన్న పేరిట ఉన్న 5 సెంట్ల భూమిని తన పేరు మీదకు మార్చాలని విఆర్‌ఒ జి. సూర్యనారాయణను ఆశ్రయించారు. అయితే ఈ పని పూర్తి చేయడానికి విఆర్‌ఒ రూ.20వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు బండారు నాయుడు ఎసిబి అధికారులను ఆశ్రయించడంతో పక్కా ప్రణాళికతో ట్రాప్ చేసారు. మంగళవారం కె.కోటపాడు తహసీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒ సూర్యనారాయణ బాధితుడి నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. విఆర్‌ఒ సూర్యనారాయణపై గతంలోనూ లంచం తీసుకున్న కేసులు ఉన్నాయని ఎసిబి డిఎస్పీ రమణమూర్తి తెలిపారు. 2022లో నాతవరం మండలంలో విఆర్‌ఒగా పనిచేస్తున్న సమయంలో కూడా రూ. 20 వేలు లంచం డిమాండ్ చేసి ఎసిబికి పట్టుబడినట్లు వెల్లడించారు. విఆర్వోపై కేసు నమోదు చేసి ఎసిబి ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.


**కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం లిమిటెడ్**

KUPPAM RURAL ELECTRIC CO.OPERATIVE SOCIETY LIMITED

**e-Procurement Tender Notice**

The **KRECS Ltd., Kuppam, Chittoor Dist., A.P.** intends to procure the electrical line materials such as DTRs, Cable Conductor and other ancillary materials through e-procuremt. The interested bidders may visit and submit their bids online through https:// tender.apeprocurement.gov.in/ from 11.09.2026, 00:00 hrs. For further details, contact on 9440808304 or write to us on **adet@kuppamresco.org.**

Sd/-
**MANAGING DIRECTOR**

Dial "1912" for all electricity related complaints
Pay electricity charges using QR code printed on electricity bills

9-9pg4:9-9pg4.qxd 9/9/2026 12:22 AM Page 1



వార్త

నీతిలేని వాణిజ్యం, కృషిలేని సంపద, శీలంలేని విద్య, త్యాగం లేని ఆరాధన, మానవత లేని శాస్త్ర విజ్ఞానం, నియమనిష్ఠలు లేని రాజకీయం ఇవి సామాజిక దురాచారాలు.

న- మహాత్మా గాంధీ

# తెరచాటు దొర తంత్రం!

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు నిధులు చేరడం తప్పేమీ కాదు. కానీ ఊరూపేరులేని పార్టీలను నమ్మి ప్రజలు అంతలేసి మొత్తంలో విరాళాలు ఇస్తారా అంటే అది మిలియన్ డాలర్ల ప్రశ్నే. విరాళాలిచ్చేవారు జనాదరణ లేని పార్టీల నుంచి ఏమీ ఆశించలేమని తెలిసీ ఎందుకు విరాళాలు ఇస్తారో పలు విషయాలపై దృష్టి పెడితేనే విశ్లేషించుకోగలం. ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో ఏమాత్రం జనంలో లేని రాజకీయ పార్టీలకు దాదాపు రూ.1700 కోట్ల మేరకు విరాళాలు అందాయి. అవి ఎక్కడ్నించి వచ్చాయి. ఎవరి కోసం దేనికోసం ఈ విరాళాలు పోగుపడ్డాయి. ఎవరిచ్చారు? ఎందుకిచ్చారు? ప్రతిఫలాపేక్ష లేకుండా ఎవరైనా ఎందుకిస్తారు? అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. పైగా రాజకీయ పార్టీలకి ఇచ్చే ప్రతి రూపాయి ప్రజావిశ్వాసంతో ముడిపడి ఉంటాయి. రాజకీయ చైతన్యంలో మమేకమై విస్తృత రాజకీయకార్యకలాపాలు చేసే పార్టీలకు కోట్లాది రూపాయలు విరాళమిచ్చే దాతలు ఆయా పార్టీల నుంచి ఏం ఆశిస్తున్నారన్న నేపథ్య ఎజెండా ఏదో ఒకటి ఉండనే ఉంటుంది. దాన్ని ఎవరూ కాదనలేం. గుజరాత్‌లో కొన్ని రాజకీయ పార్టీలు అసలు ఉన్నట్లే ఎవరికీ తెలియదు. వాటి జెండా,ఎజెండా కూడా ఏదో కానరావు.కానీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆరు చిన్న చితక పార్టీలకు రూ. 1700 కోట్ల రూపాయలు ఎలా జమ అయ్యాయి. ఈ సొమ్మును వారు ఖర్చు పెట్టేందుకు వారికి ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు లేవు. ఎలాంటి కార్యాచరణ కూడా లేదు. దీంతో ఈ విరాళాల అసలు సిసలు లబ్ధిదారులెవరో తేలాల్సి ఉంది. ఒకవేళ బడా రాజకీయ నాయకుల కొమ్ము కాసేందుకే ఈ చిన్నాచితకా పార్టీల పేర్లను నమోదు చేసారా అన్న అనుమానాలు రేకెత్తకమానవు. ఆమ్ జన్మత్ పార్టీకి రూ. 620 కోట్లు, సత్యవాది రక్షక్ పార్టీకి రూ. 330.55 కోట్లు, స్వతంత్రత అభివ్యక్తి పార్టీకి రూ.200.69 కోట్లు, న్యూ ఇండియా యునైటెడ్ పార్టీకి రూ.200.69 కోట్లు, భారతీయ నేషనల్ జనతా దళ్‌కు రూ. 191.61 కోట్లు, గరీబ్‌కళ్యాణ్ పార్టీకి రూ. 138కోట్లు మేరకు విరాళాలు జమపడ్డాయి. ఆయా పార్టీలకు2024 ఎన్నికల్లో 15 లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టిన చరిత్ర ఉంది. ఎవరికీ డిపాజిట్లు కూడా దక్కలేదు. అందరికన్నా ఎక్కువ మొత్తంలో విరాళాలు పొందిన ఆమ్ జన్మత్ పార్టీ అత్యధిక విరాళాలు అందుకున్న స్థాయిలో రెండవది అయిన సత్యవాది రక్షక్ పార్టీలైతే ఒక్కో అభ్యర్థిని మాత్రమే నిలబెట్టాయి. ఎవరి ప్రోద్బలంతో ఈ పార్టీలు ఏర్పడ్డాయో పూర్తి సమాచారం లేకపోయినా వీరి వెనుక ఏదో బలమైన వ్యక్తుల నేపథ్యమే ఉంటుందన్నది నిర్వివాదాంశం. కానీ ఎవరు ఆయా పార్టీలనుమౌనంగా నడుపుతున్నారో తెలిస్తే మరో మాయ బజార్ బయటపడ్తుంది. ఇలాంటి అంశాలు భారతీయ రాజకీయ వ్యవస్థ పారదర్శకతను ప్రశ్నించే అంశాలుగా మిగిలిపోతాయి. ఆయా రాజకీయ పార్టీలకు చేరిన నిధులుపార్టీ రాజకీయ కార్యకలాపాల కోసమేనా లేదా మరొక మార్గంలో నగదు ప్రవాహాన్ని దారి మళ్లించడానికి చిన్న రాజకీయ పార్టీల సృష్టి జరుగుతోందా అన్నది తేలాలి. 2024-25 అసోషియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ఎన్నికల సంఘానికి పార్టీలు ఇచ్చిన నివేదికల మేరకు జాతీయ పార్టీల ఆదాయం లెక్కలు గమనిస్తే భారతీయ జనతాపార్టీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, సిపిఐ(ఎం) ఆప్, బిఎస్‌పి, ఎన్‌పిఇపిల ఆదాయం మొత్తం రూ. 7,960.09 కోట్లు. వాటిలో 85శాతంతో బిజెపి ప్రథమ స్థానంలో ఉంది. ఆయా పార్టీల కార్యక్రమాల నిర్వహణ పరిస్థితులు ప్రధాన పార్టీలకు చేరిన నిధులను బట్టికొంత సమంజసమేనని చెప్పుకోవచ్చు. ఆ తర్వాత స్థానంలో ఉన్న పార్టీల నిధుల రాబడి చూస్తే చెప్పుకోదగిన మొత్తాలు కావు. పార్టీలు విరాళాల మీద ఆధారపడటం పెద్ద తప్పేమీ కాదు కానీ అనామక పార్టీలకు అన్నేసి కోట్ల నిధులెలా వచ్చాయన్నది సర్వులు తెలుసుకోదగిన విషయమే. ఫిబ్రవరి 2024లో ఎలక్టోరల్ బాండ్లను సుప్రీం కోర్టు రద్దుచేశాక పార్టీల ఆదాయం కాస్త తగ్గింది కూడా. కాగా కొన్ని చిన్న పార్టీలకు పోగుపడిన విరాళాల సంగతే సందేహాస్పదంగా ఉంది.ప్రస్తుతం భారతీయ జనతాపార్టీ బీహార్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఉన్న అనామిక పాశ్వాన్ ఆధ్వర్యంలో 2020 పట్నాలో స్థాపించిన ఆమ్ జన్మత్ పార్టీకిఅత్యధిక నిధులు వసూళ్లయ్యాయి. ఇలాంటి నిధులున్న ఖాతాలన్నీ అహ్మదాబాద్‌లోనే ఉన్నాయి.గుజరాత్ రాష్ట్రమే ఓ బడాపారిశ్రామిక నగరం కనుక ఆయా అనామిక పార్టీలకు పారిశ్రామికవేత్తలే విరాళాలు ఇచ్చి ఉంటారని ఊహించవచ్చు. రాజకీయ పార్టీల నిర్వహణకే ఆ నిధులు ఖర్చుపెట్టాలని నిబంధన ఏదీలేకపోయినా ఎన్నికల కార్యక్రమాలకు పరిమితుల మేరకు వినియోగించవచ్చు. విచిత్రమేమిటంటే వాటిలో సత్యవాది రక్షక్ పార్టీ తనకు వచ్చిన రూ.330 కోట్లలో రూ.316 కోట్లను సామాజిక కార్యక్రమాలకు ఖర్చు చేసినట్లు వెల్లడించింది. ఇప్పటికిప్పుడు ఆయా పార్టీలకు చేరిన విరాళాలు ఎవరెవరు ఏయే రాజకీయ ప్రయోజనాలను ఆశించి వారికి ఫండ్స్ పంపినదీ తెలిస్తే తప్ప విరాళాల నేపథ్యం వాటి ఫలితాల గురించి తెలియదు. ఒకసారి పార్టీ కార్యకలాపాలకు ఆ పార్టీకివచ్చిన నిధులకు మధ్య అసమానత తీవ్రంగా ఉన్నప్పుడు అనేక సందేహాలు తలెత్తకమానదు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంత పారదర్శకంగా జరగాలో చెప్పుకునే ప్రజలు ఎన్నికలకు నిధులు సమకూరే మూలాలపై ఎలాఉండాలో నిర్దేశించవచ్చు. సుప్రీంకోర్టు తీర్పుతర్వాత ఎన్నికల్లో నిధుల ప్రవాహం పార్టీలకుఅందే విరాళాల విషయంలో పారదర్శకత పెరిగినా, తెలియని వనరుల ద్వారా వచ్చే ఆదాయం ఇంకా ప్రశ్నార్థకమే!.

> జీవంతో ఉన్నవన్నీ మరణించవలసిందే. మరణం అనేది ప్రకృతి ద్వారా శాశ్వతత్వంలోకి చేసే ప్రయాణం.
>
> షేక్‌స్పియర్



> మనుషులందరూ మట్టి నుంచి వచ్చినవాళ్లే. వారు పరస్పరం గౌరవప్రదంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
>
> అంబేద్కర్



## ప్రజావాక్కు

### అన్నీ స్మార్ట్‌ఫోన్‌లోనే..

ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం ప్రభుత్వపాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల కోసం, విద్యార్థిని విద్యార్థుల కోసం లీప్ యాప్ ప్రవేశపెట్టింది. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల హాజరుతో పాటు, వార్షిక పరీక్షల్లో వచ్చిన మార్కులు, టెస్టులలో వచ్చిన మార్కులు, అసెస్మెంట్ చేసినప్పుడు వచ్చిన మార్కులు, కరికులర్ కోరికులర్ ఎక్స్ట్రా క్యులర్ యాక్టివిటీస్ అన్ని నమోదు చేసే విధంగా హోలిస్టిక్ ప్రెస్ కార్డును కూడా ప్రవేశపెట్టింది.అయితే గతప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లలో పెట్టించినా ప్యానల్ బోర్డ్స్‌లో బైజుస్ కంటెంట్ కి బదులుగా క్లికర్స్‌అనే కంటెంట్‌ని ఉపయోగించమని అధికారులు సూచించారు ఆక్లిక్కర్స్ ఉపయోగించడానికి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వారి స్మార్ట్ ఫోన్‌లలో ఏపీకే ఆప్ ద్వారా వచ్చే డేంజరస్ అని చూపే ఒక యాప్‌ను డౌన్లోడ్ చేయమంటున్నారు. ఇప్పుడు ప్రతిఒక్కటి స్మార్ట్‌ఫోన్‌లోనే ఉంటున్నాయి.

- వి. భాస్కర్ రావు, బొబ్బిలి

### సమాజంలో మార్పు రావాలి

అక్రమ సంబంధాలు పెట్టుకునిభర్తలను భార్యలు, భార్యలను భర్తలు అంతమొందిస్తున్నారు. కడుపున పుట్టిన పిల్లలు అడ్డుగా ఉన్నారనుకుంటే వారినీకిరాతకంగా హతమారుస్తున్నారు. కన్నకూతుళ్లపైనే తండ్రులు అత్యాచారాలు చేస్తున్నారు. దీంతో బాల్యం నుంచే పిల్లలు విలన్‌లా తయారవుతున్నారు. కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత ఉండటం లేదు. ఆస్తికోసం డబ్బుల కోసం కలహించుకుంటున్నారు. ఒకర్నొకరు మోసగించుకుంటున్నారు. స్నేహితులు కూడా ఇలానే ఉంటున్నారు. సమాజం ఎటువైపు పోతోంది. సమాజంలో మార్పు రావాలి.

- కె.రామకృష్ణ, హైదరాబాద్

### ఇ-గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం పాఠశాలవిద్యార్థులకు ఇ-గ్రంథాలయం ఏర్పాటు చేసే దిశగాచర్యలు తీసుకోవాలి. నేటియుగం ఇంటర్నెట్‌కాలం. ప్రతీపాఠశాలలో వాట్సాప్ గ్రూపులున్నాయి. ఈ గ్రూపులల్లో ప్రతీ రోజు పిల్లల కథలు పోస్ట్ చేసి వారిచే చదివించాలి. ఇలా పోస్ట్ చేసిన కథలువిద్యార్థులు ఫోన్లోగ్రంథాలయంగా ఏర్పాటు చేసుకోవాలి. వారంలో వచ్చిన కథలు ప్రతీ శనివారం నోబాగ్ డేగా ఉంచి తరగతిలో విద్యార్థులచే చెప్పించాలి.

- ఆర్. సంగం నాయుడు, హైదరాబాద్

### సమన్వయమే శాశ్వత పునాది

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. జాతీయ రహదారులు, రైల్వేకారిడార్లు, విమానాశ్రయాలు, పారిశ్రామిక పార్కులు, డిజిటల్ మౌలికసదుపాయాల విస్తరణ దేశ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. అయితే ఈప్రగతి ప్రకృతి వనరుల సంరక్షణతో సమన్వయంగా సాగితేనే దీర్ఘకాలిక ఫలితాలు లభిస్తాయి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ పరస్పర విరుద్ధాలు కావు. సరైన విధానాలతో ఒకదానికొకటి బలాన్ని చేకూర్చగలవు. 1987లో బ్రంట్‌లాండ్ కమిషన్ నివేదిక ఆధారంగా ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన సుస్థిర అభివృద్ధి భావన ప్రపంచ విధానాలకు దిశానిర్దేశం చేసింది. భావితరాల అవసరాలను దెబ్బతీయకుండా నేటి అవసరాలను తీర్చే అభివృద్ధినే నిజమైన ప్రగతిగా నిర్వచించింది. ప్రకృతి-అభివృద్ధిసమన్వయమే ఆర్థికవృద్ధికి,పర్యావరణ భద్రతకు, సుస్థిర భద్రతకు, సుస్థిర భారత నిర్మాణానికి శాశ్వత పునాది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కల్తీ నూనెలతో కేన్సర్

నగరాలు, పట్టణాలలో హోటళ్ళు అనేకంగా ఉన్నాయి. ఈ హోటళ్ళలో వంటలకు, మిఠాయిలకు,తినుబండారాల తయారీకి వాడే వంటనూనెలను ఒకసారి కంటే ఎక్కువ సార్లు వాడటంతో ప్రజలు కేన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు గురి అవుతున్నారు. వాడిన వంటనూనెను పదే పదే వాడటం నిషేధం అయినా అనేక హోటళ్ళ యజమానులు పట్టించుకోవటం లేదు. అయితే దీనికో పరిష్కారం ఉంది. వాడేసిన వంటనూనెలను ప్రాసెస్‌చేసి బయోడీజిల్ తయారీకి ఉపయోగించుకోవచ్చు. ఇప్పుడు మనదేశంలో అనేక పట్టణాలు, నగరాలలో హోటళ్ళ వారి నుంచి వాడేసిన వంట నూనెలను సేకరిస్తున్నారు. దీనివల్ల హోటళ్ళ వారికి రాబడేకాక ప్రజల ఆరోగ్యాలు కాపాడబడతాయి. శిలాజ ఇంధనాల కంటే బయోడీజిల్ ఉత్తమం. కొద్దో గొప్పో పర్యావరణమూ బాగవుతుంది. ఆహార భద్రతాధికారులు ఈ విషయమై లోతుగా ఆలోచించి ఒక ప్రణాళిక రూపొందించాలి.

- కె. వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### చట్టం అందరికీ సమానమే

భారతదేశ రాజ్యాంగంలోని హక్కులు ప్రభావితం చేసే అంశాలు ప్రతి ఒక్కమానవుడికి సమానమే.కులాల పేరుతో మతాల పేరుతో పార్టీలపేరుతో బడానాయకుల పేరుతో నీకొక చట్టం, నాకొక చట్టం అనికాకుండా చట్టాలను గౌరవించాలి. అందరూ ఆర్థికంగా ఎదగాలి.సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# నైపుణ్యం ఉంటే ఉద్యోగం భద్రం

**ఏఐ వస్తోంది..నా ఉద్యోగం పోతుందా?"అని భయపడే కంటే, ఏఐ వచ్చిన తర్వాత నా పని ఏ రూపంలో ఉంటుంది? దానికి నేనుసిద్ధంగా ఉన్నానా? అని ఆలోచించడం ముఖ్యం. మరో అపోహను తొలగించుకోవడం కూడా అవసరం. ఏఐని నేర్చుకోవడం అంటే కేవలం చాట్‌జిపిటి వంటి కొన్ని ఏఐ సాధనాలను ఉపయోగించడం లేదా కొన్ని ప్రాంప్ట్‌లు రాయడం మాత్రమేకాదు, తాను పనిచేస్తున్న రంగానికి సంబంధించిన లోతైన విషయ పరిజ్ఞానాన్ని ఏఐ సామర్థ్యానికి జోడించి మెరుగైన ఫలితాలను రాబట్టడం. పొంచి ఉన్న ప్రమాదాన్ని జాగ్రత్తగా గమనిస్తూ, తనకున్న నైపుణ్యాలకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పదును పెట్టుకుంటూ ఉండటమే ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగికి శ్రీరామరక్ష. ఉద్యోగస్తులతోబాటు ఉద్యోగార్థులకు, విద్యార్థులకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.**



కృష్ణ బాలాజి పల్లపోతు

టెక్నాలజీ రంగంలో ఉద్యోగాల కోతలకు సంబంధించి తరచూ వెలువడుతున్న గణాంకాలు కలవరపెడుతున్నాయి. లేఆఫ్స్‌పై సమాచారం ప్రకారం, ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు ప్రపంచవ్యాప్తంగా 289 టెక్ కంపెనీలు 1,23,305 మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. గత ఏడాది మొత్తం తొలగింపుల సంఖ్యను ఈ ఏడాది ఎనిమిది నెలల్లోనే చేరుకోవడం ఆందోళనకరమే. అయితే ఈ గణాంకాన్ని చూసి టెక్ రంగంలో ఇన్ని ఉద్యోగాలు శాశ్వతంగా కనుమరుగయ్యాయని భావించడం సరికాదు. ఇదే సమయంలో కొత్త నియామకాలు కూడా పెద్ద సంఖ్యలోనే జరిగి ఉండవచ్చు కానీ వాటికి సంబంధించిన కచ్చితమైన సమాచారం అందుబాటులో లేదు. ఈ తొలగింపులకు ఖర్చుల తగ్గింపు, సంస్థల పునర్వ్యవస్థీకరణ, వ్యాపార ప్రాధాన్యతల్లో మార్పులతో పాటు కృత్రిమ మేధ (ఎఐ) వినియోగం కూడా ఒక ప్రధాన కారణంగా చర్చించబడుతోంది. అయితే ఉద్యోగాలను తొలగిస్తున్న పలు సంస్థల్లోనే కొత్తరకాల ఉద్యోగాలకు గిరాకీ పెరుగుతోంది. ఉదాహరణకు టీసీఎస్ గత ఏడాది 12,000కు పైగా ఉద్యోగాలను తగ్గించే పునర్వ్యవస్థీకరణను చేపట్టగా, ఈ ఏడాది ఏఐ ఆధారిత పరిష్కారాలను అమలు చేయడం కోసం కస్టమర్లతో కలిసి పనిచేసే ఫార్వర్డ్‌డిప్లాయ్‌డ్ ఇంజినీర్లు అనే ప్రత్యేక విభాగాన్ని సుమారు 8,000 మంది సిబ్బందితో రూపొందిస్తోంది. ఒక సంస్థ కార్యకలాపాలను మునుపటి కంటే వేగంగా, మెరుగ్గా, తక్కువ సిబ్బందితో నిర్వహించగలిగే ఏఐ సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. దాంతో ఉద్యోగి నుంచి కంపెనీ ఆశించే నైపుణ్యాలు, నియామక పద్ధతులు వేగంగా మారుతున్నాయి. ఫౌండిట్ సంస్థ ఆగస్టు గణాంకాల ప్రకారం 7-10 సంవత్సరాల అనుభవం ఉన్న వారి నియామకాలు 10శాతం పెరగ్గా, 0-3 సంవత్సరాల అనుభవం ఉన్నవారి నియామకాలు 9శాతం తగ్గాయి. మరోవైపు, లింక్డ్ఇన్ నివేదిక ప్రకారం భారత్‌లో సాధారణ నియామకాలు మందగిస్తున్నప్పటికీ, ఏఐ ఇంజినీరింగ్ నియామకాలు ఏడాది వ్యవధిలో 59.5 శాతం పెరగడం గమనార్హం. నియామకాల విధానం, పరిమాణం ఆధారిత పద్ధతి అంటే 'ఎక్స్' పనికి 'వై' మంది సిబ్బంది కావాలి అనే నమూనా నుంచి, సామర్థ్యం ఆధారిత పద్ధతి అంటే 'ఎక్స్' పనికి 'వై' సామర్థ్యం కావాలి అనే ఒరవడికి మారుతోంది. మూస పద్ధతిలో సాగిపోయే సాధారణ పనులను ఏఐ చేపడుతుండటం వల్ల ప్రవేశ స్థాయి ఉద్యోగాల అవసరం తగ్గుతోంది. అదే సమయంలో నిర్ణయం, విచక్షణ, పరిశోధన,సమస్య పరిష్కారం అవసరమైన మధ్యస్థాయి ఉద్యోగులకు గిరాకీ పెరుగుతోంది. ఈ ధోరణి వేతనాల్లోనూ ప్రతిబింబిస్తోంది. ప్రపంచ బ్యాంకు గణాంకాలను ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం డిజిటల్ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులకు సగటున 12 శాతం అధిక



వేతనం ఉంటే, ఏఐ సంబంధిత ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన వారికి 28శాతం వరకు అధిక పారితోషికం లభిస్తోంది. పిడబ్ల్యుసి ఏఐజాబ్స్ బారోమీటర్ కూడా ఇదే దిశను సూచిస్తోంది. ఏఐ ప్రభావం ఉన్న ఉద్యోగాల్లో కొన్ని పనులు యంత్రాలు చేపట్టగా మిగిలే పనిలో నైపుణ్యం, నిర్ణయ సామర్థ్యం, సృజనాత్మకత, నాయకత్వం వంటి లక్షణాలకు ప్రాధాన్యం ఉంటోంది. ఇలాంటి ఉద్యోగాలను పిడబ్ల్యుసి ప్రొఫెషనలైజ్డ్ ఉద్యోగాలుగా వర్గీకరించింది. మరోవైపు, ఇంతకుముందు శిక్షణ అవసరమైన కొన్ని పనులను ఏఐ సులభతరం చేయడంతో, అవి ప్రత్యేకమైన నైపుణ్యాల అవసరం లేకుండా ప్రతి ఒక్కరూ చేయగలిగేలా మారాయి. పిడబ్ల్యుసి వాటిని డెమొక్రటైజ్డ్ ఉద్యోగాలుగా పేర్కొంది. ఈ రెండు రకాల ఉద్యోగాల వేతనవృద్ధిలో 42 శాతం భారీ వ్యత్యాసం ఉండటం గమనార్హం. ఈపరిణామం టెక్ ఉద్యోగుల బాధ్యతలను తిరగరాస్తోంది. ఒక ప్రోగ్రామర్ కోడ్ రాయడంలో దిట్టకావచ్చు. కానీ అదే పనిని ఏఐ వేగంగా చేయగలిగితే, ఆ నైపుణ్యానికి ఉన్న ప్రత్యేకత, విలువ తగ్గిపోతాయి. అప్పుడు ప్రోగ్రామర్ విలువ కోడ్ రాయడంలో కాకుండా అసలు కోడ్ రాసే అవసరమే లేని ప్రత్యామ్నాయం ఏమైనా ఉందా? కోడ్ అవసరం ఉంటే ఎలాంటి కోడ్ రాయాలి? ఏ ఏఐ మోడల్ ఆ కోడ్ కచ్చితంగారాయగలదు? ఏఐ రూపొందించిన కోడ్‌లో దోషాలు ఉన్నాయా? దానివల్ల భద్రతకు ముప్పు ఉందా? వ్యాపార అవసరానికి అది సరిపోతుందా? వంటి కీలక విషయాలను నిర్ధారించడంలో పెరుగుతుంది. ఈ మార్పు ఫ్రెషర్లకు కూడా ఇబ్బందికరంగా మారింది. కంపెనీలు ప్రవేశ స్థాయి ఉద్యోగాల్లోనూ వ్యూహాత్మక ఆలోచన, నిర్ణయ సామర్థ్యం ఆశిస్తున్నాయి. ఎందుకంటే ఒకప్పుడు ఉద్యోగంలో చేరిన తర్వాత నెమ్మది నెమ్మదిగా నేర్చుకునే అవకాశం ఉన్న సాధారణ పనులు తగ్గుతున్నాయి. ఫ్రెషర్‌కు మొదటి రోజు నుంచే ఏఐ సాధనాలను ఉపయోగించే సామర్థ్యంతోపాటు ఎక్కువ నిర్ణయసామర్థ్యం, లోతైన విషయ పరిజ్ఞానం కూడా అవసరమవుతోంది. ప్రాథమిక స్థాయి, మూసకట్టు ధోరణిలో సాగిపోయే పనులను చాలా వరకూ ఏఐ చేస్తోంది కాబట్టి, ఏఐని ఉపయోగించే సంస్థలన్నీ తప్పనిసరిగా తక్కువ మందితోనే పనిచేస్తున్నాయని చెప్పడం సరికాదు. ఏఐతో కొత్త సేవలు, ఉత్పత్తులు, వ్యాపార అవకాశాలను సృష్టించే కంపెనీలు కొత్త ఉద్యోగావకాశాలను సృష్టిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) అంచనాల ప్రకారం 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 17 కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడవచ్చని, 9.2కోట్ల ఉద్యోగాలు స్థానభ్రంశం చెందవచ్చని, మొత్తంగా 7.8కోట్ల ఉద్యోగాలు నికరంగా పెరగవచ్చని పేర్కొంది. ఉద్యోగం కోల్పోవడం అనేది ఒక్కసారిగా జరిగే పరిణామం,కానీ దానికి దారి తీసే నైపుణ్యం విలువ కోల్పోవడం అనేప్రక్రియ మాత్రం నెమ్మదిగా జరిగుతుంది. చాలా సందర్భాల్లో ఆ పరిణామం ఉద్యోగికి తెలియకుండానే చాప క్రిందనీరులా సాగిపోతుంది. కాబట్టి ఏఐ వస్తోంది..నా ఉద్యోగం పోతుందా?"అని భయపడే కంటే, ఏఐ వచ్చిన తర్వాత నా పని ఏ రూపంలో ఉంటుంది? దానికి నేనుసిద్ధంగా ఉన్నానా? అని ఆలోచించడం ముఖ్యం. మరో అపోహను తొలగించుకోవడం కూడా అవసరం. ఏఐని నేర్చుకోవడం అంటే కేవలం చాట్‌జిపిటి వంటి కొన్ని ఏఐ సాధనాలను ఉపయోగించడం లేదా కొన్ని ప్రాంప్ట్‌లు రాయడం మాత్రమేకాదు, తాను పనిచేస్తున్న రంగానికి సంబంధించిన లోతైన విషయ పరిజ్ఞానాన్ని ఏఐ సామర్థ్యానికి జోడించి మెరుగైన ఫలితాలను రాబట్టడం. పొంచి ఉన్న ప్రమాదాన్ని జాగ్రత్తగా గమనిస్తూ, తనకున్న నైపుణ్యాలకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పదును పెట్టుకుంటూ ఉండటమే ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగికి శ్రీరామరక్ష. ఉద్యోగస్తులతోబాటు ఉద్యోగార్థులకు, విద్యార్థులకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. ●

# భూగర్భ జలాలను పరిరక్షిస్తున్నామా!

ఫిరోజ్ ఖాన్

నీటి సంక్షోభం అంటే నదులు ఎండిపోవడం, చెరువులు ఖాళీ కావడం మాత్రమే కాదు. నేల అడుగున నిశ్శబ్దంగా తగ్గిపోతున్న భూగర్భ జలాలు కూడా తీవ్రమైన హెచ్చరిక. ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం 2026 జనవరిలో విడుదల చేసిన ప్రపంచ జల అధ్యయనం ప్రకారం ప్రపంచంలోని ప్రధాన భూగర్భ జలాశయాల్లో దాదాపు 70 శాతం దీర్ఘకాలిక క్షీణతను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ గృహ అవసరాలకు ఉపయోగించే నీటిలో సుమారు సగం భూగర్భ జలాల నుంచేవస్తోంది. సాగునీటికి ఉపయోగించే నీటిలో 40శాతానికి పైగా భూగర్భజలాలపై ఆధారపడు తోంది. అధికంగా నీటిని వెలికితీయడం వల్ల భూమి దిగ జారే ప్రమాదం కూడా పెరుగుతోంది. భూగర్భ జలాల అధిక వినియోగంతో ముడిపడిన భూమి దిగజారే ప్రభా వం ఆరు మిలియన్ చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరించినట్లు అధ్యయనం పేర్కొంది. దాదాపు రెండు బిలియన్ల మంది ప్రజలు అటువంటి ప్రభావ పరిధిలో ఉన్నట్లు నివేదిక అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా పెద్ద సరస్సుల్లో సగం 1990ల ప్రారంభం నుంచి నీటి నష్టాన్ని ఎదుర్కొన్నట్లు అధ్యయనం వెల్లడించింది. సహజంగా తిరిగి నిండే వేగాన్ని మించి భూగర్భ జలాలను వినియోగిస్తే భవిష్యత్ తరాలపై నీటి భారం మరింత పెరిగే అవకాశం ఉంది. భారతదేశ పరిస్థితిని కేంద్ర భూగర్భ జల మండలి 2025 అంచనాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. దేశవ్యాప్తంగావార్షిక భూగర్భ జల పునఃనింపుదల పరిమాణం 448.52 బిలియన్ ఘనపు మీటర్లు. వినియోగానికి అందుబాటులోఉన్న వార్షిక వనరు 407.75 బిలియన్ ఘనపు మీటర్లు.వార్షిక భూగర్భ జల వెలికితీత 247.22 బిలియన్ ఘనపు మీటర్లు. దేశ స్థాయి భూగర్భ జల వినియోగ దశ 60.63 శాతంగా నమోదైంది. తెలంగాణలో వార్షిక భూగర్భ జల పునఃనింపుదల పరిమాణం 21.93బిలియన్ ఘనపు మీటర్లు కాగా, వినియోగానికి అందుబాటులో ఉన్న వనరు 19.84 బిలియన్ ఘనపు మీటర్లు.వార్షిక వెలికితీత 9.26 బిలియన్ ఘనపు మీటర్లు. వినియోగ దశ 46.69 శాతంగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లో పునఃనింపుదల పరిమాణం 26.34 బిలియన్ ఘనపు మీటర్లు. వినియోగానికి అందుబాటులోఉన్న వనరు 25.02 బిలియన్ ఘనపు మీటర్లు. వార్షిక వెలికితీత 7.88 బిలియన్ ఘనపు మీటర్లు. వినియోగ దశ 31.51 శాతంగా ఉంది. తెలంగాణ తాజా పర్యవేక్షణ గణాంకాలు మరో కోణాన్ని చూపిస్తున్నాయి. 2026 ఆగస్టులో రాష్ట్రసగటు భూగర్భ జలమట్టం భూమి ఉపరితలం నుంచి 7.87 మీటర్ల లోతులో నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 1,771పర్యవేక్షణ కేంద్రాల ద్వారా జల మట్టాలను పరిశీలించారు. జూలైతో పోలిస్తే ఆగస్టులో సగటున 1.61మీటర్ల మెరుగుదల కనిపించింది. 27 జిల్లాల్లో జలమట్టం పైకివచ్చింది. అయితే 2025 ఆగస్టుతో పోలిస్తే రాష్ట్ర సగటు జలమట్టం 2.09 మీటర్లు దిగజారింది. 30 జిల్లాల్లో క్షీణత నమోదైంది. కాబట్టి ఒక నెలలోకనిపించిన మెరుగుదల కంటే దీర్ఘకాలిక జలమట్టాల ధోరణినే ప్రధా నంగా పరిశీలించాలి. వర్షం పడటం ఒక్కటే భూగర్భ జల భద్రతకు హామీ కాదు. వర్షపు నీటిలో ఎంత భాగం నేల లోకి చేరుతోంది అన్నదే కీలక ప్రశ్న. తెలంగాణలో 2026 రుతుపవన కాలంలో వర్షపాతం ప్రాంతాలవారీగామారింది. సెప్టెంబర్ 1నాటికి రాష్ట్రంలో 473.9 మిల్లీమీటర్ల వర్షపా తం నమోదైంది. సాధారణంగా 581.2 మిల్లీమీటర్లు ఉండాల్సిన స్థాయితో పోలిస్తే 18శాతం లోటునమోదైంది. 33 జిల్లాల్లో 17జిల్లాలు లోటు వర్షపాతం వర్గంలో ఉండ గా 16 జిల్లాలు సాధారణ వర్గంలో ఉన్నాయి. ఆగస్టులో 134.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదై, సాధారణ215.8 మిల్లీమీటర్లతో పోలిస్తే 3 శాతం లోటు కనిపించింది. అయితే వర్షపాతంలోటు ఒక్కటే భూగర్భ జలాల క్షీణతకు కారణమని చెప్పడం శాస్త్రీయంగా సరైంది కాదు. వర్షపు నీరు నేలలోకి చొచ్చుకెళ్లే సామర్థ్యం, భూమి స్వభావం, బోర్ల వినియోగం, సాగు విధానం, పట్టణీకరణ, సహజ జలమార్గాల పరిస్థితి వంటి అనేక అంశాలు జలమట్టాలను ప్రభావితం చేస్తాయి. అందుకే ఎంత వర్షం పడింది అన్న దానితో పాటు ఎంత నీరు నేలలోకి చేరింది, ఎంత నీరు వెలికితీశారు అన్న లెక్క కూడా అవసరం.నగర విస్తరణతో సహజ నీటిచొరబాటు ప్రాంతాలు తగ్గకుండా చూడటం భూగర్భ జలభద్రతలో కీలక అంశం. బోర్ల లోతు కాదు.. జల భద్రతే ముఖ్యం! భూగర్భ జలాల సమస్యకు మరింత లోతైన బోర్లు మాత్రమే పరి ష్కారం కావు. వర్షపు నీటిని నిల్వ చేయడం, చెరువులను పునరుద్ధరించడం, కుంటలను కాపాడటం, చెక్‌డ్యామ్‌లు, పర్కొలేషన్ ట్యాంకులు, నీటిని నేలలోకి చేర్చే బావులు నిర్మించడం, పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సేకరణ వ్యవ స్థలను బలోపేతం చేయడం అవసరం. కేంద్ర ప్రభుత్వం కూడా నీటి సంరక్షణ,కృత్రిమ భూగర్భ జల పునఃనింపు దల, వర్షపు నీటి సేకరణకు ప్రాధాన్యం ఇస్తోంది. అయితే ఒక ప్రాంతంలో పనిచేసిన విధానాన్ని మరో ప్రాంతానికి యథాతథంగా వర్తింపజేయ

# రాజకీయ కాలుష్యానికి చరమగీతం పాడాలి!

డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి

వాతావరణ కాలుష్యం ప్రకృతిని దెబ్బతీస్తే.. రాజకీయ కాలుష్యం ప్రజాస్వామ్య వ్యవస్థను, సామాజిక విలువలను నాశనం చేస్తుంది. ఒకటి మన ఊపిరిని కలుషితం చేస్తే మరొకటి మన ఆలోచనలను, సంబంధాలను, భవిష్యత్తును కలుషితం చేస్తుంది. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు నాటాల్సిన అవసరం ఎంత ఉందో.. రాజకీయ కాలుష్యాన్ని తగ్గించేందుకు నైతిక విలువలను పెంచాల్సిన అవసరం అంతే ఉంది. రాముడిని ధర్మానికి ప్రతీకగా, రామరాజ్యాన్ని ఆదర్శ పాలనకు ప్రతీకగా కొలిచే భారతదేశంలో రాజకీయాల్లో విలువల పతనం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ ప్రత్యర్థిత్వం అనేక సందర్భాల్లో విధానపరమైన విమర్శల స్థాయి దాటి వ్యక్తిగత దూషణలు, కక్షసాధింపులు, పరస్పర ఆరోపణలకు చేరుకోవడం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి మంచిది కాదు. రాజకీయ వ్యవస్థలో నైతిక విలువలు క్షీణించి, ప్రజా సేవ స్థానంలో స్వార్థం, అధికార దాహం, అవినీతి, అసత్య ప్రచారం, అవకాశవాదం, కక్షసాధింపు వంటి ధోరణులు పెరగడాన్ని రాజకీయ కాలుష్యంగా చెప్పవచ్చు.సిద్ధాంతాలు, విధానాలు, ప్రజా ప్రయోజనాల కంటే అధికారం, పదవి ముఖ్యమైపోతే రాజకీయాల స్వభావమే మారిపోతుంది. పార్టీలు మారడం తప్పు కాదు, ప్రజా ప్రయోజనాల కోసం రాజకీయ పునర్వ్యవస్థీకరణ కూడా ప్రజాస్వామ్యంలో సహ జమే. కానీ కేవలం పదవి లేదా వ్యక్తిగత ప్రయోజనంకోసం సిద్ధాంతాలను మార్చుకోవడం, ప్రజల తీర్పును తేలికగా తీసుకోవడం రాజకీయ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. ప్రజాస్వామ్యంలో అధికార పక్షాన్ని ప్రతిపక్షం ప్రశ్నించాలి. ప్రతిపక్షాన్ని అధికార పక్షం విమర్శించాలి. కానీ విమర్శ విధానాలపై ఉండాలి. వ్యక్తిత్వ హననంగా మారకూడదు. సోషల్ మీడియా విస్తరణతో రాజకీయ ప్రత్యర్థులపై అసభ్య పదజాలం, ట్రోలింగ్, తప్పుడు ప్రచారం పెరగడం ఆందోళనకరం. నాయకులు మాట్లాడే భాషను యువత గమనిస్తుంది. ప్రజా జీవితంలో ఉన్నవారు పరస్పరం గౌరవం కోల్పోతే, సమాజంలోనూ అదే సంస్కృతి వ్యాపించే ప్రమాదం ఉంది. రాజకీయ నాయకత్వం సమాజానికి ఆదర్శంగా ఉండాలి. అనైతిక ప్రవర్తనకు నమూనాగా మారకూడదు. అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించడం సహజం. తప్పులు జరిగితే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం కూడా అవసరమే. అయితే చట్టం అందరికీ సమానంగా వర్తించాలి. దర్యాప్తు సంస్థలు, పోలీసు వ్యవస్థలు, ప్రభుత్వ యంత్రాంగం రాజకీయ ప్రత్య ర్థులను వేధించడానికి ఉపయోగపడుతున్నాయనే భావన ప్రజల్లో ఏర్పడితే ప్రజాస్వామ్యసంస్థలపై నమ్మకం దెబ్బతిం టుంది. అధికారం శాశ్వతం కాదు. ఈ రోజు అధికారంలో ఉన్నవారు రేపు



ప్రతిపక్షంలో ఉండవచ్చు. అందుకే వ్యవస్థ లను బలపరచడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత.రాజకీయ కాలుష్యానికి మరో ప్రధాన కారణం ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టే సంస్కృతి. డబ్బు, మద్యం, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలకు ఓటును అమ్ముకోవడం కేవలం ఒక ఎన్నికను ప్రభావితం చేయడం కాదు.ఐదేళ్ల భవిష్యత్తును ప్రభావితం చేయడం. కులం, మతం, ప్రాంతం, వ్యక్తిగత పరిచయం వంటి అంశాలతోపాటు అభ్యర్థి సామర్థ్యం, నిజాయితీ, ప్రజాసేవా దృక్పథం, గత పనితీరు,ప్రజా సమస్యలపై అవగాహన వంటి అంశాలను ఓటరు పరిశీలించాలి. రాజకీయ కాలుష్యానికి మూల్యం సమాజమే చెల్లిస్తుంది రాజకీయాల్లో అవినీతి పెరిగితే ప్రజాధనం దుర్వినియోగమవుతుంది. బంధుప్రీతి, సిఫార్సులు పెరిగితే ప్రతిభకు అన్యాయం జరుగుతుంది. తప్పుడు హామీలు పెరిగితే ప్రజల్లో నిరాశ పెరుగుతుంది. కుల,మత, ప్రాంతీయ విభజనలు రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొట్టబడితే సామాజిక ఐక్యత బలహీనపడుతుంది. అత్యంత ప్రమాదకరమైన పరిణామం ప్రజల్లో రాజకీయ ఉదాసీనత పెరగడం. ఎవరు అధికారంలోకి వచ్చినా మన పరిస్థితి మారదు అనే భావన ప్రజాస్వామ్యానికి విషపూరితం. ప్రజలు రాజకీయాలపై నమ్మకం కోల్పోతే ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల ప్రక్రియగా మిగిలిపోతుంది. యువతే మార్పుకు చోదకశక్తి. భారత దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువత.అందుకే రాజకీయాలను తిట్టడం మాత్రమే కాకుండా, రాజకీయాలను శుద్ధి చేసే బాధ్యతను కూడా యువత తీసుకోవాలి. ముందుగా విజ్ఞతతో ఓటు వేయాలి. అభ్యర్థుల గురించి తెలుసుకోవాలి. తప్పుడు వార్తలను ధృవీకరించకుండా సామాజిక మాధ్యమాల్లో పంచకూడదు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించాలి. అవసరమైనప్పుడు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించాలి. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపాలి. అంతకంటే ముఖ్యంగా సేవాభావం, నిజాయితీ, నిబద్ధత ఉన్న యువత స్థానిక సంస్థల రాజకీయాల్లోకి రావాలి. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ, అసెంబ్లీ, పార్లమెంట్ వరకు మంచి నాయకత్వం ఎదగాలి. రామరాజ్యం అంటే కేవలం నినాదం కాదు రామరాజ్యం అంటే ఒక మతపరమైన నినాదంగా చూడాల్సిన అవసరం లేదు. ప్రజలందరికీ న్యాయం, పాలనలో పారదర్శకత, పాలకుల్లో ధర్మబద్ధత, బలహీనులకు రక్షణ, ప్రజల పట్ల బాధ్యత, అధికారంలో ఉన్నవారికి జవాబుదారీతనం ఉండే ఆదర్శ పాలన అనే విస్తృత భావనగా చూడాలి. అలాంటి రామరాజ్యం రావాలంటే ముందుగా రాజకీయ కాలుష్యాన్ని తొలగించాలి. అందుకు నాయకులు మారాలి. రాజకీయ పార్టీలు మారాలి. అంతకంటే ముఖ్యంగా ఓటర్లు కూడా మారాలి. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతిఒక్కరూ తమవంతుబాధ్యత తీసుకోవాల్సినట్లే, రాజకీయ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి పౌరుడు తన బాధ్యతను నిర్వర్తించాలి. పంచాయతీ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ప్రజాస్వామ్య విలువలు, నైతికత, జవాబుదారీతనం, ప్రజాసేవ అనే నాలుగు స్తంభాలపై భారత రాజకీయ వ్యవస్థను నిర్మించాలి. అప్పుడే రాజకీయాలు అధికార పోరాటానికి వేదిక కాకుండా.. ప్రజాసేవకు పవిత్రమైన వేదికగా మారతాయి. రాజకీయ కాలు

9-9Pg5:9-9Pg5.qxd 9/9/2026 12:26 AM Page 1



# యుఎన్ కొత్త మ్యాప్‌లో మళ్లీ తేడాలు!

## అరుణాచల్, అక్సాయ్‌చిన్‌లను ప్రత్యేక ప్రాంతాలుగా చూపిన సమితి

### తప్పుదోవ పట్టించే చిత్రణను ఆమోదించం : భారత్

**న్యూయార్కు, సెప్టెంబరు 8:** ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కరెక్ట్ ది మ్యాప్ తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో వెలువడిన ఈ మ్యాప్‌లో అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను భారత్, చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపించారు. అక్సాయ్‌చిన్‌ను లడఖ్‌లో భాగంగా భారత్ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ఐరాససర్వసభ్య సమావేశం తీర్మానంపై చర్చలు జరుగుతున్న సమయంలో జులై 1న ఈ మ్యాప్‌ను తొలిసారి విడుదల చేశారు. ఇందులో అరుణాచల్‌ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించారు. అరుణాచల్‌ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చూపిస్తూ పశ్చిమాన అసోం, ఉత్తరాన చైనా సరిహద్దుగా ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. అదే విధంగా అక్సాయ్‌చిన్‌ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. దాని పశ్చిమ వైపు భారత్, తూర్పు వైపు చైనా సరిహద్దులు ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. ఈ మార్పులు ఎందుకు చేశారన్న దానిపై ఐరాస ఎలాంటి వివరణ ఇవ్వలేదు. జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్యఉన్న నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)ని కూడా మ్యాప్‌లో చుక్కల రేఖతో చూపించారు. దీనిపై మ్యాప్ కింది భాగంలో ఐరాస వివరణ ఇచ్చింది. భారత్, పాకిస్థాన్ అంగీకరించిన జమ్మూ కశ్మీర్ ఎల్‌ఓసీని ఈ చుక్కల రేఖ సుమారుగా సూచిస్తుందని పేర్కొంది. జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా అంగీకారం కుదరలేదని తెలిపింది. ప్రపంచంలోని ప్రాంతాలను పటాల్లో మరింత కచ్చితంగా, సమానత్వంతో చూపించాలంటూ ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో తీసుకొచ్చిన కరెక్ట్ ది మ్యాప్ తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం గత వారం ఆమోదించింది. ముఖ్యంగా ఆఫ్రికా ప్రాంతాల భౌగోళిక చిత్రణను మరింత సమానంగా చూపించడమే దీని లక్ష్యం. ఈ తీర్మానం చట్టబద్ధంగా అమలు చేయాల్సినది కాదు. అయితే ప్రపంచవ్యాప్తంగా బహుళపక్ష సంస్థలు ఉపయోగించే ప్రామాణిక ప్రపంచ పటాల్లో దీనికి అనుగుణంగా మార్పులు చేసే అవకాశం ఉంది. ఆఫ్రికన్ గ్రూప్ తరఫున టోగో ఈ తీర్మానాన్ని ముందుకు తీసుకెళ్లింది. భారత్ దీనికి మద్దతు తెలిపింది. సమాన విస్తీర్ణాన్ని ప్రతిబింబించే పటాల రూపకల్పన అనే మౌలిక సూత్రానికి మద్దతుగా తాము ఓటు వేసినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఏదైనా నిర్దిష్ట పటం, మ్యాప్ ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణకు ఈ తీర్మానం ఆమోదం కాదని స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు సహా భారత సార్వభౌమ భూభాగాన్ని అధికారిక భారత పటం ప్రకారమే చూపించాలని పేర్కొంది. తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే చిత్రణను అంగీకరించబోమని తెలిపింది.



## విమానాలకు పోటీగా సరికొత్త రైళ్లు

### 600 కి.మీ. వేగంతో ప్రయాణం

**బీజింగ్, సెప్టెంబరు 8:** వేగంలో విమానాలతో పోటీ పడేలా చైనా, జపాన్‌లు రైళ్లను తీర్చిదిద్దుతున్నాయి. తూర్పు ఆసియాలో గంటకు 370 మైళ్ల (600 కి.మీ.) వేగంతో ప్రయాణించే ఫ్లోటింగ్ రైళ్లు, వాణిజ్య విమాన ప్రయాణానికి పోటీగా హై స్పీడ్ రైలున నిలబెడుతున్నాయి. ఈ సాంకేతిక పురోగతిలో చైనా, జపాన్ ప్రధాన కేంద్రంగా ఉన్నాయి. ఒక వాణిజ్య విమానం గంటకు 550 మైళ్ల (885 కి.మీ.) వేగంతో ప్రయాణిస్తుండగా, మ్యాగ్లెవ్ రైలు గంటకు 217 మైళ్ల (350 కి.మీ.) వేగంతో వెళ్లే సాధారణ హైస్పీడ్ రైలు వేగానికి పూర్తి భిన్నమైనది. సాంప్రదాయ బుల్లెట్ రైళ్లు, విమానయాన రంగం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడానికి చైనా ప్రభుత్వ మద్దతు ఉన్న తయారీదారు సిఆర్ఆర్‌సి గంటకు 370 మైళ్ల వేగంతో వెళ్లే మాగ్లెవ్ రైలు ప్రోటోటైప్‌ను ప్రదర్శించింది. విద్యుదయస్కాంత సస్పెన్షన్‌పై నడిచే ఈ రైలు యాంత్రిక ఘర్షణ లేకుండా గైడ్ ట్రాక్‌కంటే కొద్ది మిల్లీమీటర్లఎత్తులో సునాయాసంగా తేలుతూ వెళ్తుంది. గరిష్ఠ వేగంతో ఇరుకైన పర్వత మార్గాల్లోకి ప్రవేశించేటప్పుడు ఏర్పడే 'టన్నెల్ బూమ్' గాలి ఒత్తిడిని నివారించడానికి పోరస్, షాక్ అబ్జార్బింగ్ టన్నెల్ బఫర్‌లను రూపొందించడం వంటి సంక్లిష్టమైన ఏరోడైనమిక్ సవాళ్లను చైనా ఇంజినీర్లు అధిగమించారు. రద్దీఎక్కువగాఉండే బీజింగ్ నుంచి షాంఘైకారిడార్‌లో ఈ 370 మైళ్ల మాగ్లెవ్‌ను అందుబాటులోకి తెస్తే, ప్రయాణసమయం సుమారు 4 గంటల నుంచి 2.5 గంటలకు తగ్గు తుంది. ఇది కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తూనే డోర్-టు-డోర్ ఫ్లైట్ సమయాలకు సరిసమానంగా ఉంటుంది.

**పోటీనిస్తున్న జపాన్ రైళ్లు**

షింక్యాన్సెన్‌తో ఆధునిక బుల్లెట్ రైళ్లను ప్రారంభించిన జపాన్, తన చువో షింక్యాన్సెన్ లైన్‌తో దీనికి పోటీనిస్తున్నది. సూపర్ కండక్టింగ్ మ్యాగ్నెటిక్ లెవిటేషన్ సాంకేతికతపై నిర్మించబడిన జపనీస్ టెస్ట్ రైళ్లు, ప్రయోగాత్మక ట్రాక్‌లపై గంటకు 375 మైళ్లు (603 కి.మీ.) రికార్డు వేగాన్ని అందుకున్నాయి. టోక్యో, నాగోయా, ఒసాకా నగరాలను అనుసంధానించేలా డిజైన్ చేసిన జపాన్ సిస్టమ్, అత్యల్ప ఉష్ణోగ్రతలకు చల్లబరిచిన శక్తివంతమైన నియోబియం-టైటానియం అయస్కాంతాలను ఉపయోగిస్తున్నది. ఇది 10 సెంటీమీటర్ల గ్యాప్‌లో తేలుతూ ప్రయాణిస్తుంది. స్థిరమైన లెవిటేషన్‌ను సాధ్యం చేస్తుంది.



## ఇరాన్‌తోయుద్ధం ముగిస్తే భారీగా తగ్గనున్న గ్యాసోలిన్ ధరలు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 8:** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో యుద్ధంలో మనం గెలిచినప్పుడు, మిగతావన్నీ పడిపోతున్నట్లే చమురు ధరలు కూడా వేగంగా పడిపోతాయి. మొదట గ్యాలన్ ధర మూడు డాలర్లకు, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుంది. ఇదంతా చాలా వేగంగా జరిగిపోతుంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో గ్యాసోలిన్ సగటు ధర గ్యాలన్‌కు సుమారు 4.15 డాలర్లుగా ఉంది. లేబర్ డే సమయంలో ఇది రికార్డు స్థాయి కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 97 డాలర్ల వద్ద, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 92 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్‌చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ కూడా ఘాటుగా స్పందించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ మాట్లాడుతూ.. తమ దేశ ఇంధన వనరులపై దాడి చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి వ్యవస్థలు బహిరంగంగానే ఉన్నాయని, అయితే అమెరికా ఆస్తులు కూడా అదే విధమైన బలహీనతను పంచుకుంటాయని ఆయన గుర్తుచేశారు. గతంలో ఇరాన్ ఆయిల్‌ట్యాంకర్ల విషయంలో అమెరికా చేసిన వ్యాఖ్యలను, దానికి తాము ఇచ్చిన సమాధానాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇదిలా ఉంటే ఇరాన్‌కు చెందిన నౌకలపై దాడులకు సంబంధించి అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారులు చర్చలు జరుపుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి.

## పదేళ్ల అభివృద్ధిపై వారికి ఎంతో కోపం

### వడోదరలో కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ సెటైర్లు



**వడోదరా, సెప్టెంబరు 8:** అభివృద్ధి కార్యక్రమాలపై తన ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తున్న వారిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అలాంటి వారిని నారాజ్ ఫూఫా అంటే కోపంగా ఉన్న మామయ్యలని అభివర్ణించారు. గుజరాత్‌లోని వడోదరాలో నిర్వహించిన నమో ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని రూ.35,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన గత 12 యేళ్లలో దేశంలో పని సంస్కృతి గణనీయంగా మారిందని మోడీ అన్నారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ అవసరమేంటని ప్రశ్నిస్తున్న వారిని ఉద్దేశిస్తూ ఒక నారాజ్ ఫూఫాజీ ట్రక్ డ్రైవర్లు ఏం చేస్తారని అడుగుతారు" అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు నారాజ్ ఫూఫాకు కూడా పని దొరికిందంటూ ఆయన ఎవరినీ పేరుపెట్టకుండా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు చేశారు. ఇదిలా ఉండగా, సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రధాని మోడీని ధురంధర్‌పాటతో కార్యక్రమంలోకి ప్రవేశించిన వీడియోను షేర్ చేస్తూ ఈ కార్యక్రమంపై విమర్శలు చేశారు. సత్య నికేతన్ పీజీ భవనం కూలిన ఘటనను ప్రస్తావిస్తూ విద్యార్థులు విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన సమయంలో గుజరాత్‌లో ఇంత భారీ కార్యక్రమం నిర్వహించడంపై సోషల్‌మీడియాలో ప్రశ్నలు లేవనెత్తారు. ప్రధాని మోడీ మాట్లాడుతూ గత కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంతో తమ ప్రభుత్వ మౌలిక వసతుల అభివృద్ధిని పోల్చారు. 21వ శతాబ్దానికి చారిత్రక విజయంగా అభివర్ణించిన 2,800 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు.

నవి ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్టును ఉత్తరప్రదేశ్‌లోని దాద్రీతో అనుసంధానించే వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లోని మూడు కీలక సెక్షన్లను ప్రధాని ప్రారంభించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశానికి డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు జీవనాడి వంటివి. ఆధునిక సరుకు రవాణా నెట్‌వర్క్ కారణంగా భారత్ పరివర్తన వేగవంతమవుతోంది" అని మోడీ అన్నారు. గతంలో ప్రయాణికుల రైళ్లు, సరుకు రవాణా రైళ్లు ఒకే ట్రాక్‌ను ఉపయోగించాల్సి వచ్చేదని, దీంతో ప్రయాణికుల రాకపోకలతో పాటు సరుకు రవాణా కూడా నెమ్మదించేదని చెప్పారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఈ సమస్యను పరిష్కరించిందన్నారు. 2014 తర్వాత మీ ఆశీర్వాదాలతో నేను ఢిల్లీకి చేరుకున్న వెంటనే ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేశాం. 2,800 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ల పనులు నేడు పూర్తయ్యాయని ప్రధాని తెలిపారు. ఈ రోజు తూర్పు, పశ్చిమ ఫ్రైట్ కారిడార్లు దేశ వాణిజ్యం, వ్యాపారానికి ప్రధాన వెన్నెముకగా మారుతున్నాయి" అని పేర్కొన్నారు. 2,800 కిలోమీటర్ల ఫ్రైట్ కారిడార్ పూర్తవడం గత 12 యేళ్లలో దేశ పని సంస్కృతి ఎలా మారిందో చూపిస్తోందని మోడీ అన్నారు.

## మోడీ సభలను పోలుస్తూ రాహుల్‌పై బిజెపి సెటైర్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీల ప్రజాదరణను పోలుస్తూ బిజెపి సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు సంధించింది. మోడీ వడోదర సభకు ప్రజలు స్వచ్ఛందంగా పోటెత్తారని, కానీ రాహుల్ పుణె సభకు మాత్రం డబ్బులిచ్చి జనాలను తరలించాల్సి వచ్చిందని బిజెపి నేత అమిత్ మాలవీయ ఆరోపించారు. ఒక నేతకు నిజమైన ప్రజాదరణ ఉందని, మరొకరికి జనాన్ని సమీకరించడానికి ప్రోత్సాహకాలు అవసరమని ఆయన సోషల్‌మీడియా పోస్ట్ చేశారు. మంగళవారం వడోదరలో జరగనున్న ప్రధాని మోడీ నమో ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమానికి ఆన్లైన్లో ఉచిత రిజిస్ట్రేషన్లు ప్రారంభించిన గంటలోనే సీట్లన్నీ నిండిపోయాయి. బుక్‌మైషో ప్లాట్ఫామ్ ద్వారా ఈ ప్రక్రియను నిర్వహించగా, మరో 42 వేల మందికి పైగా వెయిటింగ్ లిస్టులో ఉండిపోయారు. గత నెలలో పుణెలో రాహుల్ గాంధీ విద్యార్థుల కోసం నిర్వహించిన ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాలవీయ ఈ విమర్శలు చేశారు. ఆసభకు హాజరయ్యేందుకు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు రూ.25వేల నుంచి రూ.35వేల వరకు చెల్లించారని బిజెపి ఆరోపించింది. దీన్ని పైసే కీ గూంజ్ (డబ్బుల హోరు) అని కూడా విమర్శించింది. బిజెపి ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిం చింది. యువత నుంచి రాహుల్ సభకు వస్తున్న స్పందన చూసి బిజెపి భయపడుతోందని, అందుకే ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తోందని ఎదురుదాడి చేసింది.

## వచ్చే యేడాది మే, జూన్‌లలో బుల్లెట్ రైలు

### కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



**వదోదర, సెప్టెంబరు 8:** భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే యేడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన నమో ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్క్వీజ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే యేడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ రైలును ప్రారంభిస్తార్థు అని వైష్ణవ్ చెప్పారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్‌వాపి మార్గం ఈ యేడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.

## మైనర్లు గర్భం దాలిస్తే భర్తలపై పోక్సోకేసు పెడతాం

### పశ్చిమబెంగాల్ సిఎం సువేందు అధికారి

**కోల్‌కత్తా, సెప్టెంబరు 8:** బాల్య వివాహాలు, మైనర్ల ప్రసవాలపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. 18 ఏళ్ల నిండకుండానే భార్య గర్భం దాల్చితే, ఆమె భర్తపై కఠినమైన పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామని ముఖ్యమంత్రి సువేందు అధికారి సంచలన ప్రకటన చేశారు. ఇలాంటి ఘటనల్లో ప్రభుత్వమే సుమోటోగా కేసులు స్వీకరించి, నిందితులపై కఠినచర్యలు తీసుకుంటుందని స్పష్టంచేశారు. కోల్‌కతాలో మీడియాతో మాట్లాడిన సిఎం సువేందు అధికారి బాల్య వివాహాలు, 18 యేళ్లలోపు ప్రసవాల విషయంలో పశ్చిమ బెంగాల్ అపఖ్యాతి పాలైంది. దీనికి గత తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం. ఇకపై ఇలాంటివి ఉపేక్షించం. 18 యేళ్లు నిండకముందే గర్భం దాల్చిన బాలికల భర్తలపై పోక్సో చట్టం కింద కేసులు పెడతాం. దోషులకు గరిష్ఠంగా 20 యేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. వారికి అన్ని ప్రభుత్వ అవకాశాలు, సంక్షేమ పథకాలు కూడా నిలిపివేస్తాం అని తీవ్రంగా హెచ్చరించారు. మైనర్లకు వివాహం జరిపించిన పురోహితులు లేదా ఖాజీలను కూడా వదిలిపెట్టబోమని, వారి కుటుంబ సభ్యులపైనా చర్యలు ఉంటాయని సిఎం తెలిపారు.

## ట్రంప్ మూడోసారి కూడా ఎన్నికవుతారు!

### ఇరాన్‌పై యేళ్లతరబడి అమెరికా యుద్ధం!: చైనా నోస్ట్రడామస్ జోస్యాలు



**బీజింగ్, సెప్టెంబరు 8:** చైనా నోస్ట్రడామస్‌గా పేరుపొందిన చైనాకెనడాకు చెందిన విద్యావేత్త ప్రొఫెసర్ జియాంగ్ జ్యూకిన్ 2027లో అమెరికా ఎదుర్కొనే పరిణామాలపై చేసిన అంచనాలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. జియాంగ్ అంచనాల ప్రకారం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మరింత ముదిరే అవకాశం ఉంది. వైమానిక దాడులతో సమస్య పరిష్కారం కాకపోతే అమెరికా నేరుగా భారీ స్థాయిలో భూతల యుద్ధంలోకి దిగే పరిస్థితి రావచ్చని ఆయన భావిస్తున్నారు. ఈ యుద్ధం యేళ్ల తరబడి కొనసాగుతుందని చెబుతున్నారు. యుద్ధం సుదీర్ఘంగా సాగితే అమెరికా సైన్యంలో సిబ్బంది కొరత ఏర్పడొచ్చని జియాంగ్ అంచనా. దీంతో తప్పనిసరి సైనిక సేవకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థను 2027 నాటికి సిద్ధం చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. యువతను సైన్యంలోకి తీసుకునే పరిస్థితి రావచ్చని అన్నారు. అమెరికాలో అంతర్గత పరిస్థితులు కూడా ఉద్రిక్తంగా మారొచ్చని ఆయన అంచనా వేశారు. ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థ ఐసిఇ అధికారాలు మరింత పెరగవచ్చని అన్నారు. ప్రధాన నగరాల్లో నేషనల్ గార్డ్ మోహరింపులు తరచుగా కనిపించే అవకాశం ఉందని పేర్కొన్నారు. హార్మూజ్ జలసంధిలో రవాణాకు అంతరాయం ఏర్పడితే దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుందని జియాంగ్ చెబుతున్నారు. చమురు, గ్యాస్, ఎరువుల ధరలు భారీగా పెరగొచ్చని అంచనా వేశారు. సరఫరా వ్యవస్థలు దెబ్బతింటే ఆహార కొరత, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, తప్పనిసరి సైనిక సేవపై వ్యతిరేకత, వీధుల్లో భద్రతా బలగాల మోహరింపులు కలిసి అమెరికాలో తీవ్ర అశాంతికి దారితీయొచ్చని జియాంగ్ అభిప్రాయపడ్డారు. 2027లో అంతర్యుద్ధానికి దారితీసే పరిస్థితులు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. జియాంగ్ మరో సంచలన అంచనా కూడా వెలువరించారు. డొనాల్డ్ ట్రంప్ మూడోసారి అమెరికా అధ్యక్షుడయ్యే అవకాశం ఉందని అన్నారు.

ప్రస్తుత అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండు పర్యాయాలకు మించి అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి వీల్లేదు. అయినప్పటికీ ట్రంప్ మూడోసారి అధికారంలోకి రావచ్చని జియాంగ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో అంతర్యుద్ధం జరిగితే దేశం చిన్న చిన్న ప్రాంతాలుగా విడిపోయే పరిస్థితి రావచ్చని ఆయన మరోసారి వ్యాఖ్యానించారు. దీన్నే బాల్కనైజేషన్‌గా పేర్కొన్నారు. దాదాపు 20 యేళ్ల తర్వాత అమెరికా క్రిస్టియన్ ఎఐ థియోక్రసీగా మారుతుందని కూడా ఆయన అంచనా వేశారు. ఆస్టిన్ భవిష్యత్తులో అమెరికాకు కొత్త కేంద్రంగా మారొచ్చని న్యూయార్క్, లాస్ ఏంజెల్స్ ప్రాధాన్యం తగ్గొచ్చని అన్నారు.

## బ్రిక్స్ సదస్సుకు ముందు ప్రధాని మోడీ, పుతిన్‌ల ద్వైపాక్షిక భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** ప్రధాని నరేంద్ర మోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు రష్యా ధ్రువీకరించింది. ఈ సమావేశంలో ప్రపంచ ఇంధన సరఫరా, వాణిజ్యం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. రష్యా ప్రెస్ సెక్రటరీ దిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ ప్రధాని మోడీ, అధ్యక్షుడు పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారని వెల్లడించారు. పర్షియన్ గల్ఫ్‌లో నెలకొన్న పరిస్థితులు, ప్రపంచ ఇంధన సరఫరా, ఇరాన్ చుట్టూ కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు చర్చల్లో ప్రస్తావనకు రానున్నాయని తెలిపారు. అదేవిధంగా ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక సంబంధాలపైనా చర్చలు జరుగుతాయని పెస్కోవ్ చెప్పారు. అయితే ఈ అంశాలను బహిరంగంగా చర్చించే అవకాశం లేదని, కొన్ని స్నేహపూర్వకంగా లేని దేశాల కారణంగా వాణిజ్య, ఆర్థిక అంశాలపై చర్చలు గోప్యంగా జరిగే అవకాశముందని పేర్కొన్నారు. భారత్ మార్కెట్‌పై రష్యా కంపెనీల ఆసక్తిరష్యా కంపెనీలు భారత మార్కెట్‌పై ఆసక్తి చూపుతున్నాయని పెస్కోవ్ తెలిపారు.

అదే సమయంలో రష్యాలో భారత కంపెనీలు పెట్టుబడులు, వ్యాపార అవకాశాలపై చూపుతున్న ఆసక్తి కూడా ఇరు దేశాల వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు మంచి అవకాశమని చెప్పారు. ఈ అంశాన్ని ప్రధాని మోడీతో చర్చించేందుకు అధ్యక్షుడు పుతిన్‌కు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, త్వరలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం వాణిజ్యం, పెట్టుబడులు, సరఫరా గొలుసుల సహకారానికి కొత్త అవకాశాలను తెరవనుందని భావిస్తున్నారు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధ, తయారీ, స్వచ్ఛ ఇంధనం, ఫిన్‌టెక్ వంటి రంగాలు దీనివల్ల ప్రయోజనం పొందే అవకాశం ఉంది. సభ్య దేశాల మధ్య మరింత ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం, సరఫరా గొలుసుల స్థిరత్వానికి మార్గాలను రూపొందించడం, డిజిటల్ సాధికారతను ప్రోత్సహించడం వంటి అంశాలకు న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సు ద్వారా భారత్ ప్రాధాన్యత ఏర్పడుతోంది.

# సంక్షిప్త వార్తలు

## పోక్సోకేసులో ఒకరికి మరణశిక్ష, మరో ఇద్దరికి కఠినజైలు

**తిరునల్వేలి, సెప్టెంబరు 8:** మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికపై పెయింటర్ మునీశ్వరన్ (25) తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు.

## రాజస్థాన్‌లో 44 మంది బిజెపి అభ్యర్థులు ఏకగ్రీవం

**జైపూర్, సెప్టెంబరు 8:** రాజస్థాన్‌లో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ దశలో ఎన్నికలు జరగాల్సిన మొత్తం 77 స్థానాల్లో బిజెపికి చెందిన 44 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నుంచి 16 మంది, స్వతంత్రులు 17 మంది ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన 77 మందిలో 37 మంది మహిళలు ఉన్నారు. వీరిలో నలుగురు అత్యంత పిన్న వయస్కులైన అభ్యర్థులు కూడా ఉన్నారు.

## అగ్నిపర్వతం పేలుడుతో 2300 విమాన సర్వీసులు రద్దు



**జకార్తా, సెప్టెంబరు 8:** ఇండోనేషియాలోని సుప్రసిద్ధ అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలవడం తెలిసిందే. సుమారు 25 గంటల పాటు నిరంతరాయంగా లావా, బూడిద వెదజల్లడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విస్ఫోటనం కారణంగా ఆకాశమంతా దట్టమైన బూడిద మేఘాలు అలుముకోవడంతో రవాణా వ్యవస్థ, ముఖ్యంగా విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ అగ్నిపర్వతం 24 గంటల పాటు ఏకధాటిగా లావాను వెలిగక్కింది.

## రాయ్‌బరేలి పర్యటనకు రాహుల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ పార్లమెంటరీ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరును రాహుల్ సమీక్షించనున్నారు.

## కేరళ మాజీ సిఎంపై కేసు నమోదుచేయాలని ఇడి లేఖ



**తిరువనంతపురం, సెప్టెంబరు 8:** కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కేసుతో ముడిపడి ఉన్న లంచాల వ్యవహారం కేరళ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. నిధుల అక్రమ మళ్లింపు వ్యవహారంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె టి. వీణ, అల్లుడు పి.ఎ. మహమ్మద్ రియాస్‌లతో పాటు పలువురిపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాష్ట్ర డిజిపికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారికంగా లేఖ రాసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 66 నిబంధనల ప్రకారం తమ వద్ద ఉన్న పక్కా ఆధారాల ప్రాతిపదికన ఈ సమాచారాన్ని కేరళ పోలీసులకు బదిలీ చేసినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి.

# తిరుమల సమాచారం



## గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం

**తిరుమల, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ట్రస్ట్‌లలో గోసంరక్షణ ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. మంగళ వారం ఉదయం టిటిడి బోర్డు సభ్యుడు దర్శన్ సతీమణి యశోద దర్శన్ వేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టుకు రూ.10లక్షలు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ చిరు మామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ డాక్టర్ శరత్ పాల్గొన్నారు.



## శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికా రులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగం ధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేశారు. ఉదయం 6గంటల నుండి 11గంటల వరకు సాగిన ఈ మహాయజ్ఞంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి జెఇఒ డాక్టర్ శరత్;, సివిఎస్ఒ మురళీకృష్ణ, ఆలయ ఇన్‌ఛార్జి డిప్యూటీ ఇఒ భాస్కర్, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, పేష్కార్ రామకృష్ణ,విఎస్ఒసురేంద్ర,ఉద్యోగులు పాల్గొని ఆలయంలోపల బం గారు వాకిలినుండి ఉపఆలయాలు, మహద్వారం వరకు నీటితో శుభ్రంగా కడిగారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డక ర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కల గలిపిన పరిత్రపరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేశారు. మధ్యా హ్నం12 గంటలకు సర్వదర్శనంభక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ సంద ర్భంగా ఆలయంలో జరగాల్సిన అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది.



## భక్తుడు వదలి వెళ్లిన బంగారు ఆభరణాలు అప్పగింత

**తిరుమల, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకునే ముందు అలిపిరి తనిఖీ కేంద్రంలో భక్తుల లగేజీలు తనిఖీ చేయడం పరిపాటి. ఇదే సమయంలో మంగళవారం ఉదయం తిరుమలకు వస్తున్న తమిళనాడు భక్తుడు పి.కార్తికేయన్ తనిఖీ కేంద్రం వద్ద తన బ్యాగ్‌ను స్కా నింగ్‌లో పెట్టి పొరపాటున తీసుకోవడం మరిచిపోయాడు. తిరుమలకు చేరు కున్నాడు. ఈ విషయాన్ని గమనించిన భద్రత సిబ్బంది ఆ సంచిని గుర్తించి, అందులో లభించిన వివరాల మేరకు భక్తుడిని సంప్రదించారు. అలిపిరి చెక్‌పా యింట్ వద్దకు రావాలని సమాచారం అందించారు. భక్తుడు ఆ సంచిలోని వస్తువులను గుర్తించి ధృవీకరించిన అనంతరం భద్రంగా ఆయనకు అప్పగిం చారు. ఆ సంచిలో రూ.10,900లు నగదుతో బాటు రెండు గాజులు, ఒక బంగారు గొలుసు, రెండు బంగారు ఉంగరాలు ఉన్నాయి. వీటి మొత్తం విలువ సుమారు ఐదు లక్షలు రూపాయలు ఉంటుందని టిటిడి సెక్టార్ 5 అలిపిరి ఎవిఎస్ఒ రమేష్ కృష్ణ తెలిపారు. టిటిడి విజిలెన్స్ అధికారులు, సిబ్బంది చూపిన అప్రమత్తత, నిజాయితీతో విలువైన వస్తువులను సురక్షితంగా తిరిగి అందజేయడంపై భక్తుడు కృతజ్ఞతలు తెలిపారు.



## శ్రీవారి భక్తులకు సరికొత్త అనుభూతి

### ప్రారంభానికి సిద్ధమైన వరల్డ్ క్లాస్ ఎస్వీ మ్యూజియం

**తిరుమల, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో భక్తులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఎస్వీ మ్యూజియం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ మ్యూజియాన్ని ప్రారంభించేందుకు టిటిడి ఏర్పాట్లు వేగవంతం చేసింది. ఇంకా కొన్నిపనులు గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు టిటిడి అదనపు ఇఒ చిరుమా మిళ్ళ వెంకయ్యాచౌదరి ఆదేశాలిచ్చారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మెరుగైన మొబైల్ సిగ్నల్ వ్యవస్థపై సమీక్షించారు. గరుడసేవరోజున నెట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకున్న ఎస్వీ మ్యూజియం పనులను అదనపు ఇఒ వెంకయ్య చౌదరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. మ్యూజి యంలోని అన్ని విభాగాల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రారం భోత్సవానికి సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. మ్యూజియం నిర్వ హణకు సంబంధించి టిసిఎస్ బృందానికి కూడా అవసరమైన సూచనలు అం దించాలని, అన్నివిభాగాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని వెంకయ్యచౌదరి దిశానిర్దేశం చేశారు. భక్తుల రద్దీకి అను గుణంగా నెట్‌వర్క్‌సామర్థ్యాన్ని పెంచి,ఎలాంటిఅంతరాయం లేకుండా కమ్యూ నికేషన్ సేవలు అందేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## సైబర్ వలలో టిటిడి పోటు కాంట్రాక్ట్ ఉద్యోగి రూ.2లక్షలు నగదు కాజేత



**తిరుమల, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో టిటిడి పోటువిభాగంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి సైబర్‌నేరస్థుల వలలో పడ్డాడు. తిరుపతిలోని ఉపాధ్యాయ నగర్‌లో శ్రీనివాసన్ నివాసముంటున్నాడు. ఈ యన తిరుమలలోని పోటులో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ప్రధా నమంత్రి ముద్ర యోజన పథకం కింద రూ.5లక్షల లోన్ ఇస్తామంటూ టిటిడి ఉద్యోగికి సైబర్‌నేరస్తుడు మాయమాటలు చెప్పాడు. మాటలతో నకిలీ గుర్తింపు కార్డు లు చూపించి నమ్మించాడు. ఆ తరువాత పలుమార్లు యూపిఐ అకౌంట్ ద్వా రా సైబర్ నేరస్థుడు నగదు కాజేశాడు. బ్యాంక్ ఖాతానుండి డబ్బులు లావా దేవీలు జరిగినట్లు ఆలస్యంగా గుర్తించాడు. దీంతో మోస పోయానని తెలుసు కున్న బాధితుడు శ్రీనివాసన్ తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఆధారాలతో ఫిర్యాదు చేశాడు. మొత్తం ఉద్యోగి నుండి రూ. 2,256,70లు కాజేశాడు.

# సామాన్యభక్తుల దర్శనాలకే ప్రాధాన్యం

### అన్ని రకాల ప్రత్యేక దర్శనాలు, విఐపి బ్రేక్ రద్దు

### బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన విస్తృత ఏర్పాట్లు



**తిరుమల, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీనివాసునికి తొమ్మిదిరోజులు భక్తిశ్రద్ధలతో వైఖానస ఆగమో క్తంగా నిర్వహించే సాలకట్ల బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. తొలిఘట్టంగా ఈనెల 14వ తేదీ సోమవారం రాత్రి అంకురార్పణతో శ్రీకారం చుట్ట నున్నారు. 15వ తేదీ మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో ఉత్సవాలు మొదలవుతాయి. తొలిరోజు రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహన సేవతో శ్రీవారి వాహనసేవలకు శ్రీకారం చుడతారు. ఈ ఏడాది అధికమాసం రావడంతో ఈనెల 15వ తేదీ నుండి 23వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్స వాలు, అక్టోబర్ 12నుండి 20వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగను న్నాయి. సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తుల దర్శనాలకే అధిక ప్రాధాన్యత నివ్వనున్నట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు విఐపి బ్రేక్ దర్శనాలు, వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రు లకు ప్రత్యేక దర్శనాలుతోబాటు రూ.300లు ఆన్‌లైన్ దర్శనాలు, ఆర్జితసేవలు కూడా రద్దుచేశారు. భక్తుల సౌలభ్యం కోసం ఉదయం వాహన సేవలను 8గంటలకే ప్రారంభించి 10గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగిస్తారు. రాత్రి వాహనసేవలు 7గంటలకే మొదలవుతాయి. రెండు బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు, భక్తుల రద్దీ, భద్రత, వాహనాల పార్కింగ్, భక్తులకు దర్శనం తదితర అంశాలపై తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, జెఇఒలు డాక్టర్ ఎ.శరత్, ప్రభల గోపీనాథ్, సివిఎస్ఒ మురళీకృష్ణలతో కలసి మంగళవారం సాయంత్రం తిరుపతి అలిపిరిలో అదనపు ఇఒ వెంకయ్యచౌదరి పార్కింగ్ స్థలా లను పరిశీలించారు. భగవంతుని వాహనసేవలు మాఢవీధుల్లో జరగనున్నందున పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉంది. బ్రహ్మోత్స వాల్లో పూర్తిగా సర్వదర్శనం మాత్రమే అమలు చేస్తారు. భక్తుల రద్దీకి తగ్గట్లు 10లక్షలు లడ్డూలు బఫర్ స్టాక్ ఉంచుతున్నారు. భద్రత పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వాహనాల పార్కింగ్‌కు అసౌకర్యం కలగకుండా పోలీసులతో సమన్వయంతో ఏర్పాట్లుచేప డుతున్నారు. అలిపిరి వద్ద ద్విచక్రవాహనాలు, నాలుగుచక్రాల వాహనాలు పార్కింగ్ చేసేలా పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు భక్తులను ఆకట్టుకునేలా శ్రీవారి ఆలయం, తిరుమలలోని పలు ముఖ్యకూడళ్లను సర్వాంగసుందరంగా విద్యుత్ దీపాల కటౌట్లతో, పుష్పాల కటౌట్లతో అలంకరణ చేస్తున్నారు.

**15న సిఎం పట్టువస్త్రాలు:** ఇష్టదైవమ్ తిరుమలేశునికి సెప్టెంబర్ 15వతేదీ నుండి జరిగే సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు రానున్న మంగళ వారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిం చనున్నారు. అదేరోజు సాయంత్రం ధ్వజారో హణం, రాత్రి 9గంటలకు పెద్దశేషవాహనసేవ జరుగుతాయి. బ్రహ్మోత్సవాల్లో అశేషసంఖ్యలో విచ్చేసే భక్తులకు సేవలందించేందుకు దాదాపు నాలుగువేలమంది శ్రీవారి సేవకులు, ఆరువేల మంది పారిశుధ్యసిబ్బంది అదనంగా ఏర్పాటు చేశారు. ఆలయ మాఢవీధుల్లో ఉండే భక్తులకు గ్యాలరీలు, తాగునీరు, అన్నప్రసాదాలు, మజ్జిగ, వైద్యసేవలు అన్నీ అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

14వ తేదీ సోమ వారం సాయంత్రం శ్రీవారి సేనాధిపతి శ్రీవి శ్వక్సేనులు ఆలయానికి నైరుతుమూలలో వున్న వసంతమండపానికి ఛత్రఛామర మంగళవాయి ద్యాలతో వెళతారు. అక్కడ పుణ్యాహవచనం, భూమిపూజ తదితరాలు నిర్వహించి పుట్టమ న్నున్న సేకరించి మృత్సంగ్రహణం చేస్తారు. ప్రదక్షిణగా ఆలయంలోనికి చేరుకుంటారు. నవధాన్యాలతో అంకురార్పణం జరుగుతుంది.

## ఆలయ గోపురంపై శ్రీకృష్ణుడి విగ్రహానికి మరమ్మతులు

**తిరుమల, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కొన్ని శతాబ్దాల క్రిందట కలియుగవైకుంఠం తిరు మలలో ప్రధాన ఆలయం నిర్మాణం సమయంలో మహారాజగోపురం నిర్మించారు. బంగారు నిలయంలోనికి చేరుకునే ముందు మహద్వారం గోపురం నుండే ఏడుకొండల స్వామిని గోవింద నామస్మరణతో భక్తులు మొక్కుతారు. తిరు మల కొండపై సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరం భం కానున్న సమయంలో ఆలయం పైభాగం, లోపల, మహద్వార గోపురాలకు మరమ్మతులు చేయడం, రంగులు వేయడం, విద్యుద్దీపాలంక రణలు వంటి పనులు చేస్తున్నారు. ఈ పనులు చేస్తున్న సమయంలో ఆలయ మహాగోపురంపై ఉన్న విగ్రహాల్లో శ్రీకృష్ణుడి విగ్రహం చేయివిరి గినట్లు గుర్తించారు. దీనిపై టిటిడి అధికారులు స్పందించారు. తిరుమల శ్రీవారి ఆలయ గోపురంపై ఉన్న శ్రీకృష్ణుడి విగ్రహం దెబ్బతిన్న విషయాన్ని టిటిడి సిబ్బంది ముందుగానే గుర్తించడం జరిగింది. ఈ ఘటనలో ఎలాంటి నిరక్ష్యం చోటుచేసుకోలేదని టిటిడి వివరణ ఇవ్వడం జరిగింది. శ్రీవారి ఆలయ మహా గోపురంపై వందలాది విగ్రహాలు ఉన్న విషయం తెలిసిందే. దీర్ఘకాలంగా ఎండ, వర్షాలకు గురికావడంతో కొన్ని విగ్రహాలకు మరమ్మతులు అవసరం అయ్యే అవకాశం ఉంటుంది. ప్రతి ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరిం చుకుని ఆలయ గోపురానికి రంగులు వేయడం, మరమ్మతుల పనులు చేపడుతున్న సమయంలో విగ్రహాల పరిస్థితిని పరిశీలించి, అవసరాన్ని బట్టి విగ్రహాలకు మరమ్మతులు చేయడంగానీ వాటి స్థానంలో కొత్త విగ్రహాలను ఏర్పాటు చేయడం టిటిడి చేపడుతుంది.

ఇదే క్రమంలో గోపురానికి పెయింటింగ్, మరమ్మ తుల పనులు చేపడుతున్న సమయంలో శ్రీకృ ష్ణుడి విగ్రహానికి మరమ్మతులు అవసరమైన విషయాన్ని గుర్తించి చర్యలు చేపట్టారు.



ఈ ఘటనపై వాస్తవాలను తెలుసుకోకుండా దురుద్దేశపూర్వకంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం సరికాదని టిటిడి స్పష్టం చేసింది.

# పంచలోహ విగ్రహాల ముఠా అరెస్ట్

### రూ.22.70 లక్షల సొత్తు స్వాధీనం,13 మంది నిందితుల అరెస్టు: ఎస్పీ హార్షవర్ధన్ రాజు



**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త:** మార్కాపురం జిల్లా పరిధిలోని సి.ఎస్.పురం, పామూరు, కనిగిరి, కొనకనమిట్ల మండలాల్లో దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠాకు పోలీసులు చెక్ పెట్టారు. మొత్తం 13 మంది నిందితులను మంగళవారం పామూరు మండలం రావిగుంటపల్లి గ్రామ శివారులో అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.22.70 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంతో పాటు, నేరాలకు ఉప యోగించిన ఒక టూఫాన్ వాహనం, ఒక ఎర్టిగా కారు, రెండు మోటార్ సైకిళ్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేవాలయాల్లో ఇటీవల వరుసగా జరుగుతున్న చోరీలను సీరియస్‌గా తీసుకున్న మార్కాపురం జిల్లా ఎస్పీ వి.హార్షవ ర్ధన్ రాజు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు.పోలీసుల వివరాల ప్రకారం సి.ఎస్.పురం శివాలయంలో సుమారు రూ.12లక్షల విలువైన రెండు పార్వతీ పరమే శ్వరుల పంచలోహ విగ్రహాలు, ఒక ఇత్తడి అయ్య ప్ప విగ్రహం చోరీకి గురయ్యాయి. అలాగే కనిగిరి మండలం చీరలదిన్నె గ్రామంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సుమారు రూ.10 లక్షల విలువైన 4.5 కిలోల వెండి ఆవరణాలు, వెండి నాగాభరణం చోరీ చేశారు. కొనకనమిట్ల మండలం గొట్లగట్టు రామాలయంలో సుమారు రూ.25 వేల విలువైన 25 కిలోల ఇత్తడి హనుమంత వాహనాన్ని, పామూరు మండలం వగ్గంపల్లి గ్రామంలోని పోలేరమ్మ తల్లి ఆలయంలో సుమారు రూ.50 వేల విలువైన ఇత్తడి కిరీటం, రెండు చేతుల కవచాలను అపహరించారు. దొం గిలించిన సొత్తులో భాగంగా వెండి ఆవరణాలను కరిగించి నాలుగు వెండి గిన్నెలుగా తయారు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇత్తడి హను మంత వాహనాన్ని విక్రయించగా వచ్చిన రూ.20 వేల నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితుల్లో ఇండ్ల విష్ణువర్ధన్, తమ్మిశెట్టి రమణయ్య, మల్లాల చెంచు సుబ్బారావు, సోమరాజుపల్లి ఉమామహేశ్వ రరావు, కొమ్మి కాటం రాజు, బత్తుల శ్రీను, పిన్నీ రాజీవ్, కమ్మ సూర్యతేజ, మోకా ఆంజనేయులు, దేరంగుల వెంకట రమణ, బండారు తిరుపతయ్య, దూదేకుల నాగూర్ షరీఫ్, చందాలూరి బాల గురవయ్య ఉన్నారు. కనిగిరి డీఎస్పీ పి.శ్రీధర్ ఆధ్వర్యంలో పామూరు సీఐ డి.వినోద్ కుమార్, కనిగిరి సీఐ యు.శ్రీని వాసరావుతో పాటు సి.ఎస్.పురం, వెలిగండ్ల, పామూరు, కొన కనమిట్ల, పి.సి.పల్లి పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తుమొత్తం విలువ సుమారు రూ.22.70 లక్షలుగా పోలీసులు తెలిపారు. దేవా లయ చోరీల కేసులను సమర్థ వంతంగా ఛేదించిన కనిగిరి డీఎస్పీ పి.శ్రీధర్ బాబు, పామూరు సీఐ డి.వినోద్ కుమార్, కనిగిరి సీఐ యు.శ్రీనివాస రావు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, సీసీఎస్, ఐటీకోర్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## నాణ్యమైన ఆహారం అందించకపోతే చర్యలు

### ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాపరెడ్డి



**కొండపి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** అంగన్‌వాడి కేంద్రాలు.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందించక పోతే కఠినమైన చర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాపరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రమైన కొండపిల్లోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో పేద విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం అంగన్వాడీలో విద్యార్థులకు అందించే పౌష్టికాహారం రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందించే పిడిఎఫ్ బియ్యం పంపిణీల్లోనూ అవకతవకలు జరిగితే ఆయా సంఘటనలను సుమోటోగా తీసుకొని 6 కేసులు పెట్టడం జరుగు తుందని ఆయన హెచ్చరించారు. విద్యార్థులకు అందించే చికెన్ స్వయంగా పరిశీలించి వార్డెనకు సూచన అందించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి కోరిక మేరకు ఉప్మాకు బదులు మరో మెనూ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

## కానిస్టేబుల్ అభ్యర్థులు ప్రలోభాలకు గురికావద్దు: హోంమంత్రి అనిత



**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు ఎవరూ ప్రలో భాలకు లోనై ఆందోళనలకు దిగొద్దని హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. శాంతి భద్రతలను పరిరకించే బాధ్యతాయుతమైన పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వ్యవహరిం చాలని, ఆందోళనలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఈ మేరకు అనిత ఒక ప్రకటన విడుదల చేసారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలో పోలీసు ఉద్యోగాలు లభించాయో అభ్యర్థులు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి యేటా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల భర్తీకి కట్టుబడి ఉందని, అందులో భాగంగా సుమారు 11 వేల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. 2014-19 మధ్య శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన కూటమి ప్రభుత్వం 9,793 పోలీసు పోస్టులను భర్తీ చేసిందని అనిత గుర్తుచేశారు. అయితే గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఒక్క కానిస్టేబుల్ పోస్టు కూడా భర్తీ చేయకుండా నోటిఫికేషన్ ఇచ్చి సుమారు 6 వేల పోస్టులను గాలికొదిలేశారని విమర్శించారు.

## మెగా డిఎస్సీపై వైసిపి చేస్తున్నవన్నీ తప్పుడు ప్రచారాలే

### టిడిపి ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, గౌతు శిరీష, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీపై వైసిపి చేస్తున్నవన్నీ తప్పుడు ప్రచారాలేనని టిడిపి మహిళా ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, గౌతు శిరీష, వేమిరెడ్డి ప్రశాం తిరెడ్డి విమర్శించారు. టిడిపి ప్రధాన కార్యాల యం ప్రాంగణంలో వారు మీడియా సమక్షంలో డిఎస్సీపై జరుగుతున్న ప్రచారం గందరగోళం సృ ష్టించడానికని ఆరోపించారు. ఎమ్మెల్యే వేమి రెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో ఒక్క డిఎస్సీ కూడా ఇవ్వలేదని, ఇప్పుడు మెగా డిఎస్సీపై మాట్లాడే అర్హత ఆ పార్టీ నేతలకు లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 148 రోజుల్లోనే మెగా డిఎస్సీ పూర్తి చేసి 16 వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. 150 రోజుల్లో 16 వేల డిఎస్సీ ఉద్యోగాలు ఇచ్చిన మంత్రి లోకేశ్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గత ఐదేళ్లలో ఒక్క డిఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వని వైసిపినేతలు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదంగాఉందని ఎమ్మెల్యే సౌమ్య విమర్శించారు.



## భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

### భద్రత, పార్కింగ్‌పై ప్రత్యేక చర్యలు

**తిరుమల, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టిటిడితోసమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తు న్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ తెలిపారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు ముఖ్యమంత్రి తిరుమ లలో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. భక్తుల వాహన రద్దీని నియంత్రించేందుకు తిరుపతిలో అలిపిరి చెక్‌పాయింట్, జూ పార్క్ సమీపంలోని టీటీడీ స్థలాలు, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ తదితర ప్రాంతాల్లో పార్కింగ్, హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తిరుమల రద్దీని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షిస్తూ, అవసరమైన సమయంలో భక్తులను హోల్డింగ్ పాయిం ట్లలో నిలిపి, అక్కడ ఏర్పాటు చేసే ఎల్ఇడి స్క్రీన్ల ద్వారా వాహన సేవలను ప్రత్యక్ష ప్రసారం చేయడం జరిగిందన్నారు.

మంగళవారం సాయంత్రం తిరుపతి అలిపిరి సమీపంలోని భూ దేవి కాంప్లెక్స్ వద్ద శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, నవరాత్రి బ్రహ్మోత్స వాల నిర్వహణ ఏర్పాట్ల పై తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, టిటిడి సివిఎస్ఒ కె.వి.మురళికృష్ణ, తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎం.జయకృష్ణ తో కలసి జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఈ యేడాది తిరుమల శ్రీవారి సాలకట్ల నవరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై టిటిడి ఇఒ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తి చేసినట్లు తెలిపారు. ఐదవ రోజు 19న జరిగే గరుడ సేవకు సుమారు 3.5-4 లక్షల మంది భక్తులు, 12,000-13,000 వాహనాలు వచ్చే అవకాశం ఉన్నందున తిరుమల, తిరుపతిలో తగిన పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. గరుడ సేవ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో సమన్వయంగా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు అధికా రులకు పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. తిరుమలలో పరిమితంగా ఉన్న పార్కింగ్ సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో విస్తృత పార్కింగ్ స్థలాలను సిద్ధం చేస్తున్నామన్నారు. తిరుపతిలో వాహనాలు నిలిపే భక్తులను తిరుమలకు తరలించేందుకు ఆర్టీసీతో సమన్వ యంతో ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులందరికీ సులభ దర్శనం కల్పించడమే లక్ష్యంగా టిటిడితో సమన్వయంతో అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌స్పష్టం చేశారు.

## మీ సేవలు మరింతమందికి స్ఫూర్తి



**తిరుపతి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి ఏగ్రేడ్ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో ఉత్తమ బోధనకు పలువురు ఆచార్యులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న విషయం విదితమే. వీరి సేవలు విశ్వవిద్యాలయంలో మరింతమందికి స్ఫూర్తిదాయకమని ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ఆర్.ఉష కొనియాడారు. విజయవాడ మంగళగిరిలో విద్యా రంగంలో ఉత్తమ సేవలకు ఎంపిక చేసిన పలువురు ఆచార్యులు సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం లోని హోమ్ సైన్స్ విభాగం ఆచార్యురాలు నల్లగాల రజని, సోషల్ వర్క్ విభాగం ఆచార్యులు ఇవి లలితకుమారి, మైక్రోబయాలజీ విభాగం ఆచా ర్యులు చిట్టూరి చండి కుమారి, ఇంగ్లీష్ లాంగ్వేజ్ లిటరేచర్ విభాగం ఆచార్యులు వి. నిర్మల అవార్డులు అందుకున్నారు. వీరి సేవలను, ఉత్తమ బోధన కొనియాడుతూ మహిళా వర్శిటీలో అభినందనలు తెలిపారు.

## పోలీసు విచారణకు హాజరైన యూట్యూబర్ నందన



**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** వీసాలు, విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసిందన్న ఆరోపణల కేసు లో ప్రముఖ యూట్యూబర్ రమానందన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు విచారణకు హాజరైంది. ఆమెపై ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో తన న్యాయవాదులతో కలిసి పోలీసుల ఎదుట విచారణకు హాజ రైంది. విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రమానందన దంపతులు తన వద్ద నుంచి రూ.13 లక్షలు వసూలు చేసి మోసం చేశారని బాధితుడు క్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. యుకె నుంచి హైదరాబాద్ చేరుకున్న వెంటనే విచారణకు హాజరుకావాలని పోలీ సులు నోటీసులు జారీ చేయడంతో ఆమె పిఎస్‌కు వచ్చింది. రమానందనపై ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కూడా మరో వీసా స్కామ్ కేసు నమోదు కావడం సంచలనం సృష్టిస్తోంది. 'డెస్టినీ కన్సల్టెన్సీ' పేరిట వీసా రెన్యువల్, సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించి 2023లో తమ వద్ద భారీగా డబ్బులు వసూలు చేసి మోసం చేశారని బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

## యూట్యూబర్ జోసెఫ్ రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** పవన్ కల్యాణ్‌పై ఆరోపణల నేపథ్యంలో నిందితునిగా ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న యూట్యూబర్ జోసెఫ్ జ్యుడీషియల్ రిమాండ్ పొడిగించారు. అతని రిమాండ్ నేటితో ముగియనుండగా గన్నవరం కోర్టుకు పోలీసులు హాజరు పరిచారు. న్యాయస్థానం జోసెఫ్ రిమాండ్‌ను ఈ నెల 22వరకు పొడిగించింది.

## పలువురు ఐఎఫ్ఎస్ అధికారుల బదలీ

**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పలువురు ఐఎఫ్ఎస్ అధికారులను ప్రభుత్వం బదలీ చేసింది. అదనపు పిసిసిఎఫ్ వైల్డ్ లైఫ్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌గా రాహుల్ పాండే, ఎపి ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా కొండలరావు, హెచ్ఆర్‌డి కోస్టల్ జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారిగా నాగేశ్వరరావు, జూ పార్క్స్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారిగా బి.ఎన్.ఎన్.మూర్తి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## డ్రైవర్ సుబ్రహ్మణ్యం కేసులో రోజువారీ విచారణ

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అనంతబాబు ప్రధాన నిందితుడిగా ఉన్న ఈ కేసు విచారణను రోజువారీగా చేపట్టాలని రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టును ఆదేశించింది. సుప్రీంకోర్టు విధించిన గడువు ముగిసినా జాప్యం జరుగుతుండటంతో న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 11వ తేదీ నుంచి రోజూ విచారణ జరిపి సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయాలని స్పష్టం చేసింది. తన డ్రైవరును అనంతబాబు చంపి, ఆ శవాన్ని తానే కారులో తీసుకుని హతుని ఇంటి దగ్గర పడేసినట్లు అభియోగం,ఈ కేసులో అనంతబాబు భార్యకూడా నిందితురాలిగా ఉంది.అనంతబాబు రిమాండ్‌లో ఉన్నారు.

## ఉపాధ్యాయుల జీవితాలతో ఆడుకొంటున్న జగన్ రెడ్డి అండ్ బ్యాచ్: శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

**మంగళగిరి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 16 వేల మందికిపైగా నిరుద్యోగులు కష్టపడి చదివి, పారదర్శకంగా నిర్వహించిన డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైతే, వారి జీవితాలతో జగన్ మోహన్ రెడ్డి అండ్ బ్యాచ్ కాళకేయుల్లా ఆడుకుంటోందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తీవ్రంగా మండిపడ్డారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో రవి నాయుడు మాట్లాడుతూ 2019ఎన్నికలకు ముందు ఊరూరా తిరిగి, డిఎస్సీ వేసి టీచర్ పోస్టులు భర్తీ చేస్తాను అని నిరుద్యోగులకు జగన్ మోహన్ రెడ్డి మాట ఇచ్చింది వాస్తవం కాదాఅని నిలదీశారు. **డిఎస్సీ స్పోర్ట్స్ కోటాపై వైసిపి తప్పుడు ప్రచారాలు:** స్పోర్ట్స్ సర్టిఫికెట్లు శాప్ జారీ చెయ్యదని, సంబంధిత స్పోర్ట్స్ అసోసియేషన్లు, ఫెడరేషన్లు, ఒలింపిక్ అసోసియేషన్, యూనివర్సిటీలు మాత్రమే వాటిని ఇస్తాయని, వాటి ప్రామాణికతను కూడా ఆయా సంస్థలే నిర్ధారిస్తాయని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు స్పష్టం చేశారు.

9-9Pg7exHMNWJQE:9-9Pg7exHMNWJQE.qxd 9/9/2026 12:32 AM Page 1



# నేటి నుంచి ముంబైలో ఐఎఫ్ఎటి సదస్సు

## విశిష్ట అతిథిగా పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్



**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ముంబైలో సెప్టెంబర్ 9నుంచి జరిగే ప్రతిష్టాత్మక ఐఎఫ్ఏటీ ఇండియా-2026సదస్సుకు విశిష్ట అతిథిగా, వక్తగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ హాజరుకానున్నారు. భారతదేశంలో వ్యర్థాల నిర్వహణ, పట్టణ సుస్థిరతకు సంబంధించిన వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ఈ సదస్సు ప్రధాన అజెండా. ఘన వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగం, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, నీరు, మురుగునీటి నిర్వహణకు సంబంధించిన పర్యావరణ సాంకేతికతలపై నిర్వహించే ప్రముఖ వాణిజ్య ప్రదర్శన ఐఎఫ్ఏటీ ఇండియా. భారతదేశ సుస్థిరత, పర్యావరణ లక్ష్యాలను వేగంగా సాధించేందుకు అవసరమైన పరిష్కారాలపై చర్చించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, విధాన నిర్ణేతలు, మౌలిక సదుపాయాల రంగ నిపుణులు, పట్టణ పాలనా నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు, సాంకేతిక పరిజ్ఞాన సంస్థలు, పెట్టుబడిదారులు, అభివృద్ధి భాగస్వాములను ఈ వేదిక ఒక్కచోట చేర్చుతుంది. పట్టణ నిర్వహణ, సేవల అందజేతకు సంబంధించిన ఉత్తమ పద్ధతులు, వినూత్న విధానాలు, ఆచరణాత్మక అనుభవాల పరస్పర మార్పిడికి సదస్సు అజెండాలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తద్వారా చర్చలను మరింత ఫలవంతం చేయడంతోపాటు రాష్ట్రాల మధ్య సహకారాన్ని పెంపొందించనున్నారు.




మంగళవారం విజయవాడలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

# రాహుల్ గాంధీపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

**విజయవాడ, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** ప్రజా నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై కేంద్రంలోని బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం కక్షపూరితంగా అక్రమ కేసులు నమోదు చేసి భయపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తూ వాటిని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్ నుంచి ధర్నా చౌక్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్‌లో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జె.డి. శీలం, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, వివిధ జిల్లాల, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై నిరంతరం గొంతెత్తి ప్రశ్నిస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమ కేసులతో భయపెట్టాలని బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రయత్నించడం వారి పిరికితనానికి నిదర్శనమన్నారు. జె.డి. శీలం మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రశ్నించడం, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం దాని బాధ్యత అని అన్నారు. ఆ బాధ్యతను నిర్వర్తిస్తున్న రాహుల్ గాంధీపై రాజకీయ కక్షతో కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

# ఆరు దేశాలతో వ్యాపార ఉత్పత్తుల ఎగుమతికి ఒప్పందాలు ఖరారు

**విజయవాడ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 200 మందికి పైగా సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు ఎంఎస్ఎంఇ విజయవాడలో 34 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులతో కలిసి ఎపి రివర్స్ బయ్యర్ సెల్లర్ మీట్ ఆర్‌బిఎస్ఎం 2026 సదస్సులో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ సంస్థలకు ఎగుమతి అవకాశాలను పెంపొందిం చుటకు, విదేశీ కొనుగోలుదారులతో నేరుగా వ్యాపార సంబం ధాలను ఏర్పరచుకునేందుకు ఈ కార్యక్రమం ప్రత్యేక వేదికగా ఈ సదస్సు విజయవాడలోని నోవోటెల్ హోటల్‌లో సెప్టెంబర్ 7,8 తేదీల్లో రెండు రోజులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వరల్డ్ బ్యాంక్ మరియు ఎంఎస్ఎంఇ మంత్రిత్వ శాఖల ఆర్ఎఎంపి కార్యక్రమం ఆధ్వర్యంలో, ఇండియా ఎస్సెంఇ ఫోరమ్‌సహకారంతో ఈ సదస్సు నిర్వహించారు. బుర్కినా ఫాసో, కామెరూన్, కోట్ డి ఐవోర్, ఘనా, శ్రీలంక మరియు జింబాబ్వే వంటి మార్కెట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న అంతర్జాతీయ కొనుగోలుదారుల ప్రతినిధి బృందాలు ఈ సదస్సులో పాల్గొన్నారు. వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్ విధానం ద్వారా ఉద్యోగాలను కోరుకునే వారిని ఉద్యోగాలను సృష్టించే వారిగా మార్చుతూ, ఒక వ్యాపారవేత్తల సమాజాన్ని నిర్మించడం మా లక్ష్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిఇఓ విశ్వ మనోహరన్, డైరెక్టర్లు ప్రధాన విజయరామ్, నీలపు విజయానంద రెడ్డి, నల్లపనేని మురళీ మోహన్, చిన్న రాజు, ఇండియా ఎస్సెంఇ ఫోరమ్ అధ్యక్షుడు వినోద్ కుమార్, అంతర్జాతీయ కొనుగోలుదారుల ప్రతినిధి బృందాలు, పారిశ్రామికవేత్తలు మరియు ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.



# బోయపాలెం మెడికల్ షాపులో డ్రగ్స్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

## అనుమతులు లేని మెడికల్ కిట్ల విక్రయంపై విచారణ

**యద్దపాడు, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** మైనర్ బాలికకు సంబంధించిన అబార్షన్ ఘటనపై జరుగుతున్న విచారణలో మండల పరిధిలోని బోయపాలెం గ్రామంలోని మహాలక్ష్మి ్మ మెడికల్ షాపు నిర్వాహకుడి పాత్రపై అధికారులు దృష్టి సారిం చారు. అనుమతులు లేని అబార్షన్ కిట్ల విక్రయానికి సంబంధించి షాపులో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ ఘటనకు సంబం ధించి బాధితుల నుంచి వచ్చిన సమాచారంతో షాపు నిర్వాహకుడిని అధికా రులు ప్రశ్నించినట్లు తెలిసింది. తొలుత మెడికల్ కిట్లు విక్రయించలేదని నిర్వాహకుడు చెప్పినప్పటికీ, సంబంధిత బాధితుడు ఇక్కడే కొనుగోలు చేసినట్లు తెలిపిన నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టారు. అనంతరం కిట్లు విక్రయించినట్లు షాపు నిర్వాహకుడు అంగీకరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అధికారి ఏడి లక్ష్మణ్ షాపును మంగళవారం పరిశీలించారు. అనంతరం పల్నాడు, గుంటూరు జిల్లాల డ్రగ్స్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్లు పద్మజ, పర్వీన్ షాపులోని మందులు, బిల్లులు, విక్రయ రికార్డులను పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. తనిఖీలకు సంబంధించిన వివరాలతో ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. అయితే తనిఖీల సమయంలో షాపులో ఎటువంటి అబార్షన్ కిట్లు లభించలేదని అధికారులు తెలిపారు. అదే సమయంలో షాపు వెనుక భాగంలో కొన్ని మందుల బాక్సులు కాల్చివేసిన ఆనవాళ్లు కనిపించినట్లు సమాచారం. అనుమతులు లేకుండా మందులు, అబార్షన్ కిట్లు విక్రయించడం, వైద్యుల సూచనలు లేకుండా వైద్య సేవలు అందించడం వంటి అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



**చిల్లకూరు, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** చిల్లకూరు మండలంలోని కలవకొండ దళితవాడకు చెందిన బూదూరు సుబ్రహ్మణ్యం కుమారుడు బూదూరు రమేష్ (35)కరెంట్ షాక్‌తో మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కథనం మేరకు బూదూరు రమేష్ తన అన్నఇంటి వద్ద కరెంటు పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురైమృతి చెందినట్లు చిల్లకూరు పోలీసులుతెలిపారు. ఇదే విషయమై పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు వున్నారు.

# కన్నీటి సాగు.. మిరప పంటకు ట్యాంకర్లతో నీరు

## విడపనకల్లు మండలం చీకలగుర్కి గ్రామ రైతు ప్రయాస

## బోరు నీరు అడుగంటిపోవడంతో రైతుపై అదనపు భారం



చీకలగుర్కి గ్రామంలో ఎండిపోతున్న మిరప పంటను కాపాడుకోవడానికి ట్యాంకర్లతో నీటిని తెచ్చుకొని పంటకు అందిస్తున్న రైతు రామాంజినేయులు

**ఉరవకొండ, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** బోరులో నీరు అడుగంటిపోతుండటంతో కళ్లముందరే మిరప పంట ఎండుముఖం పట్టగా ట్యాంకర్లతో నీటిని తెచ్చుకొని పంటకు అందించి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్లు మండలం చీకలగుర్కి గ్రామ రైతు రామాంజినేయులు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో కరువు జిల్లాల్లో రైతుల కష్టాలు వర్ణణాతీతంగా మారుతున్నాయనడానికి ఈ రైతు పడే కష్టం అద్దం పడుతోంది. వివరాల్లోకి వెళితే వేలు, లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటకు నీరు పెడదామంటే వర్షా భావం కారణంగా బోరులో నీరు అడుగంటి పోవడంతో ఎలాగైనా పంటను కాపాడుకోవ డానికి విడపనకల్లు మండలం చీకలగుర్కి గ్రామానికి చెందిన రామాంజినేయులు అనే రైతు అష్టకష్టాలు పడుతున్నాడు. 4 ఎకరాల్లో బోరు కింద మిరపను సాగు చేశాడు. అయితే ఉన్నఫలంగా బోరు బావిలో నీరు గణనీయంగా తగ్గిపోయింది. దీంతో దాదాపు 30 రోజుల వయసుగల మిరప పంట వాడుముఖం పట డంతో ఎలాగైనా పంటను కాపాడుకోవాలని ఆయన ట్యాంకర్లతో నీటని తెచ్చుకొని పంటకు తడులు అందిస్తున్నాడు. గ్రామానికి సమీపంలోనే పారే జీబీసీ కాలువ నుండి నీటిని తోడుకొని పొలానికి తీసుకొచ్చి పంటకు నీరు పెడుతున్నాడు. ఒక ట్యాంకర్ నీటిని తోడుకొని పొలానికి తీసుకురావడానికి 500 రూపాయల వరకు ఖర్చు అవుతుండగా ఎలాగైనా పంటను కాపాడుకోవాలన్న ఆయన ప్రయాస కరువు పరిస్థితులకు అద్దం పడుతోంది. ఉరవకొండ నియోజకవర్గంలో పలువురు రైతులు వర్షాభావంతో బోర్లు అడుగంటిన కారణంగా ఎండిపోతున్న రెండు మూడు నెలల వయసుగల వేరుశెనగ తదితర పంటను దున్నేసుకొంటుంటే, మరికొందరు రైతులు పశువులను పంట పొలాల్లోకి వదిలేస్తున్నారు. మరికొందరు ఎలాగైనా పంటను కాపాడుకోవడా నికి ప్రతిరోజూ వేలాది రూపాయలను అద నంగా పంటపై ఖరు ్చ పెట్టుకొంటుండటం విశే షంగా చెప్పాలి.

**పంట చేతికొస్తే కొంతైనా ఊరట లభిస్తుంది:** ఇప్పటికే 4 ఎకరాల్లో పంట పెట్టడానికి దాదాపు 2 లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టాను. ఇప్పుడు పంటను కాపాడుకోవడానికి ఒక ట్యాంకు నీటికి 500 రూపాయలు ఖర్చు పెట్టుకుంటున్నాను ఏదిఏమైనా పంట చేతికొస్తే కాస్త ఊరట లభిస్తుందని రైతు రామాంజినేయులు చెబుతున్నాడు. పంట చేతికందే వరకు ట్యాంకర్లతో నీటిని అందించడం కష్టతరమే అయినా శక్తిమేరకు పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తానని ఆపై దేవుడిపైనే భారమని ఆయన చెబుతున్నాడు.

# ఎల్ నినో నుంచి ఉపశమనానికి బహుముఖ వ్యూహం

## ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్



**విజయవాడ: సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా, నిరంతరం 24/7 గంటల పాటు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు ఎల్ నినో వాతావరణ సవాళ్లను సమర్థవంతంగా తట్టుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక భారీ ఎనర్జీ రోడ్‌మ్యాప్‌ను రూపొం దించిందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ వెల్లడించారు. మంగళవారం విద్యుత్ సౌధలో ఆంధ్రప్రదేశ్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ జెన్కో ఎండి యస్.నాగలక్ష్మి, ఏపీ ట్రాన్స్కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్,, ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఐఏఎస్, ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి తదితరులు వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1,600 మెగావాట్ల కొత్త థర్మల్ విద్యుత్ కొనుగోలుతో పాటు 2,000 మెగావాట్లకు పైగా అత్యాధునిక బ్యాటరీ, పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టుల విస్తరణ, ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. పెరిగిన విద్యుత్ డిమాండ్ వేళ కొరత లేకుండా చూడటం, కొనుగోలు వ్యయాన్ని గణనీయంగా తగ్గించడం, గ్రిడ్ స్థిరత్వాన్ని పెంచడమే ఈ బహుముఖ వ్యూహం యొక్క ముఖ్య ఉద్దేశమని విజయానంద్ స్పష్టం చేశారు. ఈ ప్రణాళికలో భాగంగా భవిష్యత్ విద్యుత్ అవసరాలను తీర్చేందుకు 12 నుంచి 25 ఏళ్ల సుదీర్ఘ కాలపరిమితితో, విద్యుత్ చట్టం2003లోని సెక్షన్ 63 ప్రకారం టారిఫ్ ఆధారిత పోటీ వేలం ద్వారా 1,600 మెగావాట్ల అత్యంత చౌకైన థర్మల్ విద్యుత్‌ను డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఓన్, ఆపరేట్) పద్ధతిలో కొనుగోలు చేయనున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. రానున్న రోజులలో ఎల్ నినో కారణంగా విద్యుత్ ఉత్పత్తికి ఏవిధమైన అంతరాయం కలగకుండా ఉండడానికి జెన్కో కు విదేశీ బొగ్గు వాడకానికి అనుమతి కూడా ఇవ్వడం జరిగిందని, జెన్కో పోటీ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా ఈ బొగ్గును సేకరణ చెయ్యాల్సి ఉంటుందని తెలిపారు. వచ్చే సెప్టెంబర్ నెలదాకా దాదాపు సంవత్సరం పాటు విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ సరఫరా పై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు.

# డి.సి.పల్లిలో ఉరివేసుకొని వివాహిత మృతి

**మర్రిపాడు (నెల్లూరు), సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :** మర్రిపాడు మండలం డిసిపల్లిలో వివాహిత మహిళ చీర కొంగుతో ఫ్యానుకు ఉరివేసుకొని మృతిచెందింది. ఈసంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, ప్రత్యేక్షుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

వింజమూరుకు చెందిన షేక్ చాంద్‌బాషా ఆయన భార్య షేక్ హని లు ఇటీవల డిసిపల్లి గ్రామానికివచ్చి నివాసం ఉంటున్నారు. స్థానిక బస్టాండు సెంటర్‌లో వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఆరునెలల వయసుగల కొడుకు ఉన్నాడు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య చిన్న చిన్న అభిప్రాయ బేధాలు చోటుచేసుకుంటున్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. భర్త చాంద్‌బాషా ఇంట్లో లేని సమయంలో షేక్ హని (20) సోమవారం రాత్రి చీర కొంగుతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం ఉదయం మర్రిపాడు పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు సిఐ సి.గంగాధర్, మర్రిపాడు ఎస్ఐ బలరాంరెడ్డితో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించి హని మృతదేహాన్ని పరిశీలించారు. హని భర్త చాంద్‌బాషా అందుబాటులో లేదని ఈమె ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని స్థానికులు, పోలీసులు అనుమానిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

**డిసిపల్లి గ్రామంలో విషాదచాయలు** డిసిపల్లి గ్రామంలో వివాహిత మహిళ హని ఆత్మహత్య చేసుకొని బలవన్మరణం చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. 6నెలల వయసుగల కుమారునికి తల్లిప్రేమ దూరం కావడం హని మృతదేహాన్ని, ఆబిడ్డ ముఖాన్ని చూసిన వారు కన్నీరు మున్నీరవుతున్నారు.

# తెలుగుదనంఉట్టిపడేలా నూతన టెర్మినల్ భవనం : కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

**గన్నవరం(కృష్ణా), సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్మితమవుతున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవన నిర్మాణం తెలుగుదనం ఉట్టిపడేలా ఉంటుందని కేంద్రపౌర విమానయానశాఖా మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు తెలిపారు. మంగళవారం టెర్మినల్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. భవననిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి దసరానాటికి నిర్మాణం పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చం ద్రబాబునాయుడు లక్ష్యం విధించినట్లు చెప్పారు. ఈసందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం టెర్మినల్ నిర్మించిన రీతీగా ఈటెర్మినల్ భవనం నిర్మాణంలో కృష్ణానది, కనకదుర్గమ్మ ఆలయం, మన తెలుగు



సాంప్రదాయం , సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్మిస్తున్నట్లు చెప్పారు. భవన నిర్మాణంలో గత కాంట్రాక్టరు జాప్యం చేస్తుండటంతో కాం ట్రాక్టర్‌ను మార్చినట్లు ఆయన తెలిపారు. నిర్మా ణ పనులను వేగవంతం చేసేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ చైర్మన్‌తోపాటు, రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాణ్యతలో రాజీలేకుండా నిర్దేశిత లక్ష్యం మేరకు టెర్మినల్ నిర్మాణం పూర్తిచేస్తామన్న నమ్మకాన్ని మంత్రి వ్యక్తం చేసారు.

# ఎన్‌టిఆర్‌జిల్లాలో వందశాతం అక్షరాస్యతకు కృషి : కలెక్టర్

**విజయవాడ, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** వందశాతం అక్షరాస్యత సాధించిన జిల్లాగా ఎన్టిఆర్‌జిల్లాను తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. జిల్లావయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని కె.బి.ఎన్ కళాశాలలో 60వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా 2025-26 సంవత్సరానికి 97,047మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యం నిర్దేశించగా, 96,686 మందిని అక్షరాస్యులుగా మారి ్చ 99శాతం అక్షరాస్యత సాధించామన్నారు. 2026-27 సంవత్సరానికి 88,890 మంది నమోదు లక్ష్యాన్ని పూర్తిచేసినట్లు వివరించారు. ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది సమిష్టికృషితో మిగిలిన వారిని కూడా అక్షరాస్యులుగా తీర్చిదిద్ది జిల్లాను వందశాతం అక్షరాస్యత సాధించిన జిల్లాగా నిలబెడతామన్న నమ్మకాన్ని వ్యక్తం చేసారు. ఈసందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వృక్తత్వ పోటీల విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందచేసారు. ఈ కార్యక్రమంలో జిల్లావిద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ, వయోజన విద్యాశాఖ డిడి జి.ప్రభాకర్, ఐసిడిఎస్ పిడి ఎస్‌కె.రుక్సానా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీసుల అద్భుత విజయం

## రాష్ట్ర స్థాయి క్రీడల్లో 38 పతకాల సాధన

**నెల్లూరు క్రైమ్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుండి నాల్గొవ తేది వరకు వరకు నిర్వహించిన స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2026 పోటీల్లో జిల్లా పోలీస్ శాఖ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సౌత్ కోస్టల్ జోన్-గుంటూరు పరిధిలో మొత్తం 38 పతకాలు (12 స్వర్ణ, 19 రజత, 07 కాంస్య) సాధించి నెల్లూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపారు. ఈ పోటీల్లో జిల్లా పోలీస్ శాఖ తరఫున 36 మంది అధికారులు, సిబ్బందితో కూడిన బృందం పాల్గొనగా, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్ ఈ బృందానికి మేనేజర్‌గా వ్యవహరించారు. ప్రత్యేకంగా మహిళా పీసీ ఏ.చందన 12 పతకాలు సాధించి విమెన్ ఇండివిద్యువల్ ఛాంపియన్‌గా నిలవడం జిల్లా పోలీసులకు గర్వకారణంగా మారింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పతక విజేతలను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు.

# ఉద్యోగాల కుంభకోణంపై సీబీఐ ఎంక్వయిరీ జరగాలి: మాజీ ఎంపీ మార్గని భరత్

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో జరుగుతున్న ఉద్యోగాల కుంభకోణంపై విజిలెన్స్ ఎంక్వయిరీ కాదు, వెంటనే సీబీఐ ఎంక్వయిరీ జరగాలన్నదే వైఎస్సార్సీపీ ప్రధాన డిమాండ్ అని మాజీ ఎంపీ మార్గని భరత్ అన్నారు.

వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లా డారు. పేపర్ లీక్ చేసిన నవీన్ అనే వ్యక్తికి ఫస్ట్ ర్యాంక్ వచ్చినా ఉద్యోగం ఇవ్వకుండా దాచిపె ట్టడం వెనుక పెద్ద కుట్ర ఉంది. అసెంబ్లీలో సాక్షిగాఎడ్యుకేషన్ మినిస్టర్ నారా లోకేష్ పచ్చి అబద్దాలు మాట్లాడుతూ క్లీన్ చిట్ ఇచ్చుకోవడం సిగ్గుచేటన్నారు.

# సాధిక్ ఖాన్‌కు మూడు రోజుల కస్టడీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య,జగదీష్ హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది.పిఠాపురం పంచాయతీరాజ్ ఏఈ టిల్లపూడి నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో నిందితుడు షేక్ సాధిక్ ఖాన్‌కు మూడు రోజుల పోలీస్ కస్టడీకి కాకినాడ స్పెషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు అనుమతించింది.9 నుంచి11వ తేదీ వరకు ఎ ర్రవరంపోలీసులు అతడిని విచారించనున్నారు.

# ట్రంప్ దురహంకారంతో ప్రజలు ప్రత్యక్ష నరకం: సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దురహంకార చర్యలు, ఆంక్షల కారణంగా క్యూబా ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు.అమెరికా ఎన్ని ఆంక్షలు విధించినా, క్యూబా ప్రజలు లొంగకుండా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారని అన్నారు. క్యూబా రాజధాని హవానాలో ఇటీవల జరిగిన 24వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, కార్మిక పార్టీల సమావేశానికి హాజరైన రామకృష్ణతో మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమం నిర్వహించారు.

# నకిలీ బంగారంతో రూ. కోట్లలో లోన్ల పై చురుగ్గా దర్యాప్తు

## ముగ్గురు ఎడిసిసి బ్యాంక్ ఉద్యోగుల సస్పెన్షన్

**హిందూపురం సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వ్యవసాయ రంగ బ్యాంకులో బ్యాంక్ అధికారులు, సిబ్బంది నిర్వాకం కారణంగా నకిలీ బంగారం కుదువ పెట్టి సుమారు 5 కోట్ల రూపాయలు అక్రమంగా రుణాలు పొందిన ఉదంతంపై విచారణ బృందం దూకుడు పెంచింది. శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం లోని ఎడిసిసి బ్యాంకులో భారీ స్కాం జరగడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ క్రమంలో ప్రధాన పాత్ర పోషించిన ముగ్గురు బ్యాంకు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. స్థానిక బ్యాంకు మేనేజర్ జయరాం చౌదరి, సహాయ మేనేజర్ కంబగిరి, గుమస్తా అర్చన బాయి లు పై చర్య తీసుకున్నారు. ఎన్నేళ్లుగా హిందూపురం ఏడీసీసీ బ్యాంకులో ఈ అక్రమ దందా కొనసాగుతోంది.. దీనికి ప్రధాన కారకులు ఎవరు అన్న కోణంలో లోతుగా ఉన్నతాధికారుల బృందం విచారణ చేస్తోంది. బ్యాంకులో ప్రైవేటుగా విధులు నిర్వహించే అప్రైజర్ ఈ ఘటనకు ప్రధాన సూత్రధారి కాగా, బ్యాంకు ఉద్యోగులు పూర్తిస్థాయిలో సహకరించారన్నది ప్రాథమిక సమాచారం లో తేలింది. తొలుత గుట్టు చప్పుడు కాకుండా దీనిని అధికారులు దర్యాప్తు చేపట్టినప్పటికీ ఆ తర్వాత వెలుగులోకి వచ్చింది. మొదటఅసలు బంగారం తీసుకొచ్చి రుణాలు తీసుకున్న తర్వాత పక్కా ప్రణాళికతో దాని స్థానంలో నకిలీ బంగారం పెట్టినట్టు తెలుస్తోంది. కాగా అప్రైజర్ పరారీలో ఉన్నట్టు సమాచారం. అక్రమ పద్ధతిలో కోట్లాది రూపాయలు లోన్ తీసుకున్న వ్యవహారంలో కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీచేయడం సత్ఫలితాలను ఇచ్చింది. ఈ క్రమంలో దాదాపు రూ 3కోట్ల వరకు రికవరీ అయినట్లు ఉన్నతాధికారుల వెల్లడించారు.



# కొత్తపేటలో రూ.1.70 కోట్ల సొమ్ము పక్కదారి

## విచారణలో వాస్తవమని గుర్తించిన అధికారులు...

## పంచాయతీ కార్యదర్శి వెంకట రామన్‌ను సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు...

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు8,ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట గ్రామ పంచాయతీలో రూ.1.70 కోట్ల ఇంటి పన్ను సొమ్ము స్వాహా వ్యవహారంలో అప్పటి పం చాయతీ కార్యదర్శి వేగుళ్ల వెంకట రామను రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎం. కృష్ణతేజ సస్పెండ్ చేశారు.సంబంధిత ఉత్తర్వులు అమ లాపురం ఎంపీడీఓ కార్యాలయానికి చేరాయి. వివరాలివీ.. వెంకటన్ 2016-17 నుండి 2023-24 వరకు కొత్తపేట పంచాయతీలో కార్యదర్శిగా పని చేశారు. ఆ సమయంలో ఇంటి పన్నుల వసూళ్ల సొమ్ము స్వాహా జరిగిందని గుర్తించిన స్థాని కులు ఆందోళనకు దిగారు.దీనిపై గత ఏడాది సెప్టెంబర్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీ ఓ)కి ఫిర్యాదు చేశారు. గ్ధీ ఈ ఆరోపణలపై రామచంద్రపురం డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ జరిపారు. పంచాయతీ కార్యాలయం లో రికార్డుల ప్రకారం ఉండాల్సిన సుమారు రూ.1.70 కోట్ల నిధులను ప్రభుత్వ ఖజానాకు వెంకట రామన్ జయ చేయలేదని, ఆ నిధులు పక్కదారి పట్టాయని గుర్తించారు. ప్రధానంగా భవన నిర్మాణాల లే అవుట్ ఫైళ్లు, పారిశుధ్య సామగ్రి కొనుగోలు వంటి రికార్డులు మాయం చేసినట్లు ఆరోణలు వచ్చాయి. ఈ విచారణ నివేదిక ఆధారంగా వెంకట రామన్ ను సస్పెం డ్ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. వెంకటరామన్ ప్రస్తుతం అమలాపురం మండలం పేరూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తు న్నారు. ఆయనకు ఎంపీడీఓ ఉంద్రు బాజ్జీరాజు అమలాపురంలోని తన కార్యాలయంలో సస్పె న్షన్ ఉత్తర్వులు అందజేశారు.




# మత్తు ఇంజక్షన్ల రాకెట్‌పై పోలీసుల ఉక్కుపాదం

## మరో ఐదుగురు అరెస్ట్.. ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసులు, కొనసాగుతున్న దర్యాప్తు

**జంగారెడ్డిగూడెం సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** జంగారెడ్డిగూడెంలో కలకలం రేపిన అక్రమ మత్తు ఇంజక్షన్ల విక్రయాలపై పోలీసులు, డ్రగ్స్ నియంత్రణ అధికారులు ఉమ్మడిగా విరుచుకుపడ్డారు. ఎటువంటి బిల్లులు, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అక్రమంగా మత్తు ఇంజక్షన్లను కొనుగోలు చేస్తూ విక్రయిస్తున్న మెడికల్ ఏజెన్సీలకు చెందిన మరో ఐదుగురు వ్యక్తులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 880 ట్రామడాల్ మత్తు ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం శ్రీ లక్ష్మీ ్మ శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ యజమాని కిషోర్‌ను అరెస్టు చేసి, నిందితుడు స్నేహితుడి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 7,550 మత్తు ఇంజక్షన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించిన విషయం జరిగింది. ఆ కేసు దర్యాప్తులో భాగంగా జరిపిన తనిఖీల్లో తాజాగా మరికొందరు వ్యాపారుల అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా అరెస్ట్ అయిన వారిలో జ్యోతిక పెద్దింటి మెడికల్స్‌కు చెందిన ఏలూరు సతీష్, రూపా పెద్దింటి ఏజెన్సీకి చెందిన ఏలూరి దుర్గాప్రసాద్, దేవ రాజశేఖర్, శ్రీ భవాని మెడికల్ ఏజెన్సీకి చెందిన మాదవరపు శివ కృష్ణ, మధ్యాహ్నాపు వారిగూడెంకు చెందిన చిరు మెడికల్ అండ్ జనరల్ స్టోర్ యజమాని తమ్మిశెట్టి చిరంజీవి ఉన్నారు. పట్టుబడిన ఐదుగురిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసి రిమాం డ్‌కు తరలిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. నిషేధిత మరియు మత్తు కలిగించే ఔషధాలను అక్రమంగా విక్రయిస్తే ఎంతటి వారైనా ఉపేక్షి ంచేది లేదని హెచ్చరించారు. ఈ తనిఖీలు మరియు అరెస్టుల చర్యల్లో సీఐ వెంకట సుభాష్, ఎస్సై వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై కుటుం బరావు తదితర సిబ్బంది

# ఫైరింగ్ శిక్షణ కేంద్రంలో మిస్ ఫైర్

## రైతు కాలులో దూసుకెళ్లిన బుల్లెట్



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు పరిధిలో ఉన్న కొమ్మరపూడి పొలాల్లో వ్యవసాయ పనులు చేస్తున్న ఏకుల సీతారామయ్యకు మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఓ బుల్లెట్ దూసుకొచ్చి ఆయన కాలులో దిగి తీవ్ర గాయం అయింది. సీతారా మయ్య వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం వ్యవసాయ పనులు చేస్తుండగా అనూహ్యంగా బుల్లెట్ దూసుకొచ్చి తీవ్ర గాయం అయింది. స్థానికులు ఆయనను హుటాహుటిన 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. కొమ్మరపూడి పొలాలకు సమీపంలో నగరవనం ప్రాంతంలో ఉన్న పోలీస్ ఫైరింగ్ శిక్షణా ప్రదేశం నుండి పొలాల్లోకి అనేక బుల్లెట్లు దూసుకొస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ క్రమంలోనే మంగళవారం జాతీయ పారిశ్రామిక భద్రతాదళం ఫైరింగ్ శిక్షణ కొనసాగుతుండగా ఒక పోలీస్ ఫైరింగ్ కావడంతోనే బుల్లెట్ రైతును తీవ్రంగా గాయపరిచినట్లు బాధితుడు వేదయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తరచూ ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఎటువైపు నుండి వచ్చిబుల్లెట్ తగులుతుందోనని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని వ్యవసాయ పనులు సాగిస్తున్నామని కూలీలు వాపోతున్నారు.



## హాకీ ఆసియా కప్.. సెమీఫైనల్ బెర్త్‌కు దగ్గరలో భారత్

**మోఖీ:** దక్షిణ కొరియాను చిత్తుగా ఓడించిన భారత్, హాకీ జూనియర్ ఆసియా కప్ సెమీఫైనల్ బెర్త్‌కు మరింత చేరువైంది. మంగళవారం దక్షిణ కొరియాపై 7–3 తేడాతో ఘన విజయం సాధించడం ద్వారా భారత్ పూల్ ఎ లో అగ్రస్థానంలో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవడంతో సెమీఫైనల్స్‌లో స్థానానికి మార్గంన సుగమమైంది. ఇక ఆటను ప్రారంభించి 5వ నిమిషంలో అన్మోల్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో భారత్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. దోహ్యోన్ చోయ్ పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేసి కొరియా స్కోరును 1–1తో సమం చేశాడు. రెండో క్వార్టర్‌లో లవనూర్ సింగ్ (18వ నిమిషంలో) భారత్‌కు మళ్లీ ఆధిక్యాన్ని అందించాడు. కానీ హ్యోగుక్ యూ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చి స్కోరును 2–2తో సమం చేయడంతో కొరియా తిరిగి పుంజుకుంది. అజీత్ యాదవ్ (20వ) గోల్ చేయడంతో భారత్ మళ్లీ ఆధిక్యంలోకి వచ్చింది. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్లు అర్ధభాగం సమయానికి 3–2 ఆధిక్యంలో నిలిచారు. తర్వాత మూడవ క్వార్టర్‌లో యూ మళ్లీ లక్ష్యాన్ని ఛేదించి 2వ గోల్ సాధించి 3–3తో కొరియాను సమం చేశాడు. ప్రభ్‌దీప్ సింగ్ ప్రతిష్టంభనను ఛేదించి (42వ) భారత్‌ను 4–3తో ఆధిక్యంలోకి తెచ్చాడు. నాలుగో క్వార్టర్ 3 నిమిషాల్లో మూడు గోల్స్‌తో భారత్ చివరకు పూర్తి పట్టు సాధించింది. గుర్సేవక్ సింగ్ (55వ) భారత్ ఆధిక్యాన్ని పెంచగా, అన్మోల్ మరో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి స్కోరును 6–3కి చేర్చాడు. ఆర్యన్ జెస్(58వ) స్కోరింగ్‌ను పూర్తి చేయగా, భారత్ 7వ గోల్‌ను సాధించి, 7–3 తేడాతో ఘన విజయాన్ని ఖాయం చేసింది.

## వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ విజయం

**కితాక్యూషు (జపాన్):** జపాన్‌లోని కితాక్యూషులో మంగళవారం న్యూజిలాండ్‌పై 3–0 తేడాతో విజయం సాధించడం ద్వారా, 2026 ఏవీసీ పురుషుల వాలీబాల్ కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ తమ క్వార్టర్‌ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. చైనా, ఇరాన్‌ల చేతిలో వరుసగా స్ట్రెయిట్ సెట్లలో ఓడిపోయిన తర్వాత, ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ఇదే తొలి విజయం. పూల్ బిలో భారత్ ఒక విజయం, రెండు ఓటములు, మూడు పాయింట్లతో ముగించడంతో



క్వార్టర్‌ఫైనల్ అర్హత ఇతర పూల్స్‌లోని ఫలితాలపై ఆధారపడి ఉంది. కాగా భారత్, న్యూజిలాండ్‌ను 25–22, 25–18, 25–21 తేడాతో ఓడించింది. కాగా 12 జట్లు పాల్గొనే ఈ టోర్నమెంట్‌లో మొత్తం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన ఎనిమిది జట్లు క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. మూడు పాయింట్లు, మెరుగైన సెట్ నిష్పత్తితో ఉన్న చైనీస్ తైపీ వెనుక భారత్ ప్రస్తుతం 8వ స్థానంలో ఉంది, అయితే ఈ నెల 9న ఒమన్, బహ్రెయిన్ జట్లు తలపడిన తర్వాత తుది స్థానాలు ఖరారవుతాయి. ఒకవేళ ఒమన్ తమ మ్యాచ్‌ను 3–0 లేదా 3–1 తేడాతో గెలిస్తే, వారు టాప్ ఎయిట్‌లోకి ప్రవేశించి భారత్‌ను నిష్క్రమింపజేస్తారు. కానీ మిగతా ఏ సందర్భంలోనైనా భారత్ చివరి 8కి అర్హత సాధిస్తుంది. భారత్ తమ ప్రచారాన్ని చైనా చేతిలో 0–3 తేడాతో ఓటమితో ప్రారంభించగా, ఆ తర్వాత ఇరాన్ చేతిలో కూడా 0–3 తేడాతో ఓటమి చవిచూసింది.

## యుఎస్ ఓపెన్: క్వార్టర్ ఫైనల్స్‌కు కోకో గాఫ్

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్‌లో కోకో గాఫ్ వర్ధమాన యూఎస్ స్టార్ క్రీడాకారిణి ఇవా జోవిక్‌పై 80 నిముషాల్లో 6–1, 6–4 తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. అలాగే ఎలెనా రైబాకినా నవోమి ఒసాకాపై తిరుగులేని విజయంతో ముందంజ వేసింది. 2023 యూఎస్ ఓపెన్ ఛాంపియన్ ఇప్పుడు తన 12వ గ్రాండ్ స్లామ్ క్వార్టర్ ఫైనల్‌కు, న్యూయార్క్‌లో మూడవసారి చేరుకుంది. గాఫ్, జోవిక్‌తో జరిగిన తొలి సెట్‌లో మూడుసార్లు సర్వ్‌ను బ్రేక్ చేసి, చివరి 13 పాయింట్లలో 12 గెలుచుకుని ఆధిపత్యం చెలాయించింది. జోవిక్ తొలి గేమ్‌ను గెలుచుకున్నప్పటికీ, సెట్ సాగేకొద్దీ గాఫ్ యొక్క తీవ్రతను అందుకోవడానికి ఆమె



ఇబ్బంది పడింది. రెండవ సెట్‌లోని ఐదవ గేమ్‌లో గౌఫ్ మరో బ్రేక్ సాధించగా, జోవిక్ వెంటనే బ్రేక్ బ్యాక్ చేసి స్కోరును సమం చేసింది. ఆ తర్వాత మాజీ ఛాంపియన్ మరో నిర్ణయాత్మక బ్రేక్ సాధించి 5–4 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అనంతరం మ్యాచ్‌ను తన సర్వ్‌తో ముగించి క్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. గౌఫ్ తదుపరి ఐదో సీడ్, కొత్తగా రోలాండ్ గారోస్ ఛాంపియన్‌గా నిలిచిన 19 ఏళ్ల ఆండ్రీవాతో తలపడనుంది. మరో నాలుగో రౌండ్ పోరులో, ఒసాకాపై తిరుగులేని విజయంతో రైబాకినా క్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకుంది.





## అయ్యర్ టీమ్.. గిల్ టీమ్

### అక్టోబరు 3న అరుదైన చరిత్రాత్మక ఘటన

### ఒకే రోజు టీమిండియాకు రెండు మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ:** అప్‌కమింగ్ ఆసియా గేమ్స్ 2026 క్రికెట్ షెడ్యూల్ విడుదలైంది. జపాన్‌లోని ఐచి నగోయా వేదికగా జరిగే ఈ టోర్నీలో భారత జట్టు ఈ నెల 28న తొలి మ్యాచ్ ఆడనుంది. మెరుగైన ఐసీసీ ర్యాంక్ కారణంగా భారత్ నేరుగా క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. అయితే ఈ క్రికెట్ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 3న అత్యంత అరుదైన చారిత్రాత్మక ఘటన ఆవిష్కృతం కానుంది. ఆ ఒక్క రోజే భారత పురుషుల క్రికెట్ జట్టు రెండు వేర్వేరు మ్యాచ్‌లు ఆడనుంది. ఆసియా గేమ్స్ 2026లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు తలపడితే, అదే రోజు శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత వన్డే టీమ్ వెస్టిండీస్‌తో ఆడనుంది. అయితే ఆసియా గేమ్స్ 2026 ఫైనల్‌కు భారత్ చేరితేనే ఈ అరుదైన ఘనత ఆవిష్కృతం కానుంది. ఆసియా గేమ్స్ 2026 క్రికెట్ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28న భారత్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఆడనుంది. అక్టోబర్ 1న సెమీఫైనల్స్ జరగనుండగా, 3న ఫైనల్ జరుగుతుంది. అదే అక్టోబర్ 3న భారత్‌లో న్యూ చండీగఢ్ వేదికగా భారత్, వెస్టిండీస్ మధ్య మూడో వన్డే జరగనుంది. ఒకవేళ భారత జట్టు ఆసియా గేమ్స్ ఫైనల్ చేరితే, రెండు భారత జట్లు ఒకే రోజున వేర్వేరు దేశాల్లో ఆడుతాయి. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లు ఆడనున్నారు. ఆసియా గేమ్స్‌లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టులో సంజూ శాంసన్, బుమ్రా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీ వంటి టాప్ ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. కాగా భారత క్రికెట్ చరిత్రలోనే ఇలా ఒకే రోజు రెండు మ్యాచ్‌లను వేర్వేరు టీమ్స్ ఆడటం ఇది రెండోసారి. 28 ఏళ్ల క్రితం 1998లో సెప్టెంబర్ 12న కౌలాలంపూర్‌లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో ఒక జట్టు.. టొరంటోలో జరిగిన సహారా కప్‌లో మరో జట్టు తలపడింది. 28 ఏళ్ల తర్వాత మళ్లీ అలాంటి సంఘటనే చోటు చేసుకుంటుంది. ఆసియా గేమ్స్ కోసం భారత పురుషుల క్రికెట్ టీమ్ కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ వ్యవహరించనుండగా, గిల్ సేనను శుభ్‌మన్ గిల్ నడిపించనున్నాడు.

## మహిళల టి20 ఆసియా కప్ సెమీస్‌కు పాకిస్థాన్



### 72 రన్స్ తేడాతో హాంకాంగ్ ఓటమి

**దుబాయ్:** నష్రా సంధు రికార్డు స్థాయిలో ఆరు వికెట్లు తీసి పాకిస్థాన్‌ను మహిళల ఆసియా కప్ సెమీఫైనల్స్‌కు చేర్చింది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన మహిళల టీ20 ఆసియా కప్ గ్రూప్ ఎ మ్యాచ్‌లో, ఎడమచేతి వాటం స్పిన్నర్ నష్రా సంధు ఆరు వికెట్లతో తన కెరీర్‌లోనే అత్యుత్తమ టీ20ఐ ప్రదర్శన కనబరచగా పాకిస్థాన్, హాంకాంగ్ ను 72 పరుగుల తేడాతో ఓడించింది. ఈ విజయంతో పాకిస్థాన్ సెమీఫైనల్‌లో స్థానం దక్కించుకుంది. మూడు మ్యాచ్‌లలో నాలుగు పాయింట్లతో గ్రూప్ ఎ లో రెండవ స్థానంలో నిలిచిన పాకిస్థాన్, ఈ నెల 11న జరిగే రెండవ సెమీఫైనల్‌లో శ్రీలంకతో తలపడనుంది. కాగా 8 వికెట్ల నష్టానికి 143 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో, పాకిస్థాన్ ఆరంభంలోనే వికెట్లు తీసినప్పటికీ, నష్రా హాంకాంగ్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చింది. 28 ఏళ్ల ఈ స్పిన్నర్ 4076 గణాంకాలతో ముగించగా, 19 ఓవర్లలో హాంకాంగ్ 71 పరుగులకే ఆలౌట్ అయింది. టీ20ఐలలో పాకిస్థాన్ మహిళా క్రికెటర్ చేసిన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనగా కూడా నష్రా నిలిచింది.



అంతకుముందు, బ్యాటింగ్ చేయమని కోరిన పాకిస్థాన్ తమ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. షవాల్ జుల్ఫికర్ 47 పరుగులు చేయగా, అయేషా జాఫర్ 26 పరుగులు చేయగా, కెప్టెన్ ఫాతిమా సనా 24 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. జాయ్లిన్ కౌర్ 19 పరుగులకు 4 వికెట్లు తీసి హాంకాంగ్ తరఫున అత్యంత విజయవంతమైన బౌలర్‌గా నిలవగా, ఇఖ్రా సహర్, క్యారీ చాన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

## జియోబ్లాక్‌రాక్ అడ్వాంటేజ్ ఫండ్ ప్రారంభం

**ముంబయి, సెప్టెంబరు 8:** జియోబ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ మంగళవారం జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కంపెనీ నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.22,000 కోట్లను దాటిందని, మార్చిలో ఈ ఏయూఎం దాదాపు రూ.16,000 కోట్లుగా ఉండగా ఇపుడు గణనీయంగా పెరిగిందని వివరించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏయూఎం రూ.25,000 కోట్ల మార్కును దాటుతుందని కంపెనీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ రిషి కోహ్లీ ధీమా వ్యక్తం చేశారు. కంపెనీ ఏయూఎం ఇప్పటికే రూ.22,000 కోట్లకు చేరుకుంది.



పెట్టుబడిదారుల నుంచి స్పందన ఆరోగ్యకరంగా ఉంది. మరిన్ని ఉత్పత్తులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది ద్వితీయార్థంలో మరిన్ని ఫండ్లను అందుబాటులోకి తీసుకురానున్నందున మరింత ఆసక్తికరంగా ఉంటుం అన్నారు. జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ ఓపెన్‌ఎండెడ్ డైనమిక్ అసెట్ అలోకేషన్ పథకం. ఈ ఫండ్‌కు సంబంధించిన న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) ఈనెల 11న ప్రారంభమై 25న ముగుస్తుంది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈక్విటీ, డెట్ సాధనాల్లో పెట్టుబడులను డైనమిక్‌గా మార్చుకుంటూ దీర్ఘకాలిక మూలధన వృద్ధిని అందించడం ఈ ఫండ్ లక్ష్యమని కంపెనీ తెలిపింది.

## ఎన్ఎస్ఇలో 35 శాతం వాటా విక్రయానికి బీవోబీ రెడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లో తనకున్న వాటాలో సుమారు 35 శాతం లేదా గరిష్ఠంగా 76,90,375 ఈక్విటీ షేర్లను విక్రయించాలని బ్యాంక్ ఆఫ్ బరోడా నిర్ణయించింది. ఆఫర్ ఫర్ సేల్ విధానంలో, ఎన్ఎస్ఈ ప్రతిపాదిత ఐపీఓ ద్వారా ఈ వాటాను విక్రయించనున్నట్లు మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో బ్యాంక్ వెల్లడించింది. ఓఎఫ్ఎస్ ప్రక్రియలో భాగంగా ఈక్విటీ షేర్లను మంగళవారమే ఎస్క్రో ఖాతాకు బదిలీ చేసినట్లు తెలిపింది. ఈ వాటా విక్రయ ప్రక్రియ సెప్టెంబర్ 2026 చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని బ్యాంక్ పేర్కొంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్ఎస్ఈ నుంచి బ్యాంక్ ఆఫ్ బరోడాకు సుమారు




రూ.76.9 కోట్ల డివిడెండ్ లభించింది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఎన్ఎస్ఈ ఐపీఓకు అనుమతి ఇచ్చిన కొద్ది రోజులకే బ్యాంక్ ఆఫ్ బరోడా వాటా విక్రయానికి సంబంధించిన తాజా పరిణామం చోటుచేసుకుంది. ఎన్ఎస్ఈ ఐపీఓకు సంబంధించి సెప్టెంబర్ 11న ప్రైస్ బ్యాండ్‌ను ప్రకటించే అవకాశం ఉందని, ఈ నెల మూడో వారంలో ఎన్ఎస్ఈ షేర్లను స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాలని భావిస్తున్నట్లు గతంలో వర్గాలు తెలిపాయి. 2026 ఆగస్టులోనే ఎన్ఎస్ఈ ఐపీఓకు సెబీ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ లభించింది. 2026 జులై 30న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సెప్టెంబర్ నాటికి బీఎస్ఈలో లిస్టింగ్ కావచ్చని మార్కెట్ నిపుణులు చెపుతున్నారు.



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** భారత తాజా జీడీపీ గణాంకాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో, గత త్రైమాసికాల నామినల్ జీడీపీ అంచనాల్లో భారీ మార్పులు రావడంపై ఎస్‌బీఐ రీసెర్చ్ వివరణ ఇచ్చింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త జాతీయ ఖాతాల సిరీస్‌లో చేసిన సవరణలు ఎలాంటి వివరణ లేని సర్దుబాట్లు కాదని, జీడీపీ బేస్ ఇయర్, గణన పద్ధతిలో మార్పుల ఫలితమేనని తన తాజా నివేదికలో పేర్కొంది. 2026–27

## బేస్ ఇయర్ మార్పులవల్లనే జిడిపిపై అపోహాలు

### ఎస్బీఐ రీసెర్చి నివేదిక వెల్లడి

ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత వాస్తవ జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైన నేపథ్యంలో ఈ చర్చ తెరపైకి వచ్చింది. గత జీడీపీ సిరీస్‌తో పోలిస్తే తాజా అంచనాల్లో భారీ వ్యత్యాసం కనిపించడంపై పలు ప్రశ్నలు తలెత్తాయి. ఎస్‌బీఐ రీసెర్చ్ ప్రకారం, 2009 నుంచి ఇప్పటివరకు 70 త్రైమాసికాల్లో జీడీపీ గణాంకాల్లో 239 సార్లు సవరణలు జరిగాయని వీటిలో 134 సార్లు అంచనాలను పైకి సవరించగా, 105 సార్లు కిందికి సవరించారు. కొత్త సిరీస్‌లో చేసిన సవరణల స్థాయి కూడా గణనీయంగా ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. 2023 తొలిత్రైమాసికం నుంచి 2026 రెండోత్రైమాసికం మధ్య నామినల్ జీడీపీని రూ.41.8 లక్షల కోట్ల మేరకు కిందికి సవరించగా, వాస్తవ జీడీపీని రూ.372 లక్షల కోట్ల మేరకు పైకి సవరించారు. ఈ రెండు మార్పులను కలిపి చూడాల్సిందే తప్ప, నామినల్ జీడీపీలో జరిగిన సవరణను మాత్రమే విడిగా పరిగణించకూడదని ఎస్‌బీఐ తెలిపింది. వాణిజ్యం, హోటళ్లు, రవాణా రంగాలపై ప్రభావంరంగాల వారీగా చూస్తే, వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్ రంగాల్లో కేంద్రీకృతమైందని నివేదిక తెలిపింది. అదే సమయంలో ఆర్థిక, బీమా, రియల్ ఎస్టేట్, వ్యాపార సేవల రంగాల్లో రూ.13.6 లక్షల కోట్ల మేర పైకి సవరణ జరిగింది. జీడీపీ డిఫ్లేటర్‌పైనా విశ్లేషసీపీఐ, డబ్ల్యూపీఐ వంటి ప్రధాన ద్రవ్యోల్బణ సూచీలతో పోలిస్తే భిన్నమైన ధోరణి కనిపిస్తున్న జీడీపీ డిఫ్లేటర్ అంశాన్ని కూడా ఎస్‌బీఐ రీసెర్చ్ పరిశీలించింది. పెట్టుబడులు కూడా బలమైన ఆర్థిక కార్యకలాపాలకు సంకేతంఅధిక ఫ్రీక్వెన్సీ ఆర్థిక సూచీలు, పెట్టుబడుల గణాంకాలు దేశ ఆర్థిక కార్యకలాపాలు బలంగా ఉన్నాయన్న విషయాన్ని సూచిస్తున్నాయని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. 2023నుంచి ప్రైవేట్ రంగంలో అదనపు పెట్టుబడులు సగటున ఏటా రూ.3.5 లక్షల కోట్లుగా నమోదయ్యాయని పేర్కొంది. 2019 వరకు ఉన్న ఆరు సంవత్సరాల్లో ఈ సగటు రూ.3.3 లక్షల కోట్లుగా ఉండేదని తెలిపింది.



## మార్కెట్లకు మళ్లీ నష్టాలు..

### సెన్సెక్స్ 555 పాయింట్లు డౌన్

**ముంబయి, సెప్టెంబరు 8:** దేశీయ స్టాక్ మార్కెట్ల కీలక సూచీలు మంగళవారం వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు మరింత తీవ్రతరం అవుతాయన్న ఆందోళనల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ బలంగా ఉండటం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లపై ఆందోళనలు పెరగడంతో ప్రైవేట్ బ్యాంకులు, చమురుగ్యాస్, ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. సెన్సెక్స్ 555 పాయింట్లు పతనంబీఎస్ఈ సెన్సెక్స్ 555.23 పాయింట్లు నష్టపోయి 75,577.58 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 144.05 పాయింట్లు క్షీణించి 23,635.10 వద్ద స్థిరపడింది. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.23 శాతం, నిఫ్టీ 1.10 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలో ఐసిఐసిఐబ్యాంకు 1.97 శాతం, రిలయన్స్ 1.11 శాతం, హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు 1.06 శాతం నష్టపోయి సూచీపై అధిక ప్రతికూల ప్రభావం చూపాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.27 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.17 శాతం లాభపడ్డాయి. బీఎస్ఈలో మొత్తం 2,096 షేర్లు లాభాల్లో ముగియగా, 2,291 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 239 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్‌లో నవంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 2.04 డాలర్లు పెరిగి 98.32 డాలర్లకు చేరింది. భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ ఈల్డ్ గత సెషన్ ముగింపు 6.957 శాతంతో పోలిస్తే 0.09 శాతం తగ్గి 6.951 శాతంగా నమోదైంది. ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి విలువ కూడా క్షీణించింది. గత సెషన్‌లో 94.5650 వద్ద ముగిసిన రూపాయి, మంగళవారం డాలర్‌తో పోలిస్తే 94.8300 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్ బంగారం ఫ్యూచర్స్ 0.12 శాతం పెరిగి రూ.1,52,994కు చేరాయి. లాభపడ్డ షేర్లుసన్సెరా ఇంజినీరింగ్ 3.30 శాతం పెరిగింది. పాలీక్యాబ్ ఇండియా 1.36 శాతం లాభపడింది. గరుడ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజినీరింగ్ 1.56 శాతం పెరిగింది. జీఈ వెర్నోవా టి డి 8.77 శాతం దూసుకెళ్లింది. ఆర్గానిక్ రీసైక్లింగ్ సిస్టమ్స్ 4.11 శాతం ఎగబాకింది. సింఫనీ 5.72 శాతం భారీగా పెరిగింది. నష్టపోయిన షేర్లుషిప్‌రాకెట్ 0.97 శాతం క్షీణించింది. శ్రీ లోటస్ డెవలపర్స్ అండ్ రియాల్టీ 1.36 శాతం పడిపోయింది.

## ఆర్థికవ్యవస్థ పురోగతిలో ఫిన్‌టెక్ భాగస్వామ్యం

### ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**ముంబయి, సెప్టెంబరు 8:** ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో ఫిన్‌టెక్ రంగాన్ని రిజర్వుబ్యాంకు విలువైన భాగస్వామిగా పరిగణిస్తోందని సెంట్రల్ బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఆర్థిక సేవలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం, కస్టమర్ల అనుభవాన్ని మెరుగుపరచడం, వేగవంతమైన, సమర్థవంతమైన రుణాల పంపిణీకి ఫిన్‌టెక్ రంగం కీలకంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సమక్షంలో మంగళవారం జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్ 2026లో మల్హోత్రా ప్రసంగించారు. స్టార్టప్‌లు, ఫిన్‌టెక్ కంపెనీలు, ఇతర భాగస్వాములతో నిరంతర, బహిరంగ, నిర్మాణాత్మక చర్చలు జరపడం ఆర్‌బీఐ విధానంలో కీలక భాగమని తెలిపారు. భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో ఫిన్‌టెక్‌ను ఆర్‌బీఐ ఎప్పటి నుంచో విలువైన భాగస్వామిగా చూస్తోందని మల్హోత్రా అన్నారు. ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన రెగ్యులేటరీ శాండ్‌బాక్స్, రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్‌తో పాటు ఫిన్‌టెక్ రంగంతో కొనసాగిస్తున్న చర్చలు కూడా ఇదే విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు. నిరంతర, బహిరంగ, నిర్మాణాత్మక చర్చల ద్వారానే మెరుగైన విధానాలను రూపొందించగలమనే నమ్మకంతో ఆర్‌బీఐ పనిచేస్తోందని వివరించారు. బ్యాంకింగ్ సేవలను బ్యాంకు శాఖల నుంచి ప్రతి పౌరుడి చేతిలోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. చిన్న పట్టణంలోని దుకాణదారుడు, మారుమూల గ్రామంలోని రైతు, మెట్రో నగరంలోని యువ ఉద్యోగి.. వీరంతా ఒకే విధమైన సులభమైన డిజిటల్ వ్యవస్థ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు, పొదుపు చేస్తున్నారు, రుణాలు పొందుతున్నారన్నారు. యూపీఐ, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థలు, జనధన్ పథకం వంటి డిజిటల్ మౌలిక వసతులు దీనికి బలమైన పునాదిగా నిలిచాయని ఆయన అన్నారు. ఆర్థిక సమ్మిళితత్వం ఇక కేవలం ప్రభుత్వ విధాన లక్ష్యంగా మాత్రమే కాకుండా, కోట్లాది మంది భారతీయుల రోజువారీ జీవితంలో వాస్తవంగా మారిందని గవర్నర్ పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈలకు రుణాల అందుబాటులో కీలక పాత్రభారతదేశంలోని విభిన్న వర్గాల ప్రజలను అధికారిక ఆర్థిక




వ్యవస్థతో ఫిన్‌టెక్ రంగం వేగంగా, తక్కువ ఖర్చుతో అనుసంధానించడంలో సహాయపడిందని మల్హోత్రా తెలిపారు. అదే సమయంలో ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని కూడా గణనీయంగా పెంచిందన్నారు. ఎంఎస్ఎంఈలకు రుణాల పంపిణీలో ఫిన్‌టెక్ ప్రభావం ఎక్కువని రుణాలు, అకౌంట్ అగ్రిగేటర్లు, యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ వంటి వ్యవస్థల ద్వారా చిన్న వ్యాపారాలకు రుణాలు అందుతున్నాయని చెప్పారు.

గతంలో సంప్రదాయ రుణ అంచనా విధానాలకు దూరంగా ఉన్న చిన్న వ్యాపారాలకు తక్కువ పూచీకత్తుతో అధికారిక రుణాలను అందించడం ద్వారా దేశంలోని ఎంఎస్ఎంఈ రుణ అంతరాన్ని పూడ్చడంలో ఫిన్‌టెక్ కంపెనీలు సహాయపడుతున్నాయని తెలిపారు

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.